




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 04 శనివారం | జనవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 109

Navabhoomi daily fallows..







## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

- ఫార్ములా ఈ-రేసింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఏసీబీ
- 6న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలని ఏసీబీ ఆదేశం
- దాన కిశోర్ నుంచి సేకరించిన సమాచారం
- ఈ సమాచారం ఆధారంగా దర్యాప్తు చేస్తోన్న ఏసీబీ

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసు లు జారీ చేసింది. ఫార్ములా ఈ-రేసింగ్ కేసును ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 6న ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని ఏసీబీ నోటీసుల్లో పేర్కొంది. అంటే వచ్చే సోమవారం కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ మున్సిపల్ శాఖ, ఫార్ములా ఈ-ఆపరేషన్స్ లిమిటెడ్ మధ్య జరిగిన ఒప్పందం, అందులో చోటు చేసుకున్న ఉల్లంఘనలపై అధ్యయనం చేస్తోంది. ఈ క్రమంలోనే కేసు ఫిర్యాదుదారు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ నుంచి పలు విడతలుగా సమాచారం సేకరించింది.

## అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్

- ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్‌కు భారీ ఊరట...
- సంధ్యథియేటర్ తొక్కిసలాట కేసులో భారీఊరట
- రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు
- రూ. 50 వేల 2పూచీకత్తులు సమర్పించాలని ఆదేశం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు భారీ ఊరటను కల్పించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. రూ. 50 వేల రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. రిమాండ్ ముగిసిన నేపథ్యంలో ఇటీవల జరిగిన కోర్టు విచారణకు అల్లు అర్జున్ వర్చువల్ గా హాజరయ్యారు. అదే రోజున రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాదులు పిటిషన్ వేశారు. రెగ్యులర్ పిటిషన్ పై విచారణ జరిపిన కోర్టు ఈరోజు తీర్పును వెలువరించింది. బన్నీకి రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడంతో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు

## అన్ని రంగాల్లో మనవాళ్లదే పైచేయి

- ప్రపంచ మార్కెట్ కైవసం చేసుకునే స్థాయికి తెలుగు సినీ పరిశ్రమ చేరడం గర్వకారణం: చంద్రబాబు
- గిడుగు రామ్మూర్తి, రామోజీరావు వంటి పెద్దలను స్మరించుకోవాలి
- వివిధ రంగాల్లో తెలుగువారు బ్రహ్మాండంగా రాణిస్తున్నారని హర్షం
- హైదరాబాదులో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు
- హాజరైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు


2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
హైదరాబాదులో ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో తెలుగు భాష ఔన్నత్యాన్ని, వివిధ రంగాల్లో తెలుగు వ్యక్తుల ఘనతలను కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధి కోసం శ్రద్ధ పెట్టిన గిడుగు రామ్మూర్తి పంతులుని, రామోజీరావు వంటి పెద్దలను ఒక్కసారి స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీరంతా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేశారని అన్నారు.
"రాజకీయాల్లో నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, జీఎంసీ బాలయోగి, వెంకయ్యనాయుడు... సుప్రీంకోర్టు సీజేఐగా జస్టిస్ కోకా సుబ్బారావు, జస్టిస్ ఎన్వీ రమణ వంటి తెలుగు వారు తమ పదవుల్లో రాణించారు. ఇవాళ తెలుగు వారు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు.
క్రీడల్లో కరణం మల్లీశ్వరితో ప్రారంభమైన ప్రస్థానం... పుల్లెల గోపీచంద్, ద్రోణవల్లి హారిక, వీవీఎస్ లక్ష్మణ్, వెంకటపతిరాజు, పీవీ సింధు, పెంటేల హరికృష్ణ, కోనేరు హంపి, మొన్ననే సెంచరీ కొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి వరకు ఎంతోమంది తెలుగువారు క్రీడల్లో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు.
మరోవైపు... మొన్నటివరకు చెన్నైలో ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమను హైదరాబాదుకు తీసుకురావాలని మేమంతా ప్రయత్నాలు చేశాం. ఇవాళ తెలుగు ఫిలిం ఇండస్ట్రీని చూస్తే భారతదేశంలోనే నెంబర్ వన్ చిత్ర పరిశ్రమగా

## ఇక జిల్లాల టూర్

- జనం పల్స్ పట్టేందుకు..జనంలోకి రేవంత్
- 16 నుంచి జిల్లాల పర్యటనలో సీఎం
- రైతు భరోసా లబ్ధిదారులతో స్వయంగా భేటీ
- పార్టీ బలోపేతానికి జిల్లా నేతలతో చర్చలు
- స్థానిక సంస్థల ఎన్నికలకోసమే టూర్?



హైదరాబాద్-నవభూమిబ్యూరో
రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. గడిచిన ఏడాదిలో పాలనపరంగా, రాజకీయంగా జరిగిన లోటుపాట్లను గ్రహించి వాటిపై పట్టు సాధించేందుకు మరింత దృష్టి పెట్టారు. అందుకు కోసం నేరుగా రంగంలోకి దిగి జిల్లాల పర్యటనకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 14 నుంచి 24 వరకు ఆస్ట్రేలియా, సింగపూర్, దావోస్లో ఆయన పర్యటించనున్నారు. ఆ తర్వాత హైదరాబాద్ చేరుకుని 26న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనను న్నారు. ఆ మరుసటి రోజు నుంచి జిల్లాల బాట. పట్టనున్నట్టు వినికిడి.
సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో యాత్రలు చేసేందుకు రేవంత్‌కు సమయం దొరక లేదు. కొద్ది రోజులకే పార్లమెంట్ ఎన్నికలు రావడం, ఆ తర్వాత పాలనపై పట్టుసాధించేం దుకు శాఖల వారీగా సమీక్షలు నిర్వహించేందుకే టైం సరిపోయింది. ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టి ఇటీవలే ఏడాది పూర్తయింది. దీనికి తోడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు భరోసా, రైతు కూలీలకు ఆర్థిక సాయం పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సీఎం భావిస్తున్నారు. అందుకోసం ఆయనే స్వయంగా రంగంలోకి దిగి, జిల్లాల్లో లబ్ధిదారులతో ప్రత్యేకంగా భేటీ అవ్వనున్నట్లు సమాచారం. దానితో పాటు జిల్లాల్లోని సీనియర్ లీడర్లు, కేడర్ తోనూ రేవంత్ భేటీ అవు తారని తెలిసింది..
జనం పల్స్ పట్టేందుకు రేవంత్ జిల్లాల పర్యటన చేయనున్నట్లు తెలుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అత్యధిక స్థానాలు సాధించే లక్ష్యంతో సరైన వ్యూహాలు పన్నేందుకు క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వం నుంచి సలహాలు,చర్చలు జరపనున్నట్లుగా కూడా వినవస్తోంది.

## హద్దుదాటుతోన్న చైనా

- బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్
- లద్దాఖ్‌లో కొత్తగా రెండు కౌంటీలు
- చైనా ఉల్లంఘనలపై భారత్ అభ్యంతరం
- దౌత్య మార్గాల ద్వారా చైనాకు నిరసన
- తెలియజేసినట్లు భారత విదేశాంగ ప్రతినిధి వెల్లడి

2



**న్యూఢిల్లీ-నవభూమి:** టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ డ్యామ్ నిర్మించేందుకు సిద్ధపడుతుండటం, లద్దాఖ్‌లోని సరిహద్దు ప్రాంతంలో కొత్తగా రెండు స్థావరాలను ఏర్పాటు చేయడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ రెండు అంశాలపై దౌత్య మార్గాల ద్వారా చైనాకు తమ నిరసన వ్యక్తం చేసినట్టు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ శుక్రవారంనాడు తెలిపారు.
రూ.8,400 కోట్ల విమానంలో తిరిగేది, రూ.10 లక్షల సూట్ వేసుకునేదెవరు?
"టిబెట్ అటానమస్ రీజియన్‌లో యార్లంగ్ జాంగ్బో నదిపై చైనా హైడ్రోపవర్ ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని 2025 డిసెంబర్ 25న జిన్హువా విడుదల చేయడం భారత్ దృష్టికి వచ్చింది. ఎగువ ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్టుల వల్ల దిగువన ఉన్న ప్రాంతాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాకు సూచించాం. పారదర్శకతతో పాటు దిగువ దేశాలతో సంప్రదింపులు జరపాల్సి అవసరాన్ని

## చైనాను వణికిస్తోన్న వైరస్

- శ్వాసకోశ ఇబ్బందులతో చైనా ఆసుపత్రుల్లో చేరుతున్న జనం
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు..మళ్లీ కనిపిస్తున్న మాస్కులు
- చైనాలో హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటాఫ్ న్యూమో వైరస్) వ్యాప్తి
- మళ్లీ లాక్ డౌన్ సమస్య వచ్చే అవకాశం?

2



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐదేళ్ల క్రితం కోవిడ్-19 తర్వాత తాజాగా చైనాను మరో వైరస్ వణికిస్తోంది. ఇందులో భాగంగా.. .హెచ్.ఎం.పీ.వీ. (హ్యూమన్ మెటాఫ్ న్యూమో వైరస్) వ్యాప్తి చైనాలో పెను సమస్యగా మారుతుందని అంటున్నారు. 'చైనా', 'వైరస్'... ఈ రెండు పదాలనూ కలిపి చదివితే ప్రపంచం వణికిపోతుంటుందని అంటారు. కారణం... సుమారు ఐదేళ్ల క్రితం చైనాలో పుట్టినట్లు చెప్పే కోవిడ్-19 వైరస్ ప్రపంచాన్ని వణికించింది. ఆ వణుకు ఛాయలు ఇప్పటికీ తగ్గలేదని చెప్పినా అతిశయోక్తి కాదేమో. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ఓ వైరస్ చైనాను వణికించడం మొదలుపెట్టింది. ఐదేళ్ల క్రితం కోవిడ్-19 తర్వాత తాజాగా చైనాను మరో వైరస్ వణికిస్తోంది. ఇందులో భాగంగా.. .హెచ్.ఎం.పీ.వీ. (హ్యూమన్ మెటాఫ్ న్యూమో వైరస్) వ్యాప్తి చైనాలో పెను సమస్యగా మారుతుందని అంటున్నారు. వెలువడుతున్న నివేదికలు, సోషల్ మీడియా పోస్టులు ఈ వైరస్ వ్యాప్తి తీవ్రతను సూచిస్తున్నాయి. ఈ వ్యాధి లక్షణాలు దాదాపు కరోనా వైరస్‌ను పోలి ఉండటంతో.. ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుందని అంటున్నారు. ఈ సమాంలో నెట్టింట దర్శనమిస్తున్న వీడియోలు... చైనాలోని ఆస్పత్రుల్లో మాస్కులు ధరించి, రద్దీగా ఉన్న దృశ్యాలను చూపిస్తున్నాయి. ఇదంతా కొత్త వైరస్ ఎఫెక్ట్ అని అంటున్నారు. మరికొంత మంది మాత్రం 2019 డిసెంబర్ 31న చైనాలో చిన్నగా మొదలైన కరోనా వైరస్.. మూడు నెలల్లోనే ప్రపంచమంతా వ్యాపించిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని.. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారని తెలుస్తోంది. అలాకానిపక్షంలో... మళ్లీ లాక్ డౌన్ పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని అంటున్నారంట. హ్యూమన్ మెటాఫ్ న్యూమో

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

- గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.1000 కోట్లు
- నెలకు రూ.150 కోట్లు చెప్పున విడుదల
- ఆర్థిక శాఖ అధికారులకు సీఎం ఆదేశం
- గ్రామీణ రహదారులపై రద్దీ పెరగడంతో విస్తరణ పనులు
- రాష్ట్రంలో ప్రతి గ్రామపంచాయతీకి బీటీ రోడ్డుండాలి

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.1000 కోట్లను సీఎం రేవంత్ రెడ్డి కేటాయించారు. ఈ రహదారుల నిర్మాణానికి జనవరి నుంచి నెలకు రూ.150 కోట్ల చొప్పున జూన్ నెలాఖరు నాటికి రూ.వెయ్యి కోట్లు విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖలపై సచివాయలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ రహదారులకు సంబంధించి సీఎం రేవంత్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గత కాలంలోని ఎడ్ల బండ్లు, సైకిళ్లు, మోటార్ సైకిళ్ల రాకపోకలకు అనుగుణంగా సింగిల్ లైన్, డబుల్ లైన్ రోడ్ల వెడల్పును నిర్ణయించారన్నారు. ప్రస్తుతం మారుమూల పల్లెల్లోనూ కార్లు, ట్రాక్టర్లు, ఇతర నాలుగు చక్రాల వాహ నాలు తిరుగుతున్నందున వాటి రాక పోకలకు వీలుగా ఆయా రహదారుల కొలతలను పునఃనిర్వచించాల్సి ఉందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్ పనుల వేగం పెంచాలన్న రేవంత్" ఆయా వాహనాలు ఆటంకాలు లేకుండా సాగిపోయేందుకు వీలుగా రహదారులను నిర్మించాలన్నారు సీఎం రేవంత్. తండాలు, గూడేలను పంచాయతీలు చేసినా వాటికి రహదారులు, పంచాయతీ, పాఠశాల భవనాల నిర్మాణాలను విస్మరించారని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్రంలో ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. బీటీ రోడ్డు లేని పంచాయతీ

## మణిపూర్‌లో మళ్లీ హింస!

- ఏకంగా ఎస్పీ కార్యాలయంపైనే రాళ్లతో దాడి, పలువురికి గాయాలు
- ఒక్కసారిగా పెద్ద ఎత్తున దాడికి దిగిన కుకీ మిలిటెంట్లు
- ఇంఫాల్‌ఈస్ట్ జిల్లాలో బంకర్లను కూల్చివేసేందుకు భద్రతా దళాలు ఆపరేషన్
- భద్రతా దళాలకు వ్యతిరేకంగా స్థానిక గ్రామాల్లో కుకీలు ఆందోళనలు



హైదరాబాద్-నవభూమిబ్యూరో
మణిపూర్ రాష్ట్రంలో మరోసారి అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. కాంగ్‌పోక్‌పీలో ఎస్పీ, డిప్యూటీ కమిషనర్ కార్యాలయంపై కుకీ మిలిటెంట్లు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పోలీసుల వాహనాలు ధ్వంసం కాగా.. ఎస్పీ సహా పలువురు పోలీసు సిబ్బందికి గాయాలయ్యాయి. ఒక్కసారిగా పెద్ద ఎత్తున వచ్చిన కుకీ మిలిటెంట్లు దాడికి దిగడంతో ఆ ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలో అక్రమ బంకర్లను కూల్చివేసేందుకు భద్రతా దళాలు ఇటీవల భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఈ నేపథ్యంలో భద్రతా దళాలకు వ్యతిరేకంగా స్థానిక గ్రామాల్లో కుకీలు ఆందోళనలు చేపట్టారు. దీంతో పోలీసులు వారిపై లాఠీచార్జ్ చేశారు. దీంతో కేంద్ర బలగాలను వెనక్కి పంపించాలంటూ మరోసారి ఆందోళనలకు దిగారు.' కేంద్ర బలగాలను వెనక్కి పంపించడంలో పోలీసు ఉన్నతాధికారులు విఫలమయ్యారంటూ శుక్రారం సాయంత్రం కుకీలు, కుకీ మిలిటెంట్లతోపాటు పెద్ద ఎత్తున వచ్చి భారీ ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే భద్రతా దళాలు వారిని అడ్డుకోవడంతో కాంగ్‌పోక్‌పీ జిల్లా ఎస్పీ కార్యాలయం, డీసీ కార్యాయం వైపు దూసుకెళ్త రాళ్లు, ఇతర ఆయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి.

## శేషాచలంలో బీటెక్ విద్యార్థుల అదృశ్యం

- శేషాచలం అడవి నుంచి లైవ్ లొకేషన్ పంపిన విద్యార్థి
- ఆచూకీకై ఫారెస్టు అధికారులతో పోలీసుల గాలింపు
- మిత్రులకు లొకేషన్ షేర్ చేసిన ఓ విద్యార్థి

2



**రైల్వేకోడూరు-నవభూమి:** అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శేషాచల అడవుల్లో బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారని సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు ఇక్కడి వాగేటికోన ప్రాంతంలో.. గుంజన జలపాతాలను చూడడానికి శుక్రవారం విహారయాత్రగా వచ్చారు. తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు తెలిసింది. రాత్రి కావడంతో ఆందోళన చెందిన వీరు.. ఫోన్ సిగ్నల్స్ రావడంతో మిత్రులకు సమాచారం అందించారు. మిత్రుల సలహా మేరకు లైవ్ సిగ్నల్స్ లొకేషన్ పంపించారు. వీరంతా అడవిలో తిరుగుతూ చివరకు రైల్వేకోడూరు అటవీ పరిధిలోని ఎస్.ఉప్పరపల్లి, ఎస్.కొత్తపల్లి ప్రాంతాల పరిధిలోకి రాగానే ఫోన్ సిగ్నల్స్ రావడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం

## తెలుగులో ఇక ప్రభుత్వ ఉత్తర్వులు

- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..
- వివిధ శాఖలకు సాధారణ పరిపాలనా శాఖ సూచన
- మొదట ఇంగ్లీష్‌లో ఉత్తర్వులు అప్‌లోడ్
- రెండు రోజుల తర్వాత తెలుగులో అప్‌లోడ్

2

**అమరావతి-నవభూమి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రభుత్వ ఉత్తర్వులను తెలుగులోనూ జారీ చేయాలని నిర్ణయించింది. ఇంగ్లీష్, తెలుగు.. రెండు భాషల్లోనూ ఉత్తర్వులు ఇవ్వాలని ఈ మేరకు వివిధ శాఖలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.
మొదట ఇంగ్లీష్‌లో ఉత్తర్వులు ఇచ్చి అప్‌లోడ్ చేయాలని.. ఆ తర్వాత రెండు రోజుల్లోగా తెలుగులోనూ అవే ఉత్తర్వులు జారీకి చర్యలు తీసుకోవాలని వివిధ శాఖలకు సాధారణ పరిపాలన శాఖ సూచించింది. ఉత్తర్వుల అనువాదానికి డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ సేవలు వినియోగించుకోవాలని జీఏడీ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.



## కవితకు మంత్రి పొన్నం స్ట్రాంగ్ కౌంటర్


**హైదరాబాద్-నవభూమి:** బీసీ డిక్లరేషన్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. బీసీల కోసం మాట్లాడుతున్నందుకు సోదరి కవితకి అభినందనలు అని అన్నారు. నాయకత్వం మధ్య గ్యాప్ ఉందనే కవిత మీటింగ్ పెట్టారని వ్యాఖ్యలు చేశారు. కవిత గతంలో బతుకమ్మ, తర్వాత జాగృతి ఇప్పుడు బీసీ నినాదం అందుకున్నారన్నారు. కొందరికి అధికారం మత్తు దిగి మస్తు గుర్తుకొస్తాయంటూ సెటైర్ విసిరారు. బీఆర్ఎస్ తమ పార్టీ పదవుల్లో బీసీలకు అవకాశమివ్వాలన్నారు. పార్టీ ఓనర్లలో తాను ఒకడిని అని ఈటెల రాజేందర్ అన్నందుకు మెడలు పట్టి బయటకి పంపారని విమర్శించారు. కవిత చేసే పనికి కొంత సంతోషం, కొంత బాధ కలుగుతోందన్నారు. పదేండ్లలో బీసీల కోసం మాట్లాడని వాళ్లు ఈరోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. బలహీన వర్గాలకు అవకాశం ఇవ్వకుండా తొక్కి పెట్టిన వాళ్లు ఈరోజు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మా పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయమైతే పార్టీలో చర్చిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరిగితే మాట్లాడే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. బీసీల శక్తి గుర్తించారు కాబట్టే కవిత బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. కవిత మీటింగ్‌కు జనాల కోసం బ్రతిమాలాడుతున్నారని సెటైరికల్ కామెంట్స్ చేశారు. ఎన్నికల సమయంలో తప్పా బీఆర్ఎస్ బీసీల కోసం ఏమైనా చేసిందా అని నిలదీశారు. ప్రగతి భవన్‌కు జ్యోతి రావ్ పూలే పేరు పెట్టుకున్నామని.. సావిత్రి భాయి పూలే జయంతిని మహిళా టీచర్ల దినంగా ప్రకటించామని తెలిపారు. కులగణన రిపోర్ట్ పబ్లిక్ డొమైన్‌లో పెడుతామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు.

## నాగోబా జాతరకు ముహూర్తం ఖరారు.. ఈ నెల 28న అర్ధరాత్రి మహాపూజతో ప్రారంభం



**హైదరాబాద్-నవభూమి:** ఆదివాసీల ఆరాధ్య దైవంగా.. ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో పూజలందుకునే నాగదేవతకు ఏటా పుష్యమాసం అమావాస్య రోజు రాత్రి నుంచి ఐదు రోజుల పాటు ఘనంగా వేడుకలు నిర్వహిస్తారు. ఈ జాతర కోసం దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు తరలివస్తారు. మహాపూజలో భాగంగా పవిత్ర గోదావరి నదీ జలంతో నాగదేవతకు అభిషేకంతో జాతర ప్రారంభమవుతుంది. కాగా, ఈ జాతరను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఏర్పాట్లపై అధికారులు సమీక్ష నిర్వహించారు. దేశంలోనే రెండో అతిపెద్ద ఆదివాసీ గిరిజన సంబరం నాగోబా జాతర ఈ నెల 28న ప్రారంభం కానుంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఏటా పుష్య అమావాస్య రోజున నాగోబా జాతర అర్ధరాత్రి మహాపూజతో ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి 5 రోజుల పాటు జాతర ఘనంగా జరుగుతుంది. ఈ ఏడాది 28న అమావాస్య కావడంతో ఆ రోజున అర్ధరాత్రి పూజలు చేసి.. జాతరను ప్రారంభిస్తారు. ఈ జాతరలో కీలమైన మూడోరోజు నిర్వహించే గిరిజన దర్బార్ ఈ నెల 31న జరగనుంది. జాతర ఏర్పాట్లకు సంబంధించి గురువారం కేస్లాపూర్‌లో అధికారులు సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఉట్నూరు ఐటీటీఏ పీవో ఖుష్బూగుప్తా, ఎస్పీ గౌష్ ఆలం, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ సహా అధికారులు ముందుగా నాగోబాను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం జాతర ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలను ఈ జాతరకు ఆహ్వానించాలని నిర్ణయించారు. జాతర పూర్తయ్యే వరకు కేస్లాపూర్ చుట్టుపక్కల 5 కి.మీ.ల పరిధిలో మద్యం విక్రయాలపై నిషేధం విధించనున్నారు. గురువారం నెలవంక దర్శనమివ్వడంతో తొలిఘట్టంగా ఏడు రోజుల పాటు సాగే ప్రచార రథం శుక్రవారం కేస్లాపూర్‌లో బయలుదేరనుంది. మెస్రం వంశీయుల ప్రత్యేక పూజల అనంతరం రథం కదులుతుంది. స్వాతంత్ర్యం రాకముందు నిజాం పాలనలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు నివసిస్తున్న తండాలు, గూడేలకు, గ్రామాలకు కనీస సౌకర్యాలు ఉండేవి కావు. వారు అనేక ఇబ్బందులు పడుతున్న రోజులవి.. మరోవైపు స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా సాగుతోంది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆదివాసీ బిడ్డ, తెలంగాణ యోధుడు కొమరం భీమ్ పోరాటం చేసి అమరుడయ్యారు. ఈ పోరాటం నిజాం గుండెల్లో వణుకుపుట్టించింది. దీంతో ఆదివాసీల సమస్యలపై దృష్టి సారించిన నిజాం.. వారి జీవన విధానంపై అధ్యయనం కోసం హైమన్ డార్ఫ్ దంపతులను ప్రాంతానికి పంపారు. ఆదివాసీల జీవన విధానంపై అధ్యయనం చేస్తున్న ఆస్ట్రియాకు చెందిన హైమన్ డార్ఫ్ దంపతులను నాగోబా జాతర బాగా ఆకర్షించింది.. దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు ఈ జాతరకు వచ్చి మహాసమ్మేళనంగా పాల్గొనడం, వారి సంస్కృతి, సాంప్రదాయాలు ఆ దంపతులను ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ఆదివాసీల సమస్యలపై కూడా డార్ఫ్ దంపతులు దృష్టి పెట్టారు. నాగోబా జాతర సందర్భంగా గుమికూడిన ఆదివాసీల సమస్యలు తెలుసుకునేందుకు జాతర చివరి రోజున వారితో సమావేశం నిర్వహించేవారు..అదే దర్బార్.. ఈ దర్బార్ లో ఆదివాసీలను సమస్యలను తెలుసుకొని నిజాం ప్రభువుకు అందించేవారు. అలా మొదటగా 1942లో దర్బార్ నిర్వహించారు. ఆ ఆచారం నేటికీ కొనసాగుతుంది.

## ఘోర ప్రమాదం.. అదుపుతప్పి ఆటోలపై దూసుకెళ్లిన కారు.. స్పాట్‌లోనే ముగ్గురు మృతి



**సంగారెడ్డి జిల్లా -నవభూమి:** ఎదురెదురుగా వస్తున్న ఆటో.. కారు ఒకదానినొకటి ఢీకొట్టడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు. సంగారెడ్డి జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారు అతివేగంతో వచ్చి అదుపుతప్పి.. ఎదురుగా వస్తోన్న ఆటోలను ఢీకొట్టినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఆటోలు.. కారు ఢీకొన్నాయి. నర్సాపూర్ పట్టణ సమీపంలోని మెదలమ్మ గుడి వద్ద అతివేగంతో ప్రయాణిస్తోన్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రెండు ఆటోలపై దూసుకెళ్లింది. దీంతో ప్రమాదంలో ఆటోలోని ముగ్గురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కారులోని ఉన్నవారికి కూడా గాయాలయ్యాయి. కారు నర్సాపూర్ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన నలుగురిని సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి.. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. వేగంగా వచ్చి ఆటోలను ఢీకొట్టడం వల్ల అందులోని ఉన్న ప్రయాణికులు చెల్లాచెదురుగా పడిపోయారు. ఘటనా స్థలిలో బీతావాహ పరిస్థితి నెలకుంది. కొద్దిసేపు ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆటోలు, కారును పక్కకు తొలగించిన ట్రాఫిక్‌ను పోలీసులు పునరుద్ధరించారు. అయితే, ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. గురువారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా అల్మియాపేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోగా.. మరొకరు గాయపడ్డారు. అతివేగంగా బైక్‌తో వచ్చిన యువకులు.. డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన మహమ్మద్ వాజిద్, మహమ్మద్ పాషాలను స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పాషా మృతిచెందాడు. వాజిద్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతడ్ని మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు అధికారులు తెలిపారు. అతడి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఇక, మహమ్మద్ వాజిద్, మహమ్మద్ పాషాలు కొన్ని వస్తువులు కొనుగోలు చేయడానికి జోగిపేటకు వచ్చి.. తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

### అవి అబద్ధమైతే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటా..

## కవిత సంచలన ఛాలెంజ్



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఛాలెంజ్ చేశారు. బీసీలకు కాంగ్రెస్, బీజేపీ అడుగడుగునా అన్యాయం చేశాయంటూ తాను చెప్పిన విషయాన్ని ఏ ఒక్కటి అబద్ధమని నిరూపించినా తాను రాజకీయాల్లో నుంచి పూర్తిగా తప్పుకుంటానని కవిత స్పష్టం చేశారు. దేశంలో బీసీలకు ప్రాంతీయ పార్టీలే న్యాయం చేశాయని కవిత చెప్పుకొచ్చారు. ఈ మేరకు.. ఇందిరాపార్కులో నిర్వహించిన బీసీ మహాసభలో కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికార ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు, సవాళ్లు ప్రతిసవాళ్లు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. సంచలన ఛాలెంజ్ విసిరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అడుగడుగునా బీసీలకు అన్యాయం చేశాయని ఆరోపించిన కవిత.. ఈ రెండు జాతీయ పార్టీలు బీసీలకు చేసిన ద్రోహంపై తాను చెప్పిన విషయాల్లో ఏ ఒక్కటి అవాస్తవం అని తేల్చినా శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని కవిత ఛాలెంజ్ చేశారు. దేశంలో బీసీలకు ఎవరైనా న్యాయం చేశారంటే అది కేవలం ప్రాంతీయ పార్టీలు మాత్రమేనని కవిత స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించిన బీసీ మహాసభలో పాల్గొన్న కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే జనాభా గణనలో కులగణన చేయాలని బీజేపీని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు పోతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేసిన కవిత.. కర్ణాటక, బిహార్, మహారాష్ట్ర ఫెయిల్యూర్ స్టోరీ తెలియకుండానే హామీ ఇచ్చారా అని ప్రశ్నించారు. బీసీల లెక్కలపై ఒక కమిషన్ వేస్తే మరో కమిషన్ రిపోర్టు ఇస్తుందని.. ఇది న్యాయస్థానాల్లో నిలుస్తుందా అని అడిగారు. ఈ కుట్రపై కాంగ్రెస్ జవాబు చెప్పాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. జవహర్ లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన కమిషన్ రిపోర్టును ఆయనే తిరస్కరించడమనేది బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం కాదా అని కవిత ప్రశ్నించారు. 1955లో నెహ్రూ ఆ నివేదికను తిరస్కరిస్తే ఆ తర్వాత 25 ఏళ్లు ఎవరూ బీసీల గురించి పట్టించుకోలేదని గుర్తు చేశారు. పదేళ్లు బీసీలు గుర్తుకురాలేదా అని తమను ప్రశ్నించేవారికి కాంగ్రెస్ చరిత్ర అంతా చెప్తామన్నారు. నెహ్రూ, ఇందిరమ్మ రాజ్యంలో బీసీలకు పూర్తిగా అన్యాయం చేశారని మండిపడ్డారు. సోనియమ్మ రాజ్యంలో 2011లో రూ. 4500 కోట్లు వెచ్చించి కులగణన చేసి.. ఇప్పటివరకు ఆ నివేదిక బయటపెట్టలేదని దుయ్యబట్టారు. బీజేపీ కూడా ఆ రిపోర్టును బయటపెట్టకపోగా.. కులగణనకు వ్యతిరేకం అని బహిరంగంగానే చెబుతుందని కవిత నిప్పులు చెరిగారు. మరోవైపు.. సావిత్రిబాయి పూలే జన్మదినం దేశంలో ఉన్న మహిళలందరికీ పండగ రోజు కవిత చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో మహిళలంతా చదువుకుంటున్నారంటే.. అది ఆమె కృషేనని కొనియాడారు. చాలామంది దేశంలో కులం లేదని చెబుతున్నారని.. కానీ కులం ఉంది నిజం కాబట్టే రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు కులాలకు రక్షణ కల్పించారని చెప్పుకొచ్చారు. అయితే బీసీలకు రాజ్యాంగంలో రక్షణ దొరికి ఉంటే ప్రస్తుతం.. దేశం అభివృద్ధిలో అమెరికాను దాటేదని కవిత అభిప్రాయపడ్డారు.

### ఎన్నాళ్లీ సాగదీత.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై

## సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఫోన్లను ట్యాప్ చేశారనే ఆరోపణలు తెలంగాణలో ప్రకంపనలు రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఆయన విచారణకు వస్తే గానీ ఈ కేసులో ముందుకెళ్లే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ ఏం చెబితే తాము అలాగే చేశాం తప్పా.. ఇందులో మేము చేసింది ఏమీ లేదని నిందితులు చెబుతున్నారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసుపై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నాళ్లు దర్యాప్తు చేస్తారని, నెలల తరబడి కొనసాగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అంతేకాదు, దర్యాప్తు పూర్తయ్యే వరకూ నిందితులు జైల్లోనే ఉండాలనడం భావ్యం కాదని, ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ4గా ఉన్న మాజీ ఏఎస్పీ తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన పాత్రపై దర్యాప్తు ఎప్పటిలోపు పూర్తిచేస్తారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. దీనికి రెండు వారాల సమయం కావాలని విజ్ఞప్తి చేయడంతో ఈ నెల 27కు విచారణ వాయిదా వేసింది. ఈలోగా పూర్తి వివరాలతో కూడిన అఫిడివిట్‌ను దాఖలు చేయాలని ఆదేశించింది.

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో సీనియర్ లాయర్ సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. తన క్లయింట్ గత 9 నెలలుగా కస్టడీలోనే ఉన్నారని, దర్యాప్తు ఇప్పటికీ కొనసాగుతోందని ధర్మాసనానికి తెలిపారు. దర్యాప్తు తీరు చూస్తే మరో నాలుగైదేళ్లు జైల్లోనే ఉండాల్సి వస్తుందేమోనని, గతంలో పలు కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకొని బెయిల్ ఇవ్వాలని కోరారు. దీనిపై సిద్ధార్థ లూథ్రా అభ్యంతరం తెలుపుతూ.. నిందితుడు హైకోర్టు జడ్జిలను కూడా వదిలిపెట్టకుండా అందరి ఫోన్లు ట్యాప్‌చేశారని అన్నారు. ఈ కేసులో తవ్వేకొద్ది విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. దర్యాప్తు కీలక దశలో ఉన్న తరుణంలో అతడు బయటికొస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని చెప్పారు. అతడి వాట్సప్ డేటా సమాచారం కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయిస్తే.. ఇంతవరకూ దానికి సమాధానం ఇవ్వకుండా కాలయాపనచేస్తున్నారని ఆరోపించారు. పిటిషనర్ స్పందించని కారణంగానే దర్యాప్తులో జాప్యం జరుగుతోందని అన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న జోక్యంచేసుకుంటూ.. "హైకోర్టు సుమోటోగా తీసుకున్న ఈ కేసులో ఫోన్ ట్యాపింగ్, డేటాను మాయంచేయడం ఈ రెండు ప్రధాన ఆరోపణలు ఉన్నాయి... ఇదివరకున్న ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పిటిషనర్ నడుకున్నాడు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారుతుందని గ్రహించి స్వీయ రక్షణ కోసం డేటాను మాయం చేశాడు.. వ్యక్తిగత డివైజ్‌లలోకి నిఘా డేటాను బదిలీ చేశాడు... దీన్ని సాధారణ కేసుల్లా పరిగణించడానికి వీల్లేదు. ఈ కేసులో సాక్ష్యాలను సంరక్షించడం అత్యంత కీలకం.. నిందితుడు బయటికొస్తే సాక్ష్యాలను తారుమారుచేసే అవకాశం ఉండదా..?' అని నిందితుడు తరఫు లాయర్ సిద్ధార్థ దవేని ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానం ఇస్తూ.. ఫోన్ ట్యాపింగ్ చట్టవిరుద్ధమని చెబుతున్నప్పుడు డేటా ఉందా? లేదా? అనేది అప్రస్తుతమన్నారు. డేటా మాయం కేసులో పిటిషనర్ పాత్ర గురించి ఎక్కడా పేర్కొనలేదని వివరించారు. అంతేకాదు, ప్రభుత్వం మారిన తర్వాత పరారైన వ్యక్తిని వెనక్కి రప్పించలేక నెలలుగా జైల్లో ఉంచారని, ఇందులో సెక్షన్ 409 తప్పితే మిగిలినవి తీవ్రమైనవి కావన్నారు. ఈ సందర్భంగా పిటిషనర్ పాత్రపై దర్యాప్తు ఎప్పటిలోపు పూర్తిచేస్తారో? తెలంగాణ ప్రభుత్వాన్ని అడిగి చెప్పాలని సిద్ధార్థ లూథ్రాను జస్టిస్ నాగరత్న కోరారు. సాక్ష్యాలను భద్రంగా ఉంచడం అత్యంత ముఖ్యమని, ఇక్కడ ఇరుపక్షాల ప్రయోజనాల మధ్య సమతౌల్యత పాటించాలని వ్యాఖ్యానించారు. ఇందులో వ్యక్తిగత స్వేచ్ఛ కూడా ఇమిడి ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

## అన్ని రంగాల్లో మనవాళ్లదే పైచేయి

(1వపేజీ తరువాయి)తయారైంది. ప్రపంచ మార్కెట్ ను కైవసం చేసుకునే స్థాయికి తెలుగు చిత్ర పరిశ్రమ చేరుకోవడం మనందరికీ గర్వకారణం.

కూచిపూడి నృత్యం గురించి చెప్పుకోవాల్సి వస్తే... ఆ కళా రూపం మన సొంతం. ఎన్నో ఏళ్లుగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ఉన్న బతుకమ్మ కూడా ఇలాంటిదే.

పొట్టి శ్రీరాములు సంకల్పం మనలో ఉంది... టంగుటూరి ప్రకాశం పంతులు గుండె ధైర్యం మనలో ఉంది... అల్లూరి సీతారామరాజు పౌరుషం మనలో ఉంది... ఎన్టీఆర్ ఆత్మాభిమానం మనలో ఉంది... పీవీ నరసింహారావు చాణక్యనీతి, తెలివితేటలు మనలో ఉన్నాయి... ఇవన్నీ ఉండగా నా ఆకాంక్ష ఒక్కటే. 2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్ కమ్యూనిటీ ఏదంటే... దానికి చిరునామాగా తెలుగు జాతి ఉండాలనేదే నా ఆకాంక్ష. అది జరగాలంటే ఒక సంకల్పం ఉండాలి. అందుకోసం కృషి చేయాలి.

ఒకప్పుడు హార్డ్ వర్క్ చేసేవారు... కానీ ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాలి. ఒకప్పుడు కష్టపడి పనిచేయాలని చెప్పేవారు. కానీ ఇప్పుడు టెక్నాలజీ వచ్చింది... స్మార్ట్ గా పనిచేస్తే ఏదైనా సాధ్యమే అని చెబుతున్నా. టెక్నాలజీ వల్ల నష్టాలు ఉన్నాయి, దీని వల్ల మానవ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయని చాలామంది అంటున్నారు. అయితే టెక్నాలజీని సరైన రీతిలో ఉపయోగిస్తే ప్రపంచాన్ని కూడా శాసించే శక్తి వస్తుంది. అదే టెక్నాలజీకి బానిసగా మారి, దుర్వినియోగం చేస్తే పిచ్చి పట్టే పరిస్థితి వస్తుంది!

ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలను ఏర్పాటు చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. భగవంతుడు నాకు ఎంత శక్తి ఇస్తాడో అంత శక్తినీ ఉపయోగించి... తెలుగుజాతిని నెంబర్ వన్ చేసేందుకు ఏమేం చేయాలో అవన్నీ చేస్తాను. తెలుగు జాతి అంతా ఒక్కటే... మనకు విభేదాల్లేవు. అన్ని విషయాల్లో తెలుగు వారు సమష్టిగా దూసుకుపోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఇలాంటి మహాసభల వల్ల మనలో ఉన్న సంకల్పం పట్ల పునరంకితం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది" అని చంద్రబాబు వివరించారు.

## తెలుగులో ఇక ప్రభుత్వ ఉత్తర్వులు

(1వపేజీ తరువాయి)పాలనా వ్యవహారాలు, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే జారీ చేసేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల విజయవాడలో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభ తీర్మానించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల తెలుగు కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఇలావుండగా, హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహా సభలను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలెడ్జ్ ఎకనాలో తెలుగువారు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని అన్నారు. ఏఐ, డీప్ టెక్నాలజీని తెలుగువాళ్లు అందిపుచ్చుకోవాలన్నారు. ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలిసారి ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు ప్రారంభయ్యాయని గుర్తు చేశారు. అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు.. శ్రీకాకుళం నుంచి పాలమూరు వరకు ఎక్కడ ఉన్నా తెలుగు వారంతా ఒక్కటేనని అన్నారు. అదే తెలుగు జాతి అని వ్యాఖ్యానించారు. తెలంగాణ, ఏపీ, ఆస్ట్రేలియా, అమెరికా.. ఇలా ప్రపంచ నలుమూలల నుంచి ఇక్కడికి తెలుగువారు వచ్చారన్నారు.

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

(1వపేజీ తరువాయి)ఇటీవల దాన కిశోర్ ను ఏడు గంటల పాటు విచారించిన ఏసీబీ పలు వివరాలను తీసుకుంది. దాన కిశోర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకువెళుతోంది. ఈ క్రమంలోనే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.

ప్రాథమిక దర్యాప్తు క్రమంలో ఎంఏయూడీ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా, ఒప్పందంలో చోటు చేసుకున్న పలు కీలక ఉల్లంఘనలు ఉన్నట్టు ఏసీబీ భావిస్తోంది. వీటి ఆధారంగా నిందితులను విచారించే అవకాశం కనిపిస్తోంది.

## అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్

(1వపేజీ తరువాయి)ఊపిరి పీల్చుకున్నారు. కాగా, బెయిల్ మంజూరు సందర్భంగా కోర్టు అల్లు అర్జున్ కు పలు షరతులు విధించింది. ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ లో హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను ప్రభావితం చేయరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అల్లు అర్జున్ తరఫు న్యాయవాది అశోక్ రెడ్డి వెల్లడించారు.

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

(1వపేజీ తరువాయి)ఉండకూడదని తేల్చి చెప్పారు. గ్రామాల నుంచి మండలాలకు సింగిల్ రోడ్లు, మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు కచ్చితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గుంతలు పడిన రహదారులకు వెంటనే మరమ్మ తులు ప్రారంభించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రహదారుల నిర్మాణ ప్రమాణాల్లో తేడాలు ఉన్నాయని.. ఇక ముందు అలా ఉండడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు.

## హద్దుదాటుతోన్న చైనా

(1వపేజీ తరువాయి)కూడా వారి దృష్టికి తెచ్చాం" అని జైశ్వాల్ తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి మన దేశ ప్రజలను విఘాతం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

**కొత్త కౌంటీలు చట్టవిరుద్ధం**

చైనాలోని హెూటాన్ ప్రాంతంలో కొత్తగా రెండు కౌంటీల నిర్మాణానికి సంబంధించిన ప్రకటన కూడా తాము చూసామని, ఈ కౌంటీల్లో కొంత భాగం లద్దాఖ్ పరిధిలోకి వస్తుందని జైశ్వాల్ తెలిపారు. భారత భూభాగాన్ని చైనా ఆక్రమించడాన్ని అంగీకరించలేదని, కొత్త కౌంటీలు ఏర్పాటు వల్ల భారత్‌కు చిరకాలంగా ఉన్న సార్వభౌమాధికారంపై ఎలాంటి ప్రభావం ఉండదన్నారు. చట్టవిరుద్ధమైన ఆక్రమణలు, బలవంతపు ఆక్రమణల వల్ల చట్టబద్ధత లభించదని ఆయన స్పష్టం చేశారు.

## చైనాను వణికిస్తోన్న వైరస్

(1వపేజీ తరువాయి) వైరస్ లక్షణాలు!: దగ్గు జ్వరం గొంతు నొప్పి ముక్కు కారడం శ్వాస సరిగా ఆడకపోవడం శరీరంపై దద్దుర్లు ఇది ఎలా సంక్రమిస్తుంది: హ్యూమన్ మెటాఫ్ న్యూమో వైరస్ అనేది.. అది కలిగి ఉన్న వారితో ప్రత్యక్ష పరిచయం ద్వారా లేదా.. వైరస్ తో కలుషితమైన వస్తువులను తాకడం ద్వారా వ్యాపిస్తుందని చెబుతున్నారు. అంటే... ఉదాహరణకు... షేక్ హ్యాండ్స్ ఇచ్చుకోవడం, కౌగిలించుకొవడం, ముద్దు పెట్టుకోవడం తో పాటు ఫోన్స్, కీబోర్డ్స్, డోర్ హ్యాండిల్స్ వంటి వస్తువులను తాకడం ద్వారా కూడా వ్యాపిస్తుందని అంటున్నారు.

**కొత్త వైరస్ కథనాలపై స్పందించిన చైనా**

హెచ్ఎంపీవీ వైరస్ విషయమై వస్తోన్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని చైనా తెలిపింది. చైనాలో కొత్త వైరస్ హెచ్ఎంపీవీ కారణంగా ఆసుపత్రుల్లో రద్దీ పెరిగిందని కథనాలు వచ్చాయి. దీంతో చైనా విదేశాంగ శాఖ ఈ కథనాలపై స్పందించింది. కొత్త వైరస్ కారణంగా ఆసుపత్రుల్లో రద్దీ పెరిగిందన్న నివేదికలను కొట్టిపారేసింది. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల తీవ్రత సహజమేనని, అయినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే తీవ్రత తక్కువగా ఉందని తెలిపింది.

విదేశీయులు తమ దేశంలో పర్యటించేందుకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సురక్షితమేనని హామీ ఇచ్చింది. చైనా పౌరులతో పాటు తమ దేశంలోని విదేశీయుల ఆరోగ్యంపై తమ ప్రభుత్వం శ్రద్ధ చూపుతుందని వెల్లడించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ వెల్లడించారు. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల నిర్మూలన, నియంత్రణకు సంబంధించి తమ దేశానికి చెందిన నేషనల్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు.

హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుందని చెబుతున్నారు. దగ్గు, తుమ్ములతో బాధపడే వారి తుంపర్లు, వైరస్ బారిన పడిన వ్యక్తులతో సన్నిహితంగా ఉండటం, కరచాలనం చేయడం, తాకడం వంటి చర్యలతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని డాక్టర్లు చెప్పారు. చిన్న పిల్లలు, వృద్ధులు దీని బారిన పడే అవకాశాలు ఎక్కువ. 2001లోనే హెచ్ఎంపీవీని గుర్తించారు. ఈ వైరస్‌కు వ్యాక్సిన్ లేదా నిర్దిష్టమైన చికిత్స లేదు. లక్షణాలకు అనుగుణంగా చికిత్స ఉంటుంది.

## శేషాచలంలో బీటెక్ విద్యార్థుల అదృశ్యం


(1వపేజీ తరువాయి) ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు రేణిగుంట పోలీసులు కోడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హేమసుందర్‌రావు ఆదేశాల మేరకు కోడూరు ఎస్ఐ నవీన్ బాబు తమ సిబ్బందితో అటవీశాఖ అధికారులతో కలిసి అడవిలో జల్లెడ పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే వారి ఆచూకీ త్వరగా లభిస్తుంది. తప్పిపోయిన విద్యార్థుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

## ప్రజా వాణి.. ఉత్త ప్రహసనం!

**హైదరాబాద్-నవభూమి:** సీఎం క్యాంపు ఆఫీసులో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ఉత్త ప్రహసనంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు చెబుతున్న ప్రజాపాలన ప్రజాపీడనగా మారిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీఐ కింద అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం.. 2024 డిసెంబరు 9నాటికి ప్రజలనుంచి ప్రజావాణికి 82,955 పిటిషన్లు వచ్చాయని, అందులో కేవలం 43,272 పిటిషన్లు మాత్రమే గ్రీవెన్సెస్ కిందకు వస్తాయని మిగతావి దాని పరిధిలోకి రావని చెబుతున్నారన్నారు.

అంటే... సగం దరఖాస్తులను అధికారులు తిరస్కరించినట్లు కనబడుతోందన్నారు. గ్రీవెన్స్ పరిధిలోకి వచ్చే.. 43,272ఫిర్యాదుల్లోనూ 27,215 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయని అధికారులు చెబుతున్నా.. అందులోనూ వాస్తవంలేదన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
శనివారం
04 । జనవరి । 2025



## ప్రేమ కోసమై 'జైలు పాలాయనే'..



**లహోర్ -నవభూమి:** ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన పాక్ యువతి కోసం దేశ సరిహద్దులు దాటి జైలు పాలయ్యాడో భారతీయ యువకుడు. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన బాదల్ బాబు అనే వ్యక్తికి కొన్ని రోజుల క్రితం పాకిస్థాన్‌లోని లాహోర్‌కు చెందిన సనా రాణి అనే యువతి ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారింది. చాలా రోజుల నుంచి మెసేజ్‌లు, ఫోన్ల ద్వారా ప్రేమాయణం నడిపిన వీరు కలవాలని నిర్ణయించుకున్నారు. తన వద్ద వీసా, పాస్‌పోర్టు లేకపోయినా ప్రేయసి కోసం గతంలో రెండు సార్లు పాక్ వెళ్లేందుకు బాబు విఫలయత్నం చేశాడు. అయినా పట్టువదలని బాబు.. ఇటీవల అక్రమంగా దేశసరిహద్దు దాటి పాక్‌లోని బహౌద్దని జిల్లాకు చేరుకున్నాడు. ఈ క్రమంలో రాణి, బాబు ఓ ప్రదేశంలో కలుసుకొని మాట్లాడుకుంటుండగా పోలీసులకు అనుమానం వచ్చి అతన్ని ప్రశ్నించారు. బాబు వద్ద సరైన పత్రాలు లేవని తెలుసుకున్న అధికారులు అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీంతో విచారణ జరిపిన సదరు కోర్టు బాబుకు 14 రోజుల రిమాండ్ విధించింది. అయితే అమ్మాయిని పోలీసులు విచారించగా.. బాబును పెళ్లి చేసుకోడం ఇష్టంలేదని చెప్పడం కొసమెరుపు.

## మహారాష్ట్ర సీఎంను మెచ్చుకున్న శివసేన ఉద్ధవ్ టీం



**ముంబై - నవభూమి:** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌పై .. ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన వర్గం ప్రశంసలు కురిపించింది. వాస్తవానికి బీజేపీ, శివసేన మధ్య 2019లో బ్రేకప్ వచ్చిన విషయం తెలిసిందే. నక్సల్ ప్రభావిత గచ్చిరోలీ జిల్లాను స్టీల్ సిటీగా మార్చాలని ఫడ్నవీస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ ప్రాజెక్టుపై శివసేన పత్రిక సామ్నా స్పందించింది. ఫడ్నవీస్ ప్రయత్నాలను ఆ పత్రికలో ప్రశంసించారు. ఫడ్నవీస్‌ను దేవ బాబుగా పోల్చుతూ సామ్నా కథనం రాసింది. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో ఉన్న గచ్చిరోలీని ఫడ్నవీస్ విజిట్ చేశారని, అక్కడ కొత్త సంవత్సరం సందర్భంగా అభివృద్ధికి బీజం వేసినట్లు ఆ కథనంలో సామ్నా తెలిపింది. శివసేన ఎంపీ సంజయ్ రౌత్ కూడా ఫడ్నవీస్ ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు.

## అక్కను ఎక్కువగా ఇష్టపడుతోందని.. తల్లిని చంపిన కుమార్తె




**ముంబై - నవభూమి:** అక్క పట్ల ఎక్కువగా ఇష్టం చూపుతున్న తల్లిపై చిన్న కుమార్తె ద్వేషం పెంచుకున్నది. తనను చూసేందుకు ఇంటికి వచ్చిన ఆమెతో ఘర్షణ పడింది. ఈ నేపథ్యంలో కత్తితో పొడిచి తల్లిని హత్య చేసింది. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. 63 ఏళ్ల సబీరా బానో తన కుమారుడితో కలిసి ముంబ్రాలో నివసిస్తున్నది. 41 ఏళ్ల చిన్న కుమార్తె రేష్మా ముజఫర్‌ను చూసేందుకు గురువారం రాత్రి కుర్లాలోని ఖురేషీ నగర్‌లోని ఆమె ఇంటికి వెళ్లింది.కాగా, తల్లి సబీరా అక్క పట్ల ఎక్కువ ప్రేమ చూపడంపై చిన్న కుమార్తె రేష్మా ద్వేషం పెంచుకున్నది. ఈ నేపథ్యంలో తనను చూసేందుకు ఇంటికి వచ్చిన ఆమెతో ఈ విషయంపై వాగ్వాదానికి దిగింది. ఇది కాస్తా వారి మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో వంట గదిలోని కత్తితో వృద్ధురాలైన తల్లి సబీరాను కుమార్తె పొడిచింది. ఆమె మరణించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రేష్మా మానసిక పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు ప్రమాణ స్వీకారం




**న్యూఢిల్లీ -నవభూమి:** ఒడిశా గవర్నర్ గా కంభంపాటి హరిబాబు ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చక్రధారి శరణ్ సింగ్ ప్రమాణం చేయించారు. రాజధాని భువనేశ్వర్ లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్, మాజీ సీఎం నవీన్ పట్నాయక్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కంభంపాటి హరిబాబు 2021 జులైలో తొలిసారి మిజోరం గవర్నర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్ రాజీనామాతో.. ఆయన స్థానంలో కంభంపాటి హరిబాబును నియమిస్తూ గతేడాది డిసెంబర్‌లో కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా . ఇవాళ మణిపూర్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది.దేశంలోని ఐదు రాష్ట్రాలకు కేంద్రం గవర్నర్లను నియమించిన విషయం తెలిసిందే. బీహార్ గవర్నర్‌గా ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, కేరళ గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు, మిజోరం గవర్నర్‌గా జనరల్ విజయ్ కుమార్ సింగ్, మణిపూర్ గవర్నర్‌గా కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను నియమించింది. ఈ మేరకు గత నెల 24న రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే.

## గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తున్న వందే భారత్ స్లీపర్ రైలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు మార్గాల్లో ఈ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. 2019లో ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలో రైల్వేశాఖ స్లీపర్ వర్షన్ అందుబాటులోకి తెచ్చింది. ఈ వందే భారత్ స్లీపర్ రైళ్లు మరికొన్ని రోజుల్లో పట్టాలెక్కించేందుకు రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఈ రైలుకు ట్రయల్ రన్స్ చేపడుతున్నారు. రైలు వేగాన్ని పెంచేందుకు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు.తాజాగా రాజస్థాన్‌లోని కోటా రైల్వే డివిజన్‌లో వందే భారత్ స్లీపర్ రైలుకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో రైలు గరిష్ఠంగా గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఈ వీడియోలో రైలు గంటలకు 180 కిలోమీటర్ల వేగంతో పట్టాలపై రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది.

## రాబోయే ఐదేళ్లలో కాలుష్య రహిత నగరంగా ఢిల్లీని తీర్చిదిద్దుతాం : కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**ముంబై - నవభూమి:** రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశ రాజధాని రవాణా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. గత నవంబర్ నుంచి ఢిల్లీలో కాలుష్య స్థాయి ఎక్కువగానే ఉన్నది. కాలుష్యాన్ని తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీలో బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ కార్లను రెండుసార్లు నిషేధించారు. ఇటీవల గాలి నాణ్యత సూచీ 350 వరకు చేరింది. కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ .. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 కింద ఆంక్షలు మళ్లీ తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కార్లపై మరోసారి నిషేధం విధించే అవకాశం ఉంది. అయితే, ఢిల్లీలోని వాతావరణ కాలుష్యానికి కారణాల్లో వాహనాలు ఉద్గారాలు సైతం ఒకటి. ఢిల్లీ రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడిని కేంద్రమంత్రి తెలిపారు.%అదనంగా రూ.12500 కోట్ల సీఆర్ఐఎఫ్ ఫండ్‌ని సైతం ప్రకటించారు. ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడానికి రహదారుల మంత్రిత్వ శాఖ ఏయే ప్రాజెక్టులను ప్రారంభించబోతుందో ఆయన వివరించారు. వాయు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో ఢిల్లీ ఇబ్బందులపడుతుందని.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఢిల్లీని ఆయా సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించిందన్నారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాల ఒత్తిడిని తగ్గించేందుకు కొత్త రోడ్డు ప్రాజెక్టులు ఎంతో దోహదపడుతాయన్నారు. కాలుష్యాన్ని క్లీన్ ఎనర్జీ ద్వారా తగ్గించనున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ కాలుష్యంలో 40శాతం శిలాజ ఇంధనాల వినియోగమే కారణమని.. దాంతో ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులు, కార్లు, స్కూటర్లు, సీఎన్‌జీ వాహనాలను తీసుకువచ్చామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.కొత్త రోడ్ నెట్‌వర్క్‌తో వాహనాల రద్దీ తగ్గుతుందన్నారు. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ చుట్టూ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఇప్పటికే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించిందని.. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ (%ఖజు=%) ప్రాజెక్ట్ కింద.. ఢిల్లీ-కత్రా ఎక్స్‌ప్రెస్ వేతో కుండ్లి మనేసర్ పాల్వాల్ ఎక్స్‌ప్రెస్ వే.. లేదంటే వెస్ట్రన్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా కనెక్టివిటీని అందించే ఫేజ్-2ని మంత్రిత్వ శాఖ ఖరారు చేస్తోంది. ఆయా రోడ్‌నెట్ వర్క్‌ల ద్వారా జమ్మూ కశ్మీర్, పంజాబ్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా విమానాశ్రయం, ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేకు చేరుకునేలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కొత్త రోడ్ నెట్‌వర్క్ ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేకి నేరుగా కనెక్టివిటీని అందిస్తుందని.. దాంతో రాజధానిలో రద్దీని తగ్గించడంలో సహాపడు తుంది. మహిపాల్‌పూర్, రంగ్‌పురి ప్రాంతాల్లో రోజువారీ ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు ఐదు కిలోమీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మించే యోచనలో ఉన్నట్లు గడ్కరీ వివరించారు. రూ.3,500 కోట్లతో ఈ సొరంగాన్ని నిర్మించనున్నారు. ఈ సొరంగం వసంత్ కుంజ్‌లోని శివమూర్తి, నెల్సన్ మండేలా మార్గ్‌లను కలుపుతుంది.

## శబరిమలలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు.. నిర్మాణానికి అదే అతిపెద్ద సమస్య, రిపోర్ట్‌లో కీలక అంశాలు



శబరిమలలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి తాజాగా జిల్లా అధికారులు తయారు చేసిన నివేదికలో కీలక అంశాలను పొందుపర్చారు. అక్కడ ఎయిర్‌పోర్టు కట్టాలంటే లక్షలాది చెట్లను నరికేయాలని పేర్కొన్నారు. అంతేకాకుండా 350కిపైగా కుటుంబాలను అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని తెలిపారు. ఇక చర్చిలు, మసీదులు, ఆలయాలు, స్కూళ్లు సహా పలు దుకాణాలను ప్రస్తుతం ఉన్న ప్రాంతం నుంచి మార్చాల్సి ఉంటుందని నివేదిక సమర్పించారు. అయితే ఎయిర్‌పోర్టు నిర్మిస్తే.. ఆర్థికంగా, పర్యాటక పరంగా అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు.

కరళలోని శబరిమలలో కొలువైన అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలివెళ్తూ ఉంటారు. అయితే శబరిమల అయ్యప్పను దర్శించుకోవడానికి వెళ్లే మార్గం చాలా కష్టతరంగా ఉంటుంది. ఇక ప్రతీ సంవత్సరం శబరిమలలో జరిగే మండల-మకరవిళక్కు పూజల కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా అయ్యప్ప భక్తులు శబరిగిరులకు తరలివెళ్తూ ఉంటారు. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే అయ్యప్ప భక్తుల కోసం శబరిమలలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించాలనే ప్రతిపాదన ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నా అది ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. తాజాగా శబరిమల గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి కొట్టాయం జిల్లా అధికారులు.. ఒక నివేదిక తయారు చేశారు. ఎయిర్‌పోర్టు నిర్మించాలంటే భూసేకరణ, అక్కడి నుంచి తరలించాల్సిన వాటి గురించి ఆ రిపోర్టులో పూర్తిగా చేర్చారు.కొట్టాయం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేసేందుకు 3.4 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇందులో 3.3 లక్షల రబ్బరు, 2492 టేకు, 1131 పనస చెట్లు, 828 మహోగని, 184 మామిడి చెట్లను తొలగించాలని పేర్కొన్నారు. అంతే కాకుండా 352 కుటుంబాలను అక్కడి నుంచి తరలించి వారికి పునరావాసం కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ ప్రాంతంలో ఉండే సెయింట్ థామస్ ఎక్యుమెనికల్ చర్చి, హిదాయుతుల్ ఇస్లాం జుమా మసీదు, శ్రీ అమ్మన్ కోవిల్, శ్రీ పూవన్‌పలమల దేవాలయం, సెయింట్ గ్రెగోరియో చర్చి, సెయింట్ జోసెఫ్ చర్చి కరీమ్‌హౌట్, పంచతీర్థ పరాశక్తి దేవస్థానాలను కూడా మరో చోటుకు మార్చాల్సి ఉంటుందని వివరించారు. ఇక ఆ ప్రాంతంలో ఉన్న ఒక స్కూల్, 5 వ్యాపార సంస్థలను అక్కడి నుంచి తరలించాల్సిందేనని తెలిపారు.

ఇక ఈ శబరిమల గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్ట్ కారణంగా నేరుగా 347 కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతాయని ఆ నివేదిక తెలిపింది. చెరువల్లి ఎస్టేట్‌కు సంబంధించి పనులు చేస్తున్న 238 కుటుంబాలు తమ నివాసాలను, జీవనోపాధిని కోల్పోతాయని.. ఇక్కడ నివసించే దేశవాళీ జాతి ఆవు చెరువల్లి ఆవులను కూడా ఈ ప్రాంతం నుంచి తరలించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇది ఆవుల పర్యావరణ వ్యవస్థను ప్రభావితం చేస్తాయని ఆ నివేదికలో కొట్టాయం జిల్లా యంత్రాంగం వెల్లడించింది. ఈ దేశవాళీ ఆవుల పెంపకమే స్థానికులకు ఆదాయ వనరు అని వెల్లడించింది. ఇక ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు కోసం మణిమాల, ఎరుమేలి సౌత్ గ్రామాల నుంచి 1039.876 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుంది. శబరిమల యాత్రికులు, ఎన్నారైలు, పర్యాటకులు, ఇతర ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతిపాదిత శబరిమల గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని రూపొందించినట్లు ప్రాజెక్ట్ ప్రమోటర్ కేఎస్ఐడీసీ తెలిపింది. అయితే శబరిమలలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే.. ఆ ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధి చెంది ఖజానాకు ఆదాయం వస్తుందని అధికారులు పేర్కొన్నారు. వవారు చర్చి, మారమన్ కన్వెన్షన్, ఏటుమనూరు మహాదేవ దేవాలయం వంటి తీర్థయాత్రలకు రవాణా సదుపాయాలు మెరుగుపడతాయని తెలిపారు. కుమరకం బ్యాక్ వాటర్, మున్నార్ హిల్ స్టేషన్లు, గవి, తేక్కడి వన్యప్రాణుల అభయారణ్యం, పెరియార్ టైగర్ రిజర్వ్, ఇడుక్కి డ్యామ్ వంటి ప్రధాన పర్యాటక రంగాలను ఇది కలుపుతుందని పేర్కొన్నారు. పార్లమెంట్‌కు సమర్పించిన నివేదిక ప్రకారం.. శబరిమల గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మిస్తే స్థానిక ఆర్థిక వ్యవస్థ, పర్యాటక రంగానికి ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లు అవుతుందని తెలిపింది.

## చైనాలో మరో మహమ్మారి.. హెచ్‌ఎంపీవీ లక్షణాలు, నివారణ చర్యలు ఇవే..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారికి పుట్టినిల్లుగా చెప్పుకునే చైనాలో ఇప్పుడు మరో వైరస్ వ్యాప్తి కలవరానికి గురిచేస్తోంది. ప్రస్తుతం అక్కడ హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ తీవ్రంగా వ్యాప్తి చెందిందని, కొవిడ్ వెలుగులోకి వచ్చిన సరిగ్గా ఐదేండ్ల తర్వాత మరో ప్రమాదకర వైరస్ వ్యాప్తి చెందుతున్నదని స్థానిక, సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. ఈ వైరస్ బారినపడి అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రుల్లో చేరుతున్నట్లు సమా చారం.హెచ్ఎమ్‌పీవీతోపాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా, నిమోనియా, కొవిడ్ -19 వైరస్‌లు కూడా వ్యాప్తి చెందుతున్నట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ ప్రకటించినట్లు పలువురు నెటిజన్లు పేర్కొంటున్నారు. అయితే, దీనిపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఈ కొత్త వైరస్ లక్షణాలు, ఎలా వ్యాపిస్తుంది, నివారణ చర్యలు వంటి విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.%ఈ వైరస్ సోకిన వారిలో కొవిడ్ తరహా లక్షణాలే కనిపిస్తాయని తెలిసింది. దగ్గు, జ్వరం, ముక్కు రంధ్రాలు మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఈ వైరస్ సోకిన వారిలో ప్రధానంగా కనిపిస్తుంటాయి. వైరస్ తీవ్రమైతే బ్రోన్కైటిస్, న్యుమోనియా వంటి సమస్యలకు దారితీస్తుంది. మూడు లేదా ఆరురోజుల వరకూ లక్షణాలు ఉంటాయి. ఇన్‌ఫెక్షన్ తీవ్రతను బట్టి లక్షణాలు వేర్వేరు వ్యవధిలో ఉంటాయి.కరోనా మాదిరిగానే ఒకరి నుంచి మరొకరికి ఈ వైరస్ ఈజీగా సోకుతుంది. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వైరస్ దరి చేరకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. చేతులను తరచూ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు నోరు, ముక్కును కప్పుకోవడం.. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, రద్దీ ఉన్న ప్రదేశాలకు దూరంగా ఉండడం వంటివి తప్పనిసరిగా పాటించాలి. తద్వారా వైరస్ వ్యాప్తిని కాస్తమేర కట్టడి చేసే అవకాశం ఉంటుంది.

## రెండు బస్సుల మధ్య ఇరుక్కుపోయిన వ్యక్తి.. నరకం అంచుల వరకూ వెళ్లి వెనక్కు!




**న్యూఢిల్లీ-నవభూమి:** రోడ్డుపై మనం సరిగ్గా వెళు న్నా సరే వచ్చే వాళ్లు సరిగ్గా రాకపోతే జరిగే ప్రమాదాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిన్న పాటి ప్రమాదానికే అనేక మంది ప్రాణాలు కోల్పోతుంటారు. అలాగే జరిగిందో వ్యక్తికి. రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తూ.. రెండు బస్సుల మధ్య ఇరుక్కుపోయి నరకం అంచుల వరకూ వెళ్లొచ్చాడు. అదృష్టవశాత్తు ప్రాణాలతో బయట పడి అందరికీ షాకిచ్చాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు చూద్దాం. చాలా మంది రోడ్లపై నడుస్తున్నప్పుడు అనుకోకుండా ప్రమాదాల బారిన పడుతుంటారు. మనం సరైన దారిలోనే వెళ్లినా వచ్చే వాళ్లు చూసుకోకపోతే ఇక మన గతి అంతే. కానీ మనమే ఒక్కోసారి చూసుకోకుండా వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకుంటాం. అలా చూసుకోకుండా వెళ్లినా అదృష్టవశాత్తు ప్రమాదం నుంచి బయటి పడితే.. అబ్బా బతికానురా సామీ అంటూ హాయిగా ఫీలవుతాం. అప్పటి వరకు పడిన భయమంతా క్షణాల్లో మర్చిపోతుంటాం. అలాంటి ప్రమాదాన్నే చూశాడో వ్యక్తి. ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్న ఆ వీడియోలో ఏముందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.తమిళనాడు రాష్ట్రంలోని పట్టుకొట్టాయ్స్‌లో ఓ బస్సు రోడ్డుపై వెళ్తుంది. అయితే రోడ్డు దాటేందుకు ఓ వ్యక్తి కాస్త ముందుకు వచ్చాడు. ఇంకాసేపైతే బస్సు వెళ్లిపోతుందనుకున్న క్షణంలో రోడ్డు మధ్యలోకి చేరుకున్నాడు. ఆ బస్సు వెళ్లిపోకముందే అటువైపు నుంచి మరో బస్సు వచ్చింది. సింగిల్ రోడ్డు కావడం... రెండు బస్సులు ఒకేసారి పక్క పక్కన ఉండడంతో రోడ్డు దాటబోయిన వ్యక్తి మధ్యలో ఆగిపోయాడు. రెండు చాలా దగ్గరగా రాగా.. సదరు వ్యక్తి ప్రమాదం నుంచి బయట పడడానికి చాలానే ప్రయత్నాలు చేశాడు.%కానీ అతడికి ఎటూ వెళ్లరాలేదు. విషయం గుర్తించిన డ్రైవర్లు సైతం ఏమీ చేయలేకపోయారు. దీంతో రెండు బస్సులూ ముందుకు వెళ్లగా.. వ్యక్తి కింద పడిపోయాడు. అతడిని దాటగానే బస్సులు రెండు ఆగిపోయాయి. అదృష్టవశాత్తు వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షణాల్లో నరకం అంచుల వరకూ వెళ్లి వచ్చి ప్రాణాలతో బయట పడేసరికి వ్యక్తి సహా బస్సుల్లో ప్రయాణిస్తున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. అందరూ బస్సు దిగి ఆయన వద్దకు వెళ్లి చూశారు. అలాగే అటుగా వెళ్తున్న ద్విచక్రవాహనదారులు కూడా ఆగి మరీ బస్సు డ్రైవర్లతో గొడవకు దిగారు.ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఇది చూసిన ప్రతీ ఒక్కరూ ఒక్కోలా కామెంట్లు చేస్తున్నారు. కాస్త చూసుకుని రోడ్డు దాటండి బ్రో అని కొందరు.. యమధర్మరాజుకు హాయ్ చెప్పి వచ్చావుగా అంటూ తమ మనసులోని భావాలను కామెంట్ల రూపంలో వెల్లడిస్తున్నారు.

## మణిపూర్ గవర్నర్‌గా అజయ్ కుమార్ భల్లా ప్రమాణస్వీకారం



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా.. ఇవాళ మణిపూర్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య స్థానంలో గవర్నర్‌గా భల్లా బాధ్యతలు చేపట్టనున్నారు. జూలై 2023 నుంచి లక్ష్మణ్ ప్రసాద్.. ఇంచార్జీ గవర్నర్‌గా చేసిన విషయం తెలిసిందే.1984 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భల్లాది.. అస్సాం మేఘాలయా క్యాడర్. ఆగస్టు 2024 వరకు అయిదేళ్ల పాటు ఆయన కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా చేశారు. వాస్తవానికి భల్లాది పంజాబ్‌లోని జలంధర్. అయితే మణిపూర్ గవర్నర్‌గా ఆయన్ను నియమించడం ఆసక్తిగా మారింది. 2023 మే నుంచి మణిపూర్ వర్గ హింసతో రగిలిపోతున్న విషయం తెలిసిందే.మణిపూర్ గవర్నర్‌గా భల్లాను నియమిస్తూ డిసెంబర్ 24వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఇంఫాల్‌లో భల్లాకు అరుదైన గౌరవం దక్కింది. మణిపూర్ డీజీపీ రాజీవ్ సింగ్ నేతృత్వంలోని బృందం ఆయనకు స్వాగతం పలికింది.

## ఢిల్లీలో మంచుదుప్పటి.. వందకుపైగా విమానాలు ఆలస్యం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ విమానాశ్రయంలో ఇవాళ ఉదయం వందకుపైగా విమానాలు ఆలస్యం అయ్యాయి. వెదర్ సరిగా లేని కారణంగా%ా% విమానాలన్నీ ఆలస్యంగా ప్రయాణిస్తున్నాయి. ఫ్లయిట్ షెడ్యూల్‌ను సరిచూసుకోవాలని ప్రయాణికులకు ఎయిర్‌లైన్స్ సంస్థలు సూచించాయి. ఒకవేళ విజిబులిటీ మరీ అధ్వానంగా ఉంటే, అప్పుడు విమానాలను రద్దు చేసే అవకాశాలు ఉన్నట్లు విమానయాన సంస్థలు చెబుతున్నాయి. ఢిల్లీలో ఇవాళ ఉదయం తీవ్ర స్థాయిలో మంచు దుప్పటేసింది. విమానాలు ఆలస్యం అయినా.. వేటిని కూడా దారి మళ్లించలేదన్నారు. విమాన ప్రయాణికుల కోసం ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు తన ట్వీట్‌లో ఓ పోస్టు చేసింది. అతి తక్కువ విజిబులిటీ ఉన్న సమయంలో క్యాట్ త్రీ సౌకర్యాలను వినియోగిస్తుంటారు. ప్రతి రోజు ఇందిరా గాంధీ విమానాశ్రయంలో దాదాపు 1300 విమానాలను ఆపరేట్ చేస్తుంటారు.

## మర్డర్ కేసులో రామ్ రహీమ్ గుర్మీత్‌కు సుప్రీంకోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ-నవభూమి:** సుప్రీంకోర్టు ఇవాళ నోటీసులు జారీ చేసింది. 2002లో జరిగిన డేరా మాజీ మేనేజర్ రంజిత్ సింగ్ మర్డర్ కేసులో గుర్మీత్‌తో పాటు మరో నలుగురికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. ఆ కేసు నుంచి గుర్మీత్ పేరును తొలగించాలని పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సీబీఐ సవాల్ చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. జస్టిస్ బేలా ఎం త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నదని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం తెలిపింది. బేలా త్రివేది బెంచ్ ముందుకు ఈ కేసును పంపనున్నట్లు చెప్పారు.హర్యానాలోని కురుక్షేత్రలో ఉన్న ఖాన్పుర్ కాలనీలో 2002, జూలై 10వ తేదీన రంజిత్ సింగ్ హత్యకు గురయ్యాడు. అనేక మంది మహిళలపై గుర్మీత్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రాసి ఉన్న ఓ లేఖను రంజిత్ సింగ్ సర్క్యులేట్ చేసినట్లు అనుమానాలు ఉన్నాయి. ఆ మర్డర్ కేసులో పంచకుల సీబీఐ కోర్టు 2021లో రామ్ రహీమ్‌తో పాటు మరో నలుగుర్ని దోషులుగా ప్రకటించింది. అయిదుగురికి జీవితఖైదు శిక్ష వేసింది. గుర్మీత్‌కు 31 లక్షల జరిమానా కూడా విధించారు.



## 10 నిమిషాల్లో రోగుల చెంతకు.. బ్లింకిట్ అంబులెన్స్ సేవలు




**న్యూఢిల్లీ-నవభూమి:** క్విక్ ఈ కామర్స్ సంస్థ బ్లింకిట్ మరో కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది. బ్లింకిట్ ఇప్పటికే ఆర్డర్ చేసిన పది నిమిషాల్లోనే నిత్యావసర సరకులు, ఇతర వస్తువులు డోర్ డెలివరీ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా అంబులెన్స్ సర్వీసెస్‌ను కూడా వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది.
ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టిన గ్రాసరీస్‌ను పది నిమిషాల్లో డెలివరీ చేసినట్టుగానే .. కేవలం 10 నిమిషాల్లోనే అంబులెన్స్ రోగుల చెంతకు వచ్చేలా 'బ్లింకిట్ అంబులెన్స్' సేవలను గురువారం ప్రారంభించింది. తొలుత గురుగ్రామ్ లోని కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలను అందుబాటులోకి తెచ్చింది. బ్లింకిట్ యాప్‌లోనే ఈ సేవలు అందుబాటులో ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. తాము ప్రవేశపెట్టిన ఈ అంబులెన్సుల్లో ఆక్సిజన్ సిలిండర్, స్ట్రెచర్, మానిటర్, అత్యవసర మందులు, ఇంజెక్షన్లు, వీల్‌చెయిర్ సహా ఒక్కో అంబులెన్స్‌లో పారా మెడికో, ఒక సహాయకుడు, డ్రైవర్ ఉంటారని తెలిపింది. అత్యవసర సమయంలో రోగులకు వీరు సేవలందించనున్నట్లు పేర్కొంది. త్వరలోనే ఈ సేవలు మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని బ్లింకిట్ వెల్లడించింది. వచ్చే రెండు లేదా మూడేళ్లలో ఈ సేవలు అన్ని ప్రధాన నగరాలకు విస్తరిస్తామని బ్లింకిట్ సీఈఓ అల్బిందర్ ధిండ్సా తెలిపారు.

## అన్యమతస్థులతో అన్యోన్య బంధం

భిన్న మతాలకు చెందినవారు శాంతి సామరస్యాలతో కలసికట్టుగా జీవించేలా చేయడమెలా? ఇది, ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న మహా సవాళ్లలో ప్రధానమైనది. మత సంబంధమైన అధిక సంఖ్యాక వాదం ప్రాతిపదికన పశ్చిమాసియా, దక్షిణాసియాలలో జాతి–రాజ్యాల ఏర్పాటు, ఐరోపా, ఉత్తర అమెరికా దేశాలకు క్రైస్తవేతరుల వలసలు తీవ్ర కలహాలు, తరచు హింసాత్మక ఘర్షణలకు కారణమయ్యాయి. దురహంకారం, ఆధిక్యతా భావన పదే పదే సహనం, పరస్పర అవగాహనపై విజయం సాధిస్తున్నాయి. భిన్న మతాల మధ్య మరింత అవగాహనను పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అమెరికా విద్వజ్ఞుడు థామస్ ఆల్బెర్ట్ హొవార్డ్ తన పుస్తకం The Faith of Others : A History of Interreligious Dialogue'లో ప్రేరణాత్మకంగా స్పష్టపరిచారు.
హొవార్డ్ పుస్తకం ప్రధానంగా క్రైస్తవంపై దృష్టిని కేంద్రీకరించింది. క్రైస్తవ ధర్మశాస్త్రజ్ఞులు ఒకప్పుడు తమ మతమే నిజమైన మతమని సునిశ్చితంగా విశ్వసించేవారు. ఆ విషయమై గట్టిగా వాదించేవారు. ఇరవయో శతాబ్దంలో ఈ ధోరణి క్రమంగా మారింది. ఆధ్యాత్మిక అహంకారానికి పేరుబడిన రోమన్ కేథలిక్ చర్చ్ 1960లలో ఇతర మతాలను అంగీకరించడం ప్రారంభించింది. 1964లో పోప్ జారీ చేసిన ఒక ఆదేశంలో 'వివిధ క్రైస్తవేతర మతాల నైతిక, ఆధ్యాత్మిక విలువలను గుర్తించి, గౌరవించాలని' పేర్కొన్నారు.
మతాల మధ్య సంభాషణను ప్రతిపాదించి, ప్రోత్సహించిన ఇద్దరు ప్రముఖ భారతీయుల గురించి హొవార్డ్ తన పుస్తకంలో విపులంగా రాశారు. వారిలో మొదటి వ్యక్తి మొగల్ చక్రవర్తి అక్బర్. 1952లో ప్రముఖ చరిత్రకారుడు మఖన్‌లాల్ రాయచౌధురి రాసిన 'దీన్ ఇ ఇలాహి : అక్బర్ మతం' అనే పుస్తకం ఆధారంగా అక్బర్ గురించి హొవార్డ్ రాశాడు. ఆయన ఉటంకించిన ఆ చక్రవర్తి లేఖ ఒకటి నన్ను బాగా చకితుడిని చేసింది. తన సమకాలికుడు అయిన స్పెయిన్ రాజు రెండవ ఫిలిప్‌కు రాసిన లేఖ అది. యూదులు, ముస్లింలను స్పెయిన్ నుంచి బహిష్కరించిన తరువాత ఆ యూరోపియన్ దేశంలో కేథలిక్ క్రైస్తవ మత విశ్వాసాలు, సిద్ధాంతాలలో సంకుచితత్వం పెరగసాగింది. భారత్ నుంచి స్పెయిన్ నేర్చుకోవాలని రెండవ ఫిలిప్‌కు రాసిన లేఖలో అక్బర్ సూచించాడు. 'ఇక్కడ తాను పుట్టి పెరిగిన, జ్ఞానార్జనకు, స్వీయ జీవన రీతులకు ఆలంబనగా ఉన్న మతాన్ని అనుసరించడంలో కారణాల గురించి ఎవరూ విచారణశీలురు కారు. ప్రతి ఒక్కరూ తమ స్వీయ మత మార్గంలో నడుస్తారు. తద్వారా మానవ మేధ ఉత్కృష్ట లక్ష్యమైన సత్యాన్ని తెలుసుకొనే సాధ్యాసాధ్యాలనుంచి తమకు తాము మినహాయింపబడతారు. ఈ కారణంగా మేము మా దేశంలో అన్ని మతాల ఆచార్యులు, విద్వాంసుల సదస్సులు నిర్వహించి, వారి సునిశితమైన చర్చలు, వివేకదాయక ప్రవచనాలు, ఉజ్వల ఆశంసల నుంచి జ్ఞానవంతులమవుతుంటాము'.
మతాల మధ్య సంభాషణను ప్రతిపాదించిన రెండవ మహోన్నత భారతీయుడు స్వామి వివేకానంద. అక్బర్‌కు కొన్ని శతాబ్దాల తరువాత జీవించిన వివేకానంద గురించి హొవార్డ్ సుదీర్ఘంగా రాశారు. 1893లో షికాగోలో జరిగిన సర్వ మత ప్రతినిధి సభలో వివేకానంద ప్రసంగానికి ప్రాధాన్యమిచ్చారు. తొలుత ఆ సభ లక్ష్యాలను ప్రస్తావించి వివేకానంద ప్రసంగ భాగాలను ఉటంకించారు. వాటిలో మొదటిది : 'సకల ప్రపంచానికి సహనాన్ని, విశ్వజనీనతను బోధించే ఒక శ్రేష్ఠమైన మతానికి చెందినవాడినని నా గురించి చెప్పుకోవడం నాకు ఎంతో గర్వంగా ఉంది. విశ్వ విశాలమైన సహనాన్నే కాక, మేము సమస్త మతాలూ సత్యమైనవే అని ఆమోదిస్తాము. ఈ సమస్త ధాత్రిపైన అసహనానికీ, హింసకు గురి అయిన అన్ని మతాల వారినీ, అన్ని దేశాలకు చెందిన వారిని, వారు శరణార్థులై వచ్చినప్పుడు ఆదరించి, వారికి భద్రత కలిపించిన ఉదారమయమైన మతం మాది అని చెప్పుకోవడానికి నేను గర్విస్తున్నాను'. రెండో ఉటంకింపు మరింత ముఖ్యమైనది: 'మత వైషమ్యం, అంధ విశ్వాసం. దీని భయంకర ప్రవృత్తి అయిన మత విద్వేష మాత్సర్యం ఈ సుందరమైన ధరిత్రిని ఎంతకాలంగానో అంటి పెట్టుకొని ఉండనే ఉన్నాయి. ఇవాళ ఉదయం ఈ మత మహాసభ గౌరవార్థం మోగిన ఘంటా నాదం అన్నిరకాల మత మూర?త్వాన్ని, మత పరమైన హింసాపరత్వాన్ని కత్తితోనో లేదా కలంతోనో సాగించే మత దౌర్జన్యాన్ని, ఒక గమ్యాన్ని ఆశించి గమించే వారి మధ్య వైమనస్యాన్ని తుదముట్టించే మృత్యుఘంటిక అవుతుందని ఆశిద్దాం'. మహాత్మాగాంధీని కదాచిత్తుగా హొవార్డ్ ప్రస్తావించారు. ఆయన మత చింతనను లోతుగా పరామర్శించలేదు. వాస్తవానికి గాంధీ ఒక మత బహుళత్వ వాది. అక్బర్, వివేకానంద కంటే మరింత ప్రగాఢమైన, మౌలికంగా భిన్నమైన మత చింతకుడు. హిందూయేతర మతాలతో ఆయన తన సంభాషణను సాగించడమే కాదు ఒక సామాజిక కార్యక్రమంగా కూడా దాన్ని ఆచరించారు. దక్షిణాఫ్రికాలోను భారత్‌లోను ఆయన నిర్వహించిన సత్యాగ్రహాలు సమస్త ప్రపంచ మతాలకు చెందిన వారిని తమ ప్రభావశీల పరిధిలోకి తీసుకురావడానికి ప్రయత్నించాయి. ఆయన ఆశ్రమాలలో భిన్న మతాలకు చెందినవారు ఉండేవారు. నిరంతరం సన్నిహితంగా, పరస్పర గౌరవాదరాలతో కలసిమెలసి ఉండేవారు. గాంధీ ఆశ్రమాలలో రోజూ జరిగే సర్వ మత ప్రార్థనా సమావేశంలో భిన్న మతాల పవిత్ర గ్రంథాల నుంచి గీతాలు, శ్లోకాలు, సూక్తులు చదివేవారు, గానం చేసేవారు. ఇదొక వినూత్న, మత అనుష్ఠానం. యుద్ధాలతో సంక్షుభితమవుతున్న నేటి ప్రపంచానికి ఆ మానవీయ మతాచరణ ఉపయుక్తత ఎంతో ఉంది.

# వీసాకు భరోసా



గత కొన్ని రోజులుగా అమెరికా రాజకీయ చర్చ హెచ్1–బీ వీసాల చుట్టే తిరుగుతుండటం మనం చూస్తున్నాం. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (క్లుప్తంగా 'మాగా' లేదా అమెరికాకు పూర్వవైభవం సాధిద్దాం) అనే నినాదంతో ట్రంప్ ఎన్నికల బరిలో దిగి ఘన విజయం సాధించారు. జనవరి 20వ తేదీన ఆయన అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఆ రోజు దగ్గర పడుతున్న కొద్దీ హెచ్1–బీ ఆశావహుల్లో ఆందోళన పెరుగుతున్నది. అమెరికన్లకు వీసాల వల్ల 'అన్యాయం' జరుగుతున్నదనీ, అవి 'చాలా చెడ్డవని' గతంలో ఆయన చేసిన ప్రకటనలే అందుకు కారణం. అయితే, ట్రంప్ విజయంలో కీలక పాత్ర పోషించిన పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్ చేస్తున్న ప్రకటనలు కొంత గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. నిజానికి ట్రంప్ కంటే ముందే వీసాలకు అనుకూలంగా ఎలాన్ మస్క్ మాట్లాడటం గమనార్హం. ఆయన తీరులోనే ట్రంప్ కూడా ఇప్పుడు అమెరికాకు నిపుణులైన ఉద్యోగుల అవసరం ఉన్నదని, వీసాలు ఉండాల్సిందేనని అంటున్నారు. పైగా తాను ఎప్పుడూ వీసాలకు వ్యతిరేకంగా మాట్లాడలేదని సమర్థించుకున్నారు. ఈ యూటర్న్ ట్రంప్ సంప్రదాయిక మద్దతుదారులకు సహజంగానే ఆగ్రహం తెప్పిస్తున్నది. వీసాలను సమర్థిస్తే 'అమెరికాకే ప్రథమ ప్రాధాన్యం' అనే నినాదాన్ని అటకెక్కించినట్టు అవుతుందనే వాదన వినిపిస్తున్నది.
ఆచరణాత్మకంగా చూస్తే హెచ్1–బీ వీసాలు లేకపోతే ఐటీ కంపెనీల మనుగడ కష్టమవుతుంది. స్థానిక అమెరికన్లలో నైపుణ్యాలు కొరవడటమే ఇందుకు కారణం. భారత్ వంటి విదేశాల నుంచి నిపుణులను ఆకర్షించే ఉద్దేశంతోనే 1990లో సీనియర్ బుష్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్1–బీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. పరిశోధన, ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఖాళీల భర్తీకి ఈ వీసాలను ఉద్దేశించడం తెలిసిందే. వీసాల్లో 70 శాతం భారతీయులు, 12–13 శాతం చైనీయులు దక్కించుకుంటారు. మిగిలినవి మెక్సికో, ఫిలిప్పీన్స్, తైవాన్, కొరియా వంటి దేశాల నుంచి భర్తీ అవుతాయి. భారత్ సహా అనేక వర్ధమాన దేశాలకు చెందిన విద్యార్థులు వీసా లభిస్తే భవితకు భరోసా అని నమ్ముతారు. అమెరికా పౌరసత్వానికి తొలిమెట్టులా ఉపయోగపడుతుందనీ భావిస్తారు.
ఏటా 65 వేల వీసాలను అమెరికా జారీ చేస్తుంది. అదనంగా మరో 20 వేల వీసాలు అధిక విద్యార్హతలు, నైపుణ్యాలున్న వారికి కేటాయిస్తారు. అయితే వీసాల సంఖ్య కన్నా అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటంతో లాటరీ పద్ధతి ప్రవేశపెట్టారు. దీనివల్ల రెండు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకటి, నైపు ణ్యం కన్నా అదృష్టమే నిర్ణాయకం కావడం. దీనివల్ల అద్వితీయ నైపుణ్యం ఉన్నప్పటికీ అవకాశం లభించకపోవచ్చు. రెండు, హెచ్1–బీ వీసాలతో వెళ్లేవారికి స్థానికుల కన్నా తక్కువ వేతనాలు లభిస్తాయి. 'చీప్ లేబర్' అనే ముద్ర పడింది అందుకే. కానీ, భారత్ వంటి వర్ధమాన దేశాలవారికి డాలరు అధిక విలువ కారణంగా అవే పెద్ద వేతనాలుగా కనిపిస్తాయి. వీసాలు అమెరికన్ యువతకు ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నాయని, విదేశీయులకే పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు మాత్రం మొదటినుంచీ ఉన్నా యి. ముఖ్యంగా భారత్ నుంచి వచ్చే యువతీ యువకులు ఉద్యోగాలు ఎగరేసుకుపోతున్నార నే అక్కసు కూడా స్థానికుల్లో అంతకంతకూ పెరుగుతున్నది. హెచ్1–బీ వలసలకు అడ్డుకట్ట వేయాలని వాదించే రిపబ్లికన్ పార్టీ నేతల్లో భార త సంతతి అమెరికన్లు కూడా పెద్ద సంఖ్యలో ఉండటం విడ్డూరం. మరోవైపు ఈ ఉద్యోగాల్లో నియమించడానికి అమెరికాలో తగినంత మంది నిపుణులున్నారనీ, మరింతగా వలసలను అనుమతించాల్సిన అవసరం లేదని 60 శాతం అమెరికన్లు భావిస్తున్నట్టు ఓ సర్వేలో వెల్లడైంది. ఈ తరహా అభిప్రాయాలు విదేశీయుల పట్ల వ్యతిరేకతకు దారితీయడం జరుగుతున్నది. ఈ వ్యతిరేకతను సొమ్ము చేసుకొని ట్రంప్ విజయం సాధించారనేది తెలిసిందే. గెలిచిన తర్వాత జనాకర్షక విధానాలకు, ఆచరణీయతకు మధ్య సమతూకం పాటించే పనిలో ఆయన పడ్డారని అర్థమవుతూనే ఉన్నది. ప్రస్తుత పరిణామాలు గమనిస్తుంటే వీసాలు రద్దు కావడం దాదాపు అసాధ్యమనే అర్థమవుతుంది. ఒకవేళ సంస్కరణలంటూ జరిగితే వేతనాలు పెరిగి వీసా అభ్యర్థులకు మేలే జరుగుతుందని ఆశించవచ్చు.

# సైలెంట్ ఆరిటెక్ట్ ఆఫ్ మాడ్రన్ ఇండియా



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని, తెలివితేటలను మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అనేది నిర్వివాదాంశం. పీవీ దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత ల్యాట్రల్ ఎంట్రీ (రాజకీయాలతో సంబంధం లేనివారిని రాజకీయాల్లోకి తీసుకురావడం) ద్వారా రాజకీయాలతో సంబంధం లేని, ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన మంచి ఆర్థికవేత్తగా గుర్తించి మన్మోహన్‌ను ఆర్థికశాఖ మంత్రిగా నియమించారు.
మన్మోహన్‌సింగ్ 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ.. 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది–నా దేశం మేలొని ఉన్నది' అంటూ గొప్పగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్ధాంతం, నాటి పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూలమైన విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. 15 రోజులు మాత్రమే ఫారెక్స్ నిల్వలున్న ఆనాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్చర్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంసరణల శిలి డాక్టర్ మన్మోహన్‌సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా 'సింపుల్ లివింగ్.. హై థింకింగ్' అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్‌సింగ్‌ను మనం చెప్పుకోవచ్చు. విశ్వాసం అనేది నేటి రాజకీయాల్లో చాలా అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు మనోహ్మన్‌సింగ్. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పదేండ్లు పనిచేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పార్టీ కోసం పనిచేసిన, అవసరమైతే పూర్తి స్థాయిలో ప్రజాస్వామిక నిరసనల్లో పాల్గొన్న అభ్యుదయవాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్.
ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఏడాదిన్నరపాటు వారి క్యాబినెట్‌లో కేంద్రమంత్రిగా పనిచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీ తో పొత్తు పెట్టుకుని గెలుపొందిన తర్వాత భాగస్వామ్య పక్షాలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇస్తే.. డీఎంకేతో చికుముడి ఏర్పడింది. యూపీఏలో ప్రధాన భాగస్వామ్య పక్షం డీఎంకే అభ్యంతరం లేవనెత్తింది. తమకు హామీనిచ్చి వారికి ఎలా ఇస్తారని అభ్యంతరం వ్యక్తం చేస్తే కేసీఆర్ క్షణం కూడా సంకోచించకుండా మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లి 'నేను వచ్చింది పదవుల కోసమో, పోర్ట్‌ఫోలియోల కోసమో కాదు, నేను వచ్చింది తెలంగాణ కోసం' అని చెప్పి కేసీఆర్.. ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకు ఇచ్చారు. ఈ సందర్భంగా 'ఏ నిబద్ధతతో వచ్చారో, అది ఫలించాలని కోరుకుంటున్నాన'ని మన్మోహన్ కేసీఆర్‌తో అన్నారు. 'మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుంది, మీరు కర్మయోగిగా గుర్తించబడతారు' అని అన్నారు. ఒక గొప్ప ఆలోచనకు అరుదైన సంద ర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ దానిని ఆపలేదు. దీన్ని మన్మోహన్‌సింగ్ బలంగా నమ్మారు కాబట్టే తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి.. అన్నీ ఆయనకు అర్థమయ్యాయి. కాబట్టే అనివార్య పరిస్థితుల్లో మన్మోహన్‌సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడింది. దాన్ని మేం మరిచిపోం.
మన్మోహన్‌సింగ్ నిబద్ధతను గుర్తు చేసే సందర్భంలో సరిగ్గా ప్రధానిగా వారు ఎన్నికైన ఆరు నెలలకు.. క్యాబినెట్ సహచరుడిగా 2004, డిసెంబర్ 18 (సరిగ్గా 20 ఏండ్ల కిందట) ముఖ్యమైన డెలిగేషన్ తీసుకొస్తున్నారని, తమకు సమయం ఇవ్వాలని కేసీఆర్ కోరారు. బలహీన వర్గాలకు చెందిన ఆర్.కృష్ణయ్య, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు వంటి నాయకులను తీసుకొస్తున్నా తమకు ఐదు నిమిషాలు సరిపోదని 30 నిమిషాలు కావాలని కోరారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న నాటి ప్రధాని వారికి 45 నిమిషాల సమయం ఇచ్చారు. ఓబీసీలకు అన్ని రాష్ట్రాల్లో మంత్రిత్వ శాఖలున్నాయి. కేంద్రంలో ఓబీసీలకు ఒక మంత్రిత్వ శాఖ ఉండాలని వారు చెప్పడంతో 45 నిమిషాల సమయం ఇచ్చిన మన్మోహన్‌సింగ్ గంటన్నరపాటు వారితో గడిపి సమస్యను పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. చూస్తానంటూ హామీనిచ్చారు. ఇది ఆయన గొప్పతనానికి నిదర్శనం.
ఎన్నో అడ్డంకులు, ఎన్నో అభ్యంతరాలున్నా మన్మోహన్‌సింగ్ ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడ్డారు. ఎన్నడూ, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంసరణల బాట నుంచి వెనకి తగ్గలేదు. ఆయన్ని మనం 'సైలెంట్ ఆరిటెక్ట్ ఆఫ్ మాడ్రన్ ఇండియా' అని పిలువవచ్చు. ఆయన మన్మోహన్ కాదు, మౌన మోహన్ సింగ్ అని, మౌన ముని అని పేర్లు పెట్టారు. అయితే, అవేవీ పట్టించుకోకుండా ఆయన తన పని తను చేసుకుంటూ పోయారు. విప్లవాత్మకమైన సంసరణలు తీసుకువచ్చారు. ఎంతో మంది అనేక రకాలుగా అవమానించే ప్రయత్నం చేసినా ఆయన పట్టించుకోకుండా ముందుకువెళ్లారు. అవమానిస్తే ఆకాశం స్థాయి తగ్గదు. ఎన్ని నిందలు వేసినా మహోన్నతులు వణకరు, బెణకరు. అలాంటి స్థితప్రజ్ఞతను మనం మన్మోహన్‌సింగ్‌లో చూశాం.
మన్మోహన్ సింగ్ గురించి మాట్లాడుకునేటప్పుడు మన తెలుగు బిడ్డ.. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు గురించి కూడా గుర్తుచేసుకోవాలి. మన్మోహన్‌ను రాజకీయాల్లోకి తీసుకువచ్చిందే పీవీ. కేసీఆర్ ఆదేశాల మేరకు నేను, మా పార్టీ రాజ్యసభ సభ్యుల బృందం ఢిల్లీకి వెళ్లి మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించాం. ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నాం. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించాం. మా సానుభూతి వ్యక్తం చేశాం. ఢిల్లీలో మన్మోహన్‌సింగ్‌కు జరిగిన గౌరవప్రదమైన వీడోలు మన పీవీకి జరుగలేదనే బాధ కలిగింది.
మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని, విగ్రహం పెడతామని సీఎం ప్రకటించారు. మేం స్వాగతిస్తున్నాం. ఆయా కార్యక్రమాల్లో మేం కూడా పాల్గొంటాం. మనవాడైన పీవీ నరసింహారావుకు కూడా ఢిల్లీలో స్మారకం ఏర్పాటుచేయాలని తెలంగాణ శాసనసభ తీర్మానం చేయాలి. మన తెలుగు, తెలంగాణ బిడ్డకు సముచిత గౌరవం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనే ప్రతిపాదన అసెంబ్లీ నుంచి పంపిస్తే బాగుంటుంది. ఢిల్లీలో ప్రధానులందరికీ స్మారకం ఉన్నది. పీవీకి మాత్రమే లేదు. అది మనకు అవమానం, తీరని లోటు. ఈ తీర్మానంతో పాటు దానిని కూడా జతపరిచి పంపించినట్టయితే మన గౌరవం కూడా పెరుగుతుంది. సీఎం ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాం.

# ధనుర్మాసంలో... పంచరంగాలు చూసొద్దాం!

**భక్తి**

కోవిలడి (తిరుప్పర్‌నగర్): వైష్ణవులు పవిత్రంగా భావించే 108 దివ్యదేశాలలో ఒకటైన అప్పక్కుడుతాన్ పెరుమాళ్ ఆలయం తమిళనాడులోని ప్రధాన నగరాల్లో ఒకటైన తిరుచిరాపల్లి (తిరుచ్చి)కి 28 కిలోమీటర్ల దూరంలోని కోవిలడిలో ఉంది. ఇక్కడి రంగనాథుడికి 'అప్పక్కుడుతాన్ పెరుమాళ్' అనే పేరు రావడం వెనుక ఒక కథ... స్థలపురాణంలో కనిపిస్తుంది. ఉపమన్యుడనే మహారాజుకు శ్రీమహావిష్ణువు వృద్ధ రూపంలో దర్శనం ఇచ్చాడు. తనకు ఆహారం కావాలని అడిగాడు. ఉపమన్యుడు ఎన్ని పదార్థాలను నివేదించినా... స్వామి ఆకలి శాంతించలేదు. ఏం చెయ్యాలో తెలియక... తనకు మార్గం చూపించాలని పరాశర మహర్షిని ఉపమన్యుడు ఆశ్రయించాడు. అప్పాలను భక్తిపూర్వకంగా స్వామికి సమర్పించుకోవాలని పరాశరుడు సలహా ఇచ్చాడు. వాటితో సంతృప్తుడైన మహా విష్ణువు... అక్కడ కొలువయ్యాడు. మధ్యయుగ చోళుల కాలం నాటి ఈ ఆలయంలో శ్రీరంగనాథుడు భూదేవి, కోమలవల్లీ తాయార్ సమేతుడై ఉంటాడు.
కుంభకోణం: ఆలయాలకు నిలయంగా ప్రసిద్ధి చెందిన తమిళనాడులోని కుంభకోణంలోని అతి పెద్ద వైష్ణవాలయాల్లో సారంగపాణి ఆలయం ఒకటి. భృగుమహర్షి... లక్ష్మీ నిలయమైన మహావిష్ణువు వక్షస్థలం మీద తన్నడం, లక్ష్మీదేవి భృగువుపై ఆగ్రహించడం, భృగువు అరికాలిలో ఉన్న కన్నును మహావిష్ణువు చిదిమెయ్యడంతో... భృగువు అహంకారం తొలగిపోవడం... ఈ కథ 'శ్రీవేంకటాచల మహాత్మ్యం'లో కనిపిస్తుంది. ఆ తరువాత లక్ష్మీదేవిని భృగువు ప్రార్థించి, ప్రసన్నం చేసుకొని, తన కుమార్తెగా పుట్టాలని కోరుకుంటాడు. ఆ తరువాత హేమమహర్షిగా భృగువు, ఆయన కుమార్తె కోమలవల్లి (కోమలాంబాళ్)గా లక్ష్మీదేవి జన్మించారు. హేమమహర్షి కోరికపై విష్ణుమూర్తి తన విల్లును (సారంగాన్ని) చేతపట్టి, భూలోకానికి వచ్చి, కోమలవల్లిని పెళ్ళి చేసుకొని, అక్కడే స్థిరపడిపోయాడని స్థలపురాణం వివరిస్తోంది. అందుకే ఈ స్వామిని 'వీట్టోడు మాప్పిళ్ళై' (ఇల్లరికం అల్లుడు) అని పిలుస్తారు. ఈ ఆలయ నిర్మాణం క్రీస్తు శకం ఏడు, ఎనిమిది శతాబ్దాల్లో తొలి చోళ రాజుల కాలంలో జరిగి ఉండొచ్చని చరిత్రకారుల అభిప్రాయం. కాగా పంచరంగ క్షేత్రాల్లో ఒకటిగా... ఈ ఆలయానికి బదులు తమిళనాడులోని నాగపట్నం జిల్లా వడ(ట)రంగంలో ఉన్న రంగనాథపెరుమాళ్ ఆలయాన్ని కొన్ని గ్రంథాలు పేర్కొంటున్నాయి.
తిరుఇందలూర్: తమిళనాడులోని మయిలాడుతురై పట్టణ శివార్లలోని తిరుఇందలూర్‌లో కొలువుతీరిన రంగనాథస్వామిని 'పరిమళ పెరుమాళ్' అని పిలుస్తారు. స్థల పురాణం ప్రకారం... శాపగ్రస్తుడైన చంద్రుడు ఆ శాపం నుంచి విముక్తి పొందడానికి ఇక్కడ తపస్సు చేశాడు. అనుగ్రహించిన మహావిష్ణువు ప్రత్యక్షమై, చంద్రుణ్ణి శాపవిముక్తుణ్ణి చెయ్యడంతోపాటు అతని కోరికపై ఇక్కడ వెలిశాడు. ఇందుడు అంటే చంద్రుడు... ఆ పేరుమీద ఈ క్షేత్రానికి 'తిరుఇందలూర్' అనే పేరు వచ్చింది. వెయ్యేళ్ళకు పైగా చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని మధ్య యుగ చోళులు, విజయనగర రాజులు, మధుర నాయకులు అభివృద్ధి చేశారు. పరిమళ పెరుమాళ్ దేవేరి పరిమళ రంగనాయకి. ఆమెను 'చంద్రశాప విమోచనవల్లి', 'పుండరీకవల్లి' అని కూడా పిలుస్తారు. గర్భాలయంలో నదీ దేవతలైన గంగ, కావేరి విగ్రహాలు ఉంటాయి. ఈ ఆవరణలో యోగనరసింహుడు, రామాంజనేయులు, సూర్య చంద్రులు తదితర ఉపాలయాలు కూడా ఉన్నాయి. మయిలాడుతురై పట్టణ కేంద్రానికి అయిదు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.
శ్రీరంగం: 108 వైష్ణవ దివ్యక్షేత్రాల్లో అత్యంత ప్రధానమైన శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయం 'భూలోక వైకుంఠం'గా, 'ఇండియన్ వాటికన్'గా ప్రసిద్ధి చెందింది. దీన్ని 'పెరియకోయిల్' (పెద్ద గుడి) అని కూడా పిలుస్తారు. 'శ్రీరంగ మహాత్మ్యం'తో సహా అనేక గ్రంథాల్లో ఈ ఆలయ ఆవిర్భావానికి సంబంధించిన ఎన్నో కథలున్నాయి. ఈ ఆలయ గోపురం క్షీరసాగర మథనంలో ఆవిర్భవించిదనేది వాటిలో ఒకటి. విభీషణుడు ఈ ఆలయాన్ని నిర్మించాడని స్థలపురాణం చెబుతోంది. రామాయణం, మహాభారతం, పద్మ, బ్రహ్మాండ, గరుడ పురాణాల్లో, అనేక ప్రాచీన గ్రంథాల్లో శ్రీరంగనాథుడి ప్రస్తావన ఉందని 'శ్రీరంగ మహాత్మ్యం' పేర్కొంటోంది. కాగా, క్రీస్తుపూర్వం 500 నుంచి 300 మధ్యకాలానికి చెందిన సంగమ యుగ తమిళ సాహిత్యం కూడా శ్రీరంగ క్షేత్ర విశిష్టతను వివరించింది. ధనుర్మాసంలో గానం చేసే తిరుప్పావై పాశురాలను రచించిన గోదాదేవి (ఆండాళ్)కి, శ్రీరంగనాథుడికి వివాహం కూడా జరిగిన ప్రదేశంగానూ దీనికి ప్రశస్తి ఉంది. 150 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ ఆలయంలో 21 గోపురాలు, ఏడు ప్రాకారాలు ఉన్నాయి. 236 అడుగులతో, పదమూడు అంతస్తుల్లో ఉండే సమున్నతమైన రాజగోపురం ప్రత్యేక ఆకర్షణ. అలాగే ప్రపంచంలోనే పెద్దదైన రంగనాథస్వామి విగ్రహం ఈ ఆలయంలో ఉంది. స్వామి దేవేరి శ్రీరంగనాయకి. ఆమెను 'రంగనాయకి నాచియార్' అని కూడా వ్యవహరిస్తారు. ఈ ఆలయంలో అనేక ఉపాలయాలతో పాటు శ్రీరామానుజస్వామి భౌతిక దేహం కూడా దాదాపు 1200 ఏళ్లుగా భద్రపరచి ఉండడం మరో విశేషం. తిరుచిరాపల్లి (తిరుచ్చి)కి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.
కావేరీ నది తీరంలోని మూడు వేర్వేరు దీవుల్లో ఉన్న రంగనాథ ఆలయాలను 'ఆది', 'మధ్య', 'అంత్య' రంగాలుగా పేర్కొంటారు. వీటిలో శ్రీరంగపట్నలోనిది ఆద్యరంగం, శ్రీరంగంలోనిది అంత్యరంగం కాగా... కర్ణాటకలోని శివసముద్రంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని 'మధ్యరంగం'గా వ్యవహరిస్తారు. ఇక్కడ రంగనాథస్వామి యవ్వనంలో ఉంటాడని భక్తుల నమ్మకం. కాబట్టి ఆయనను 'మోహన రంగడు', 'జగన్మోహన రంగడు' అని పిలుస్తారు.



## చలి కాలం పిల్లల రక్షణ



చల్లని వాతావరణంలో వైరస్, బ్యాక్టీరియాలు విస్తృతంగా విస్తరించి ఉంటాయి. పైగా పసికందుల్లో వ్యాధినిరోధకశక్తి తక్కువ కాబట్టి తేలికగా ఇన్‌ఫెక్షన్లకు గురవుతూ ఉంటారు. శ్వాసకోశ సమస్యలతో పాటు, చెవికి సంబంధించిన ఇన్‌ఫెక్షన్లు, స్టమక్ ఫ్లూలు పసికందుల్లో సహజం. ఈ కాలంలో రాత్రుళ్లు గాలిలో తేమ పెరిగిపోతుంది కాబట్టి ముక్కులు మూసుకుపోయి, శ్వాస తీసుకోడానికి కష్టపడుతూ ఉంటారు. పాలు తాగడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు. వేడి నీటి ఆవిరితో ఈ సమస్య సులభంగానే తగ్గిపోతుంది. కాబట్టి ఆవిరి పట్టే డబ్బాను ఉపయోగించి, చేత్తో ఆ ఆవిరి బిడ్డ ముక్కు వైపు వెళ్లేలా చేయాలి. అలాగే నాసికా రంధ్రాల్లో ఒకట్రెండు చుక్కల సెలైన్ డ్రాప్స్ వేసి, ముక్కును సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేస్తే, ద్రవాలు గొంతులోకి జారి, పసికందులు వాటిని మింగేస్తారు కాబట్టి ముక్కు దిబ్బెడ వదిలి సునాయాసంగా ఊపిరి పీల్చుకోగలుగుతారు. చాలా మంది తల్లితండ్రులు యాంటీ హిస్టమిన్ మందులు, యాంటీబయాటిక్స్ స్వయంగా కొనేసి, పిల్లలకు వాడడం మొదలుపెట్టేస్తూ ఉంటారు. ఇలా వైద్యులను సంప్రతించకుండా సొంతగా యాంటీబయాటిక్స్ వాడడం వల్ల సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లను పెంచిన వాళ్లవుతారు. అలర్జీ తత్వం కలిగిన పిల్లల్లో ఈ కాలంలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు పదే పదే వేధిస్తూ ఉంటాయి. ఇలాంటి పిల్లలకు పీడియాట్రిషియన్లు సూచించిన మందులనే వాడుకుంటూ, అలర్జీలను పెంచే అంశాలను గుర్తించి వాటి నుంచి రక్షణ కల్పించాలి. ఉదయాన్నే సమస్యలు పెరుగుతూ ఉంటే, వెంటనే మందుల వాడకం మొదలుపెట్టి, ఇన్‌ఫెక్షన్ తీవ్రతరం కాకుండా నియంత్రించాలి.

# వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు ఫుల్





శరీరం వ్యాధుల బారిన పడకుండా కాపాడేవి యాంటీ ఆక్సిడెంట్లే. ఇవి పండ్లు, నట్స్ వంటి వాటిలో పుష్కలంగా లభిస్తాయి. వీటిని రోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని అంటున్నారు పోషకాహార నిపుణులు.

బెర్రీలు: బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ, బ్లాక్‌బెర్రీలలో ప్రొయాంథోసియానిడిన్స్ అనే యాంటీఆక్సిడెంటు ఉంటుంది. ఇది గుండెజబ్బులు, క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. ఉదయాన్నే స్మూతీగా తీసుకోవచ్చు. యోగర్ట్ లేక తృణధాన్యాలతో కలిపి తీసుకోవచ్చు.

గ్రేప్స్ : వీటిలో సి విటమిన్‌తో పాటు మెగ్నీషియం లభిస్తుంది. సాధారణ కెరోటినాయిడ్‌గా పిలిచే బీటా కెరోటిన్ నుంచి రెస్‌వర్ట్రాల్ వరకు బోలెడు యాంటీ ఆక్సిడెంట్లు వీటిలో లభిస్తాయి.


**వాల్‌నట్స్ :** యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే వాల్‌నట్స్ పది, పదిహేను తీసుకుంటే చాలు. వంద గ్రాముల వాల్‌నట్స్‌లో 15.2 గ్రాముల ప్రొటీన్, 65.2గ్రాముల ఫ్యాట్, 6.7గ్రాముల ఫైబర్ ఉంటుంది. అంతేకాకుండా ముఖ్యమైన ఎమైనో యాసిడ్స్ లభిస్తాయి.

**గ్రీన్ టీ :** ఇందులో కెట్‌చిన్ ఫాలిఫెనాల్స్ అనే మిశ్రమం ఉంటుంది. ఇది శరీరంలో ఇతర రసాయనాలతో కలిసి పని చేసి థర్మోజెనెసిస్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. క్యాన్సర్, గుండెజబ్బులు దరిచేరకుండా చూస్తుంది. అధిక కొలెస్ట్రాల్ సమస్యకు పరిష్కారం చూపుతుంది.

**కివీ పండు :** విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. నీటిలో కరిగే యాంటీ ఆక్సిడెంటు ఉంటుంది. కణాలను డ్యామేజ్ చేసే ఫ్రీ రాడికల్స్‌ను ఇది న్యూట్రలైజ్ చేస్తుంది. విటమిన్ సి తగినంత తీసుకుంటే ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్తమా వంటి జబ్బుల తీవ్రత తగ్గుతుంది. కోలన్ క్యాన్సర్, ఎథెరోస్క్లెరోసిస్, డయా బెటిక్ హార్ట్ డిసీజ్ వంటి జబ్బులు రాకుండా నిరోధిస్తుంది.

**రెడ్ యాపిల్స్ :** ఇందులో ఫైటోన్యూట్రియెంట్స్, ఫ్లావనాయిడ్స్, పాలీఫెనొలిక్స్ వంటివి పుష్కలం. 100గ్రాముల యాపిల్‌లో యాంటీ ఆక్సిడెంట్ స్ట్రెంత్ (ఓఆర్ఏసీ వాల్యూ) 5900 టీఈగా ఉంటుంది. క్వెర్‌సెటిన్, ఎపికెట్‌చిన్, ప్రొసినాడిన్ బి2 వంటి ముఖ్యమైన ఫ్లావనాయిడ్లు లభిస్తాయి. ఇవన్నీ ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే నష్టాన్ని తగ్గిస్తాయి.

**స్ట్రాబెర్రీలు :** వీటిలో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ న్యూట్రియెంట్లు ఉంటాయి. ఇవి కార్డియోవాస్క్యులర్ జబ్బుల నుంచి కాపాడతాయి. డయాబెటిస్ రిస్క్ తగ్గుతుంది. బ్రెస్ట్, సెర్వికల్, కోలన్, ఇసియోఫేగల్ వంటి క్యాన్సర్లు రాకుండా రక్షిస్తాయి.



## బకర్‌వాడి

**కావల్సినవి:** గోధుమపిండి– కప్పు, సెనగపిండి – ముప్పావు కప్పు, పసుపు – అరచెంచా, కారం – మూడు చెంచాలు, నూనె –వేయించేందుకు సరిపడా, గసగసాలు, నువ్వులు – పావుకప్పు చొప్పున, వేయించిన కొబ్బరి తురుము – అర కప్పు, అల్లం తరుగు – ఒకటిన్నర చెంచా, పచ్చిమిర్చి – మూడు, ధనియాలపొడి, జీలకర్రపొడి – అరటేబుల్‌స్పూను చొప్పున, ఇంగువ – పావు చెంచా, కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, నిమ్మరసం –రెండు చెంచాలు, ఉప్పు – సరిపడా.

తయారీ: ఓ గిన్నెలో గోధుమపిండీ, సెనగపిండీ, చెంచా కారం, పసుపూ, టేబుల్ స్పూను నూనె, చిటికెడు ఉప్పు వేసి సరిపడా నీటిని కలిపి చపాతీ పిండిలా కలపాలి. దీన్ని అరగంట సేపు నాననివ్వాలి. పొయ్యిపై బాణలి పెట్టి చెంచానూనె వేయాలి. అది వేడయ్యాక గసగసాలూ, నువ్వులు వేయించి తరవాత కొబ్బరి తురుము వేసి నిమిషం అయ్యాక దింపేయాలి. వేడి చల్లారాక మిక్సీలో బరకగా పొడిచేయాలి. ఇందులో పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తరుగూ, ధనియాలపొడీ, జీలకర్రపొడీ, మిగిలిన కారం, తగినంత ఉప్పూ, కొత్తిమీర తరుగూ, నిమ్మరసం, ఇంగువా వేసి బాగా కలపాలి. ఇప్పుడు చపాతీపిండిని సమాన ఉండల్లా చేసుకోవాలి. ఒకదాన్ని తీసుకుని కాస్త మందంగా చపాతీలా వత్తి దానిపై నువ్వుల మిశ్రమాన్ని పరిచి రోల్‌లా చుట్టేయాలి. అంచుల్ని తడిచేత్తో అతికించి చక్రాల్లా కోయాలి. ఇలా చేసుకున్న వాటిని రెండురెండు చొప్పున కాగుతోన్న నూనెలో వేసి ఎర్రగా వేయించి తీసుకోవాలి. ఇదేవిధంగా మిగిలిన పిండీ చేసుకుంటే చాలు.



## పెళ్లికి ముందు లాగా ప్రేమించడం ప్రేమ పెళ్లి తర్వాత ఎందుకు కష్టం అవుతుంది..



మీరు ఎవరినైనా హృదయపూర్వకంగా ప్రేమిస్తే, ఆ వ్యక్తిని మీ జీవిత భాగస్వామిగా చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. మీ బాయ్‌ఫ్రెండ్ లేదా గర్ల్‌ఫ్రెండ్‌ని పెళ్లి చేసుకోవడం అనేది ఒక అందమైన కల నెరవేరడం లాంటిది. మొదట్లో ప్రేమ వివాహం చాలా బాగుందని అనిపించినా కొంత కాలం తర్వాత ఇద్దరి వైఖరిలో మార్పు రావడం చాలా సహజం. అయితే, పెళ్లికి ముందు లాగా ప్రేమించడం లేదని మీ భాగస్వామి భావించవచ్చు. పెళ్లికి ముందు లాగా ప్రేమించడం భర్త లేదా భార్యకు ఎందుకు కష్టంగా మారుతుందో ఈ కథనంలో తెలుసుకుందాం.

1. బాధ్యతల భారం:

పెళ్లి తర్వాత డబ్బు సంపాదించడానికి, ఇంటి బాధ్యతలను నిర్వహించడానికి జీవిత భాగస్వాములపై ఒత్తిడి పెరుగుతుంది. సాధారణంగా పెళ్లికి ముందు బాధ్యతలు తక్కువగా ఉంటాయి. పెళ్లికి ముందు ఫ్రీగా ఉన్నట్లు పెళ్లి తర్వాత ఉండలేం. కానీ, పెళ్లి తర్వాత బాధ్యతలు ఎక్కువ అవుతాయి. కాబట్టి, పెళ్లి తర్వాత ప్రేమ తరచుగా వెనుకబడిపోతుంది.

2. సమయం లేకపోవడం:

బాధ్యతల భారం కారణంగా, మీరు ఒకరికొకరు తక్కువ సమయం ఇవ్వగలుగుతారు. ఉద్యోగం అంటూ డే అంతా ఆఫీస్ లోనే సరిపోతుంది కాబట్టి ఒకరికొకరు సమయం కేటాయించలేకపోవచ్చు. ఇలా ఉండటం వల్ల కూడా పెళ్లికి ముందు ప్రేమించుకున్నట్లు పెళ్లి తర్వాత ఉండలేం.

3. అధిక అంచనాలు:

వివాహానికి ముందు, బాయ్‌ఫ్రెండ్ లేదా గర్ల్‌ఫ్రెండ్‌కు మనం అలా ఉండాలి, ఇలా ఉండాలి అని ఎన్నో అనుకుంటారు. ప్రేమికులు తమ భవిష్యత్తు వైవాహిక జీవితం గురించి అధిక అంచనాలను ఏర్పరుచుకుంటారు. అయితే, ఆ అంచనాలు నెరవేరకపోతే వారు ప్రేమపై విశ్వాసం కోల్పోతారు.

4. ప్రతికూల భాగాలు తెరపైకి వస్తాయి:

పెళ్లికి ముందు ప్రేమికులు ప్రతిరోజూ లేదా వారంలో కేవలం కొన్ని గంటలపాటు మాత్రమే కలుసుకుంటారు.. కాబట్టి ఉన్న సమయంలో హ్యాపీగా ఉంటారు. కానీ, పెళ్లయ్యాక 24 గంటలు కలిసిఉంటారు కాబట్టి చెడు లక్షణాలు బయటపడుతాయి. ఇలా పెళ్లి తర్వాత కనిపించే కొన్ని చెడు గుణాలను ఎదుటివారు స్వీకరించలేకపోతారు.

5. కుటుంబ అంచనాలు:

వివాహం తర్వాత, మీరు మీ ప్రేమికుడితో మాత్రమే జీవించలేరు.. ఎందుకంటే కుటుంబం కూడా మీ నుండి అనేక రకాల అంచనాలను కలిగి ఉంటుంది. కుటుంబ ఒత్తిడి కారణంగా, మీరు తరచుగా మీ భర్త లేదా భార్యతో మీ పాత ప్రేమ జీవితాన్ని గడపలేరు.

## ఈ లక్షణాలున్న వారు ఎప్పుడైనా
# మిమ్మల్ని మోసం చేయవచ్చు..



జీవితం అనేది సుదీర్ఘ ప్రయాణం. దీనిలో మనం చాలా మందిని కలుస్తాము. కొంతమంది మన జీవితంలో ఆనందాన్ని తెస్తారు. కొందరు మనకు ముఖ్యమైన పాఠాలు నేర్పుతారు. కానీ దురదృష్టవశాత్తు, ఈ కాలంలో మనల్ని మోసం చేసేవారే ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా ఈ 5 లక్షణాలున్న వ్యక్తి మిమ్మల్ని ఎప్పుడైనా మోసం చేయవచ్చు. కాబట్టి, ఇలాంటి వారికి దూరంగా ఉండటం బెటర్.

**1. అహేతుకంగా మాట్లాడటం:**

మోసపూరిత వ్యక్తుల యొక్క అతి పెద్ద లక్షణం ఏమిటంటే వారు తరచుగా అహేతుకంగా మాట్లాడటం. వారి మాటల్లో స్పష్టత ఉండదు. మీరు ఒక వ్యక్తిలో మళ్లీ మళ్లీ ఇలాంటి ప్రవర్తనను చూసినట్లయితే, మీరు అతని పట్ల జాగ్రత్తగా ఉండాలి.

2. మాట నిలబెట్టుకోకపోవడం:

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండని వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించండి. ఎందుకంటే అలాంటి వ్యక్తులు కట్టుబాట్లను పాటించరు. అంతేకాకుండా వారు ఎవరినైనా ఎప్పుడైనా మోసం చేయవచ్చు.

**3. నిరంతర అబద్ధం:**

అబద్ధం మోసానికి స్పష్టమైన సంకేతం. ఒక వ్యక్తి పదే పదే అబద్ధాలు చెబితే అతన్ని నమ్మడం కష్టం. చిన్న అబద్ధాలు కూడా పెద్ద మోసానికి నాంది కాగలవు. అందువల్ల మీరు మరింత అప్రమత్తంగా ఉండాలి. వారితో ఎలాంటి వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దు.

**4. ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం:**



ఇతరుల గురించి తరచుగా చెడుగా మాట్లాడే వ్యక్తులు మీకు కూడా అదే విధంగా చేయవచ్చు. అలాంటి వ్యక్తులు కబుర్లు చెప్పడం, ఇతరుల గురించి ప్రతికూలంగా మాట్లాడటం వంటివి చేస్తుంటారు. అలాంటి వ్యక్తుల నుండి దూరం పాటించడం మంచిది. ఎందుకంటే మీరు లేనప్పుడు వారు మీ గురించి మరొకరితో చెడుగా మాట్లాడవచ్చు.

**5. స్వార్థపూరిత ప్రవర్తన:**

తమ గురించి మాత్రమే ఆలోచించి, ఇతరుల గురించి పట్టించుకోని వ్యక్తులు కూడా మోసం చేయవచ్చు. అలాంటి వారు తమ ప్రయోజనాల కోసం ఎవరినైనా ఉపయోగించుకోవచ్చు. అందువల్ల, స్వార్థపూరిత ప్రవర్తనను ప్రదర్శించే వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించండి.

**ముఖ్యమైన సలహా..**

ఈ సంకేతాలు మిమ్మల్ని జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నాయి. మోసాన్ని నివారించడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు, కానీ ఈ సంకేతాలను గుర్తించడం, జాగ్రత్తగా ఉండటం ద్వారా మీరు దాని ప్రభావాన్ని తగ్గించవచ్చు. వెంటనే ఎవరినీ నమ్మవద్దు.

## ఔషధ గని.. తిప్పతీగ



తిప్పతీగను ఆయుర్వేద వైద్యంలో అనేక రకాల రోగాలకు ఔషధంగా ఇస్తుంటారు. దీనిలో ఔషధ తత్వాలతో పాటు ప్రొటీన్లు 11.2 శాతం, కాల్షియం, ఫాస్ఫరస్ కూడా ఉంటాయి. కొంతమంది దీని ఆకులను కూరల్లో వేసి వండుకుంటారు కూడా. దీని కొమ్మలు వగరుగా, చేదుగా ఉంటాయి. త్రిదోషహరం, ఆయుర్వృద్ధికి వాడుతారు. ఇది శరీర బలహీనతలను తగ్గిస్తుంది.

ఎలా వాడుతారు?

–వైరల్, విష జ్వరాలకు – తీగ రసాన్ని ఒక చెంచాడు (30మి.లీ.) తీసుకుని నీళ్లలో కలిపి రోజుకి మూడుసార్లు ఇస్తే జ్వర తీవ్రత తగ్గుతుంది.

–శరీరం దృఢంగా, ఆరోగ్యంగా ఉండడానికి రోజూ చెంచాడు తిప్పతీగ రసాన్ని నీళ్లలో కలిపి ఒకట్రెండు నెలలు తీసుకుంటే మంచి గుణం ఉంటుంది.

–చిన్నపిల్లల్లో శరీరం ఎదగక, బలహీనంగా ఉన్నప్పుడు ఒక చెంచాడు తిప్పతీగ రసం, ఒక చెంచాడు ఉసిరిక రసానికి తగినంత తేనె కలిపి ఒకట్రెండు నెలలు ఇవ్వాలి.

–అజీర్తి, కడుపుబ్బరం, కాలేయం పనితీరు మందగించినప్పుడు ఒక చెంచాడు తిప్పతీగ రసానికి 1–2చిటికెల మిరియాల పొడి, తగినంత తేనె కలిపి ఇస్తే మంచిది.

–మెదడు చురుగ్గా పనిచేయడానికి, శరీర బరువు తగ్గడానికి తిప్పతీగ రసంలో పిప్పళ్ల చూర్ణం చిటికెడు, తగినంత తేనె కలిపి భోజనానికి ముందు తీసుకోవాలి. –దీర్ఘకాలంగా వేధించే దగ్గు, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నవారు తిప్పతీగ రసంలో కరక్కాయ పొడి రెండు చిటికెలు, వాము పొడి 2 చిటికెలు, తగినంత తేనె కలిపి తీసుకోవాలి.–అధిక రుతుస్రావంతో బాధపడుతున్నవాళ్లు ఒక చెంచాడు తిప్పతీగ రసానికి తగినంత తేనె కలిపి కొద్ది రోజులు తీసుకుంటే మంచిది. బాలితలకు పాలు అధికంగా పడితేఈ రసాన్ని ఇస్తే సమస్య తగ్గుతుంది.

చర్మానికీ ఔషధమే!–తిప్పతీగకు చర్మవ్యాధులను తగ్గించే గుణం అధికంగా ఉంది. కాబట్టి దీని రసాన్ని రోజూ ఒక చెంచాడు తీసుకుంటే పైపూతగా కూడా వాడితే మంచి గుణం కనిపిస్తుంది.

–మానని పుండ్లకు ఆకులను కట్టుగా కడితే త్వరగా తగ్గుతాయి.

–ఒక చెంచాడు తిప్పతీగ రసానికి ఒక చెంచాడు శొంఠి చూర్ణం, తగినంత తేనె కలిపి తీసుకుంటే ఆమవాతపు నొప్పులు, గౌట్ నొప్పులు, వాపులు తగ్గుతాయి.

–మూత్ర సమస్యలతో బాధపడుతున్నవారు ముఖ్యంగా మూత్రంలో మంట ఉన్నవారు దీన్ని కొబ్బరినీళ్లలో కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

–కొంతమందికి శరీరంలో పొటాషియం తగ్గితే మంటలు ఉంటాయి. ఇలాంటివారు తిప్పతీగ రసాన్ని పై పూతగా రాసుకుంటే మంచి గుణం కనిపిస్తుంది. దీనినుండి తీసిన సత్వం అనే తెల్లటి పొడిని అరచెంచాడు తేనెతో కలిపి తింటే మరింత మంచిది.

–మధుమేహంతో బాధపడేవారు తిప్పతీగ రసంలో చిటికెడు పసుపు, ఉసిరిక రసం కలిపి చిన్న చిన్న గుళ్లుగా చేసి రోజుకు రెండుమూడు సార్లు తీసుకుంటే మధుమేహం అదుపులో ఉంటుంది.

జాగ్రత్తలు:తిప్పతీగను ఔషధంగా మితంగా తీసుకోవాలి. పనిచేస్తుంది కదా అని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో వాపులు వస్తాయి. ఇలాంటప్పుడు విరుగుడుగా జీలకర్ర, వాము, తేనె పనిచేస్తాయి. తిప్ప ఆకుల రసం దొరకనప్పుడు చూర్ణం వాడుకోవచ్చు.




## నిన్నటి భారీ లాభాలకు బ్రేక్.. నష్టాల్లో భారత స్టాక్ మార్కెట్లు..



**న్యూఢిల్లీ-నవభూమి:** నిన్న భారీగా పుంజుకున్న భారతీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు మిశ్రమ సంకేతాలను చూపిస్తున్నాయి. ఈ క్రమంలో ఉదయం 9:40 గంటలకు బీఎస్ఈ సెన్సెక్స్ 324 పాయింట్లు పడిపోయింది. మరోవైపు నిఫ్టీ 81 పాయింట్లు తగ్గి 24,107 స్థాయిలో ఉండగా, బ్యాంక్ నిఫ్టీ 205 పాయింట్లు తగ్గి 51398 స్థాయిలో కొనసాగుతోంది. ఇదే సమయంలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 202 పాయింట్లు పెరగడం విశేషం. దీంతో మదుపర్లు కొన్ని నిమిషాల వ్యవధిలోనే లక్షల కోట్లు రూపాయలు కోల్పోయారు. మరోవైపు ఇంకొంత మంది లాభపడ్డారు. ఈ క్రమంలో ప్రస్తుతం హీరో మోటోకార్ప్, సిప్లా, టెక్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, వంటి కంపెనీల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉండగా, టైటాన్ కంపెనీ, శ్రీరామ్ ఫైనాన్స్, ట్రెంట్ సంస్థల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. స్టాక్ మార్కెట్‌లో ఎఫ్ఐఐల (విదేశీ సంస్థల పెట్టుబడిదారులు) కొనుగోళ్లు జరుగుతున్నా, గిఫ్ట్ నిఫ్టీపై సుమారు 100 పాయింట్ల ఒత్తిడి కనిపిస్తోంది. ఆసియాలో మిశ్రమ పరిస్థితులు నెలకొన్నాయి. నిన్న అమెరికా మార్కెట్లలో స్వల్ప క్షీణత కనిపించింది. మరోవైపు చైనాలో డిమాండ్ పెరగడంతో ముడిచమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ అయిల్ ధర $ 76 దాటింది. ఈ పెరిగిన క్రూడ్ ధరలు సేఫ్ హెవెన్ డిమాండ్‌ను ప్రేరేపిస్తూ బంగారం రేట్లు పెరిగేలా చేశాయి. మరోవైపు 2024-2025 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రారంభ ట్రేడ్‌లో అవెన్యూ సూపర్‌మార్ట్స్ షేర్ ధర 10 శాతం పెరిగింది. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా దీని స్వతంత్ర ఆదాయం రూ. 15,565.23 కోట్లుగా ఉందని ప్రకటించింది.

## హెచ్‌డీఎఫ్‌సీ నుంచి మరో 2 కొత్త పథకాలు.. రూ.100 ఉంటే చాలు.. పూర్తి వివరాలు ఇవే..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారి కోసం మరో రెండు కొత్త స్కీమ్స్ తీసుకొస్తోంది హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్స్. ఆయా స్కీమ్స్‌కి సంబంధించి ముసాయిదా పత్రాలను సెబీ వద్ద సమర్పించింది. త్వరలోనే ఈ స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ అందుబాటులోకి రానుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.100 నుంచి మొదలవుతోంది. ఈ రెండు పథకాల గురించి ఇప్పుడే మనం తెలుసుకుందాం. ప్రముఖ అసెట్ మెనేజ్మెంట్ సంస్థల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ ఈక్విటీ పెట్టుబడిదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. మ్యూచువల్ ఫండ్స్‌లో మరో రెండు కొత్త పథకాలను తీసుకొస్తున్నట్లు తెలిపింది. రెండు పాసివ్ ఫండ్స్‌కు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించింది. సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించగానే సబ్‌స్క్రిప్షన్‌కి తీసుకురానుంది. ఇందుకు చాలా తక్కువ సమయమే పడుతుందని చెప్పవచ్చు. మరి ఈ రెండు పథకాల గురించి ఇప్పుడే మనం తెలుసుకుందాం. కొత్తగా తీసుకొస్తున్న రెండు పాసివ్ ఫండ్స్‌లో మొదటిది హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ 100 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ . ఇక రెండోది హెచ్‌డీఎఫ్‌సీ క్రిసిల్ ఐబీఎక్స్ ఏఏఏ బాండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ సెప్టెంబర్ 2027 ఫండ్. ఇందులో మొదటి స్కీమ్ గురించి పరిశీలిస్తే ఇది ఒక ఓపెన్ ఎండెడ్ స్కీమ్. ఇది నిఫ్టీ 100 క్వాలిటీ 30 ఇండెక్స్ బెంచ్‌మార్క్ కలిగి ఉంది. నిఫ్టీ 100 క్వాలిటీ 30 ఇండెక్స్ ఆధారంగా దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందించాలనే లక్ష్యంతో ఈ కొత్త ఫండ్ తీసుకొస్తున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ తెలిపింది. ఈ పథకాన్ని నిర్మాన్ మొరాఖియా, అరుణ్ అగర్వాల్ నిర్వహిస్తారని తెలిపింది. ఈ పథకంలో కనీస పెట్టుబడి రూ.100గా నిర్ణయించినట్లు తెలిపింది. ఆ తర్వాత ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ స్కీమ్‌లో పెట్టే డబ్బులో 95-100 శాతం నిఫ్టీ 100 క్వాలిటీ 30 ఇండెక్స్‌లోని సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయనుంది. అలాగే 0-5 శాతం డెట్ సెక్యూరిటీలు, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్స్, డెట్ స్కీమ్స్ యూనిట్లలో ఇన్వెస్ట్ చేయనుంది. ఇక రెండో స్కీమ్ హెచ్‌డీఎఫ్‌సీ క్రిసిల్ ఐబీఎక్స్ ఏఏఏ బాండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ సెప్ 2027 ఫండ్ విషయానికి వస్తే ఇది సైతం ఒక ఓపెన్ ఎండెడ్ స్కీమ్. దీని బెంచ్ మార్క్ ఇండెక్స్ క్రిసిల్ ఐబీఎక్స్ ఏఏఏ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ %ావజూ%2027గా ఉంది. మధ్యస్త వడ్డీ రేటు రిస్క్, లో క్రెడిట్ రిస్క్ కలిగి ఉంటుంది. ఈ పథకాన్ని అనుపమ్ జోషి నిర్వహిస్తారు. ఇందులో కనీస పెట్టుబడి సైతం రూ.100గా ఉంది. ఈ స్కీమ్‌లోని పెట్టుబడుల్లో 95-100 శాతం క్రిసిల్ ఐబీఎక్స్ ఏఏఏ ఫైనాన్షియస్ సర్వీస్ సెక్టార్‌లో ఇన్వెస్ట్ చేస్తారు. ఇక 0-5 శాతం డెట్ సెక్యూరిటీలు, మనీ మార్కెట్, డెట్ స్కీమ్స్ లో పెట్టుబడి పెడతారు.


## ఇన్వెస్టర్ల కోసం మరో 3 కొత్త స్కీమ్స్.. కనీసం రూ. 500 ఉంటే చాలు.. లాస్ట్ డేట్లు ఇవే..




**న్యూఢిల్లీ-నవభూమి:** మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తే దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ వస్తాయని నిపుణులు చెబుతుంటారు. రిస్క్ ఉన్నప్పటికీ మంచి ఫండ్స్ లాంగ్ రన్‌లో లాభాలు ఇచ్చేవి చాలానే ఉంటాయి. స్టాక్ మార్కెట్లకు ప్రత్యామ్నాయంగా దీనిని చూస్తుంటారు. ఇప్పుడు మార్కెట్లోకి మూడు కొత్త మ్యూచువల్ ఫండ్స్ లు వచ్చాయి. ఇప్పుడు వీటిని సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. మార్కెట్లోకి ఇప్పుడు మరో 3 మ్యూచువల్ ఫండ్స్ %చీఖీూ% లు వచ్చాయి. వీటిని ఇప్పుడు సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉంచారు. 3 ఫండ్స్ థిమాటిక్ ఫండ్, ఈఎల్ఎస్ఎస్ కేటగిరీ ఫండ్, గిల్ట్ ఫండ్ ఉన్నాయి. ఇందులో బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ నుంచి 2 స్కీమ్స్ ఉన్నాయి. మరొకటి యూటీఐ మ్యూచువల్ ఫండ్. ఇందులో బజాజ్ ఫిన్‌సర్వ్ టాక్స్ సేవర్ ఫండ్ గురించి ప్రధానంగా చెప్పుకోవాలి. ఇది ఈఎల్ఎస్ఎస్ ఫండ్. అంటే దీంట్లో పెట్టుబడులపై భారీగా పన్ను ఆదా చేసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరంలో రూ. 1.50 లక్షల వరకు టాక్స్ తగ్గించుకోవచ్చని చెప్పొచ్చు. సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే ప్రారంభం కాగా.. జనవరి 22 లాస్ట్ డేట్. ఇక దీంట్లో కనీసం రూ. 500 తో ఇన్వెస్ట్ చేయొచ్చు. ఒకేసారి లేదా సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేయొచ్చు. దేంట్లో అయినా కనీసం రూ. 500 సరిపోతుంది. గరిష్టంగా ఎంతైనా పెట్టొచ్చు. సిప్‌కు అయితే కనీసం 6 ఇన్‌స్టాల్‌మెంట్స్ చెల్లించాలి. బజాజ్ ఫిన్‌సర్వ్ గిల్ట్ ఫండ్ కూడా సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించగా.. జనవరి 13 వరకు కొనసాగనుంది. ఇది రుణ తరగతికి చెందిన ఓపెన్ ఎండెడ్ పథకం. దీంట్లో కనీస పెట్టుబడి రూ. 5000 గా ఉంది. ప్రధానంగా ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. అందుకే ఇక్కడ పెట్టుబడులపై పెద్దగా రిస్క్ లేదు. దీర్ఘకాలంలో స్థిరమైన ప్రతిఫలం ఆశించే మదుపరులకు ఈ స్కీమ్ అనువుగా ఉంటుంది. దీనికి ఫండ్ మేనేజర్లుగా సిద్ధార్థ్ చౌదరీ, నిమేశ్ చందన్ ఉన్నారు. ఇంకా యూటీఐ మ్యూచువల్ ఫండ్ కొత్తగా క్వాంట్ ఫండ్ తెచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ తరగతికి చెందిన థీమాటిక్ ఫండ్. ఇందులో సబ్‌స్క్రిప్షన్‌కు ఆఖరి తేదీ 16. న్యూ ఫండ్ ఆఫర్‌లో కనీస పెట్టుబడి రూ. 1000 గా ఉంది.

దీర్ఘకాలంలో ఎక్కువ లాభాలు ఆర్జించడం ఈ స్కీమ్ ప్రధాన వ్యూహం. ఈ పథకం మేనేజర్లుగా దీపేశ్ అగర్వాల్, శర్వాన్ కుమార్ గోయల్.

## భారతదేశంలో ఫిలిప్స్ విటాఅప్‌ని పరిచయం చేసిన సిగ్నిఫై

**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియా 2025: లైటింగ్‌లో ప్రపంచ అగ్రగామి , భారతదేశంలో తన విప్లవాత్మక ఉత్పత్తి ఫిలిప్స్ విటాఅప్ ని ప్రారంభించామని ప్రకటించింది. ఈ వినూత్న ఉత్పత్తి చాలా కాలం పాటు ఇండోర్ సెట్టింగ్‌లో యూవీబీ ని తక్కువ-తీవ్రత డోస్‌ను అందించడం ద్వారా వ్యక్తిగత శ్రేయస్సును అందించేందుకు మద్దతుగా రూపొందించారు. ఎముకలు, దంతాలు ధృఢంగా ఉండేలా ప్రోత్సహించడం, రోగనిరోధక పనితీరుకు మద్దతు ఇవ్వడం, మానసిక స్థితిని, మానసిక పనితీరును మెరుగుపరచడం ద్వారా మొత్తం ఆరోగ్యాన్ని, శ్రేయస్సును మెరుగుపరచడం ఫిలిప్స్ విటాఅప్ లక్ష్యంగా పెట్టుకుంది. నేడు ప్రజలు ఎక్కువ సమయం ఇంటి లోపల గడుపుతున్నారు. కనుక, ఆరోగ్యకరమైన ఇండోర్ వాతావరణాలను సృష్టించవలసిన ప్రాముఖ్యత మరింత ఎక్కువైంది. ఫిలిప్స్ విటాఅప్ విటమిన్ డి ఉత్పత్తిని ప్రేరేపించేందు కు కాంతిని ఉపయోగించడం ద్వారా ఈ అవసరాన్ని పరిష్కరించడంతో పాటు మొత్తం ఆరోగ్యాన్ని, శ్రేయస్సును ప్రోత్సహిస్తుంది. ప్రపంచ జనాభాలో దాదాపు 50% మంది విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారని పరిశోధనలు తేటతెల్లం చేశాయి. ఇది సహజమైన సూర్యరశ్మికి గురికావడాన్ని పరిమితం చేసే ఆధునిక జీవనశైలికి అత్యుత్తమమైనది. సండర్‌ల్యాండ్‌లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ఇదే విధమైన సాంకేతికతను ఉపయోగించి, విటమిన్ డి స్థాయిలను పెంచడంలో తక్కువ-తీవ్రత యూవీబీ ఎక్స్‌పోజర్ ప్రభావాన్ని ప్రదర్శించింది. ఈ పరిశోధన, అవుట్‌డోర్ ఎక్స్‌పోజర్ స్టడీస్ విటాఅప్ ప్రదర్శన గదుల నుంచి అంతర్గత డేటాతో పాటు, యూవీబీ సురక్షితమైన మరియు సమర్థవంత మైన రోజువారీ మోతాదును అందించడంలో ఫిలిప్స్ విటాఅప్ సమర్థతకు మద్దతు ఇస్తుంది. వారానికి రెండు నుంచి మూడు సార్లు ఇది మధ్యాహ్నం 15 నిమిషాల నడకకు సమానం. ఫిలిప్స్ విటాఅప్ ప్రయోజనాలు శారీరక ఆరోగ్యానికి మించి విస్తరించి, తక్కువ-తీవ్రత యూవీబీ డోస్‌ను అందిస్తాయి. అలాగే భావోద్వేగ శ్రేయస్సుకు మద్దతు ఇస్తాయి. ఇది ఇంటిగ్రేటెడ్ ప్రాక్సిమిటీ సెన్సార్, భద్రత సౌలభ్యం కోసం అంతర్నిర్మిత 8-గంటల టైమర్‌ను కూడా కలిగి ఉంటుంది. ఇది వినియోగ ˇదారు-స్నేహపూర్వకంగా, తేలికగా వినియోగించుకు నేందుకు అవకాశాన్ని కల్పిస్తుంది. సిగ్నిఫై గ్రేటర్ ఇండియా, ప్రొఫెషనల్ బిజినెస్, హెడ్ ఆఫ్ ఆఫర్ మేనేజ్‌మెంట్ మునిష్ పెషిన్ మాట్లాడుతూ, "భారతదేశంలోని మా వినియోగదారులకు ఫిలిప్స్ విటాఅప్‌ని పరిచయం చేసేందుకు మేము సంతోషిస్తున్నాము. ఈ ఉత్పత్తి విస్తృతమైన పరిశోధన, అభివృద్ధి ఫలితంగా, ప్రయోజనాలను తీసుకురావాలనే లక్ష్యాన్ని కలిగి ఉంది.

## కేతన్ పరేఖ్ మరో స్కామ్

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత స్టాక్ మార్కెట్లో భారీ అక్రమాలకు పాల్పడిన వ్యక్తుల్లో ప్రముఖంగా వినిపించే పేర్లు హర్షద్ మెహతా, కేతన్ పరేఖ్. డాట్ కామ్ బూమ్ (1999-2000) సమయంలో మార్కెట్‌ను శాసించిన కేతన్ పరేఖ్.. పలు ఆర్థిక మోసాలకు పాల్పడి జైలుకెళ్లడంతో పాటు సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి 14 ఏళ్ల పాటు నిషేధించబడ్డారు. అయినా, ఆయన తీరు మారలేదు. ఈ మార్కెట్ మాయావి మరో కుంభకోణం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఫ్రంట్ రన్నింగ్ స్కీమ్ ద్వారా రూ.65.77 కోట్లు అక్రమంగా ఆర్జించిన కేసులో కేతన్ పరేఖ్ సహా ముగ్గురు వ్యక్తులను సెబీ తక్షణమే సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధించింది.

## తొలివారం నష్టాలతో ముగిసిన స్టాక్స్.. 24 వేల ఎగువన నిఫ్టీ.. సెన్సెక్స్ 720 పాయింట్లు లాస్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 720.60 పాయింట్ల నష్టంతో 79,223.11 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 80,072 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 79,147.32 పాయింట్ల కనిష్ట స్థాయి వరకూ సాగింది. మరోవైపు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 183.90 పాయింట్లు కోల్పోయి 24,004.75 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 24,196.45 పాయింట్ల గరిష్ట స్థాయికి దూసుకెళ్లి, 23,978.15 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది.

బీఎస్ఈ-30 సెన్సెక్స్ లో జోమాటో, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టీసీఎస్ షేర్లు భారీగా నష్టపోయాయి. టాటా మోటార్స్, టైటాన్, నెస్లే ఇండియా, హిందూస్థాన్ యూనీ లివర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభ పడ్డాయి. గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 75.61 డాలర్లు పలికితే, ఔన్స్ బంగారం 2670 డాలర్ల వద్ద ట్రేడయింది. బ్యాంకింగ్, ఫైనాన్సియల్, ఐటీ స్టాక్స్ మీద అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనం అయ్యాయి.

హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ తదితర బ్లూచిప్ కంపెనీల షేర్లపై ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎన్ఎస్ఈ-50 నిఫ్టీలో 32 స్టాక్స్ నష్టాల్లోనే ముగిశాయి. విప్రో, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, సిప్లా వంటి స్టాక్స్ 2.83 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు, ఓఎన్జీసీ, టాటా మోటార్స్, టైటాన్, నెస్లే ఇండియా, ఎస్బీఐ లైఫ్ తదితర 18 స్టాక్స్ 5.11 శాతం వరకూ లాభ పడ్డాయి. బ్రాడర్ మార్కెట్లు - నిఫ్టీ మిడ్ క్యాప్-100 సూచీ 0.30 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 సూచీ 0.24 శాతం నష్టాలతో ముగిశాయి. ఇక సెక్టార్ల వారీగా ఇండెక్సుల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ 616 పాయింట్ల నష్టంతో 50,988.80 పాయింట్ల వద్ద ముగిసింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ 2.53 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.94 శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఓఎంసీ ఇండెక్సులు 1.26 శాతం లాభ పడ్డాయి. మరోవైపు నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ హెల్త్ కేర్ ఇండెక్సులు 1.44 శాతం వరకూ నష్టాలతో ముగిశాయి.

## రిలయన్స్ జియో రూ.40,000 కోట్ల ఐపీఓ!




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్).. తన టెలికాం సేవల అనుబంధ విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌ను మెగా పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఏడాది ద్వితీయార్థంలో కంపెనీ ఐపీఓకు రావచ్చని, తద్వారా రూ.35,000-40,000 కోట్లు సమీకరించే అవకాశం ఉందని సమాచారం. అనగా, దేశీయ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ కానుంది. ఐపీఓలో భాగంగా రిలయన్స్ జియో మార్కెట్ విలువను రూ.10 లక్షల కోట్ల స్థాయిలో లెక్కించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పలు బ్రోకరేజీ సంస్థలు ఇప్పటికే జియో విలువను రూ.8.5 లక్షల కోట్ల స్థాయిలో అంచనా వేశాయి. ఐపీఓలో భాగంగా జియో తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులకు చెందిన ఈక్విటీ వాటాను సైతం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించే అవకాశం ఉంది. ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ఆలోచన కూడా ఉన్నట్లు, ఇందుకోసం ప్రాథమిక చర్చలు కూడా ప్రారంభమైనట్లు సమాచారం.

ఒకవేళ ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా నిధులు సమీకరిస్తే, ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ ప్రస్తుత అంచనా కంటే తగ్గవచ్చు. ఆర్ఐఎల్ డిజిటల్ సేవల అనుబంధ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్‌లో భాగంగా రిలయన్స్ జియో ఉంది. అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), సిల్వర్ లేక్, కేకేఆర్, ముబాదల వంటి అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజాలకు జియోలో వాటాల విక్రయం ద్వారా అంబానీ 2020లో 1,800 కోట్ల డాలర్లు సమీకరించారు. ప్రస్తుతం జియోలో 33 శాతం వాటా విదేశీ ఇన్వెస్టర్ల చేతుల్లో ఉంది.

**ఇండో ఫార్మ్ ఐపీఓకు 227 రెట్ల బిడ్లు**

ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ రూ.260 కోట్ల ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి అపూర్వ స్పందన లభించింది. గురువారంతో ముగిసిన ఈ పబ్లిక్ ఇష్యూకు ఏకంగా 227.57 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. ఐపీఓలో భాగంగా కంపెనీ 84.70 లక్షల షేర్లను విక్రయానికి పెట్టగా.. ఇన్వెస్టర్ల నుంచి 192.75 కోట్లకు పైగా షేర్ల కొనుగోలుకు బిడ్లు వచ్చాయి. గడిచిన 11 నెలల్లో అత్యధిక రెట్ల సబ్‌స్క్రిప్షన్ సాధించిన ఐపీఓ ఇదే. 2024 ఫిబ్రవరిలో విభోర్ స్టీల్ ట్యూబ్స్ ఐపీఓ 320 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కాగా, కోల్‌కతాకు చెందిన ఆగ్రో కంపెనీ రీగాల్ రిసోర్సెస్ లిమిటెడ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.190 కోట్ల తాజా ఈక్విటీతో పాటు ప్రమోటర్‌కు చెందిన 90 లక్షల షేర్లను సైతం విక్రయించాల

## షాకింగ్.. వరుసగా మూడో రోజు
## పెరిగిన బంగారం, వెండి ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం, వెండి కొనుగోలు చేయాలని చూస్తున్నారా. అయితే ఓసారి ఈ ధరలను తెలుసుకుని వెళ్లండి మరి. గత వారం రేట్లను అంచనా వేసుకుని వెళ్తే ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఎందుకంటే ఈ రేట్లు మళ్లీ పెరిగాయి. అయితే తాజాగా ఏ మేరకు పెరిగాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. ఈ బంగారం వెండి ప్రియులకు షాకింగ్ న్యూస్ వచ్చేసింది. ఎందుకంటే కొత్త సంవత్సరం బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. కొత్త ఏడాది మూడో రోజు బంగారం ధర రూ. 330 పెరిగింది. శుక్రవారం జనవరి 3, 2025న ఉదయం నాటికి 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 300, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 330 పెరిగింది. దీంతో దేశంలోని చాలా నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.78,400కి చేరుకుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,900గా ఉంది. ఇక వెండి ధరల విషయానికి వస్తే ఈరోజు కిలో వెండి 90,400కు చేరుకుంది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం ధరలను ఇక్కడ తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ గోల్డ్ రేట్, 24 క్యారెట్ గోల్డ్ రేట్ (రూపాయల్లో)

ఢిల్లీ 71,950 78,480
ముంబై 71,800 78,330
కోల్‌కతా 71,800 78,330
హైదరాబాద్‌లో 71,810 78,340
విజయవాడలో 71,810 78,340
నోయిడా 71,950 78,480
ఘజియాబాద్ 71,950 78,480
జైపూర్ 71,950 78,480
గుర్గావ్ 71,950 78,480
లక్నో 71,950 78,480
పాట్నా 71,850 78,380
అహ్మదాబాద్ 71,850 78,380
భువనేశ్వర్ 71,800 78,330
బెంగళూరు 71,800 78,330

బంగారం ఎందుకు పెరిగింది?

అంతర్జాతీయ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు పెరగడం, దేశీయ మార్కెట్‌లో ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ పెరగడంతో ఈ పెంపు జరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. రూపాయి బలహీనత, అంతర్జాతీయ మార్కెట్‌లో బలపడటం బంగారం ధరలకు మద్దతునిచ్చాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కామెక్స్ మార్కెట్‌లో కూడా బంగారం ఔన్సు %వి% 2,640 పైన ట్రేడవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న కాలంలో బంగారం ధర మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

22, 24 క్యారెట్ల మధ్య తేడా మీకు తెలుసా?

బంగారం స్వచ్ఛతను గుర్తించేందుకు %×ూ% (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్క్ ఇస్తారు. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. రాగి, వెండి, జింక్ వంటి ఇతర లోహాలను 22 క్యారెట్ల బంగారంలో 9% కలిపి ఆభరణాలు తయారు చేస్తారు. 24 క్యారెట్ల బంగారం విలాసవంతమైనది అయినప్పటికీ, దీనిని ఆభరణాలు తయారు చేయడానికి ఉపయోగించుకోలేరు. అందుకే చాలా మంది దుకాణదారులు 22 క్యారెట్ల బంగారం విక్రయిస్తారు.

## లక్షను రూ.1.20 కోట్లు చేసిన 'మెట్రో రైల్' స్టాక్.. కొత్త ఆర్డర్‌తో ఫోకస్‌లోకి.. దూసుకెళ్తున్న షేర్లు!



**ముంబై-నవభూమి:** స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టే వారికి దీర్ఘకాలంలో పలు రకాల బెనిఫిట్స్ ఉంటాయి. కొన్ని స్టాక్స్ తమ ఇన్వెస్టర్లను మల్టీమిలియనీర్లను చేస్తుంటాయి. అలాంటిదే ఓ మెట్రో రైల్ మెషీన్ సప్లయర్ కంపెనీ స్టాక్. గత పదేళ్లలోనే లక్ష రూపాయలను ఏకంగా రూ.1.20 కోట్లు చేసి చూపించింది. ఇప్పుడు కొత్త ఆర్డర్ పొందినట్లు ప్రకటించిన క్రమంలో ఫోకస్‌లోకి వచ్చింది. మరి ఆ స్టాక్ గురించి ఇప్పుడే తెలుసుకుందాం. మెట్రో రైల్ మెషీన్ సరఫరా రంగానికి చెందిన ప్రముఖ కంపెనీ త్రిశక్తి ఇండస్ట్రీస్ లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. గత పదేళ్లలోనే తమ ఇన్వెస్టర్లను మల్టీమిలియనీర్లను చేసింది. లక్ష రూపాయలు పెడితే ఏకంగా రూ. 1.20 కోట్లు ఇచ్చింది. ఇప్పుడు లార్సెన్ అండ్ టర్బో లిమిటెడ్ (%ాడు%) కంపెనీ నుంచి కొత్త ఆర్డర్ అందుకున్నట్లు ప్రకటించి ఫోకస్‌లోకి వచ్చింది. కోల్‌కతమా మెట్రో ప్రాజెక్ట్ కోసం మెషీన్ల సరఫరా కోసం రూ. 2.50 కోట్ల ఆర్డర్ వచ్చినట్లు కంపెనీ తెలిపింది. ఈ క్రమంలో ఈ కంపెనీ స్టాక్ కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. దీంతో పాజిటివ్ ట్రెండ్‌లో కొనసాగుతోంది. కోల్‌కతా మెట్రో ప్రాజెక్టు కోసం వెంటనే అవసరమైన మెషీన్లు సరఫరా చేయాలని ఎల్అండ్‌టీ ఈ ఆర్డర్ అందించింది. ఈ కాంట్రాక్ట్ వ్యవధి 6 నెలలుగా ఉంటుంది. ఎల్అండ్‌టీ వంటి అతిపెద్ద మౌలికసదుపాయాల కంపెనీల డిమాండ్లను తీర్చడంలో త్రిశక్తి ఇండస్ట్రీస్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ కంపెనీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆయిల్ అండ్ గ్యాస్ ఎక్స్‌ప్లోరేషన్ సర్వీసులు అందిస్తోంది. అలాగే లాజిస్టిక్స్, ఇన్‌ఫ్రా, ఆయిల్ అండ్ గ్యాస్, ఫుడ్ సంబంధిత ఉత్పత్తులు, ఏజెన్సీ వంటి రంగాల్లో సేవలందిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఈ కంపెనీకు కస్టమర్లు ఉన్నారు.

త్రిశక్తి ఇండస్ట్రీస్ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.296 కోట్లుగా ఉంది. ఈ కంపెనీ మూడేళ్ల స్టాక్ ప్రైస్ సీఏజీఆర్ 200 శాతంగా ఉంది. ఈ స్టాక్ గత ఏడాది కాలంలో చూస్తే ఏకంగా 500 శాతం పెరిగింది. ఇక గత ఐదేళ్లలో చూసుకుంటే 5100 శాతం రిటర్న్స్ ఇచ్చింది. ఇక గత 10 సంవత్సరాలలో అయితే ఏకంగా 12 వేల శాతం పెరిగింది. లక్ష రూపాయలు పెట్టి షేర్లు కొన్నట్లయితే ఇప్పుడు వాటి విలువ రూ. 1.20 కోట్లకుపైగా ఉంటుంది. అదే ఈ స్టాక్ మార్కెట్లలోకి ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి చూసుకుంటే ఏకంగా 17 వేల శాతానికిపైగా పెరిగింది.

## తీరు మారేదే..లే ఆగని రూపాయి పతనం



**ముంబై-నవభూమి:** ముంబై, జనవరి 2: భారతీయ కరెన్సీ రూపాయి.. డాలర్ ముందు తేలిపోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపీ మారకపు విలువ రోజుకింత దిగజారుతూ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పతనమవుతున్నది. గురువారం మరో 11 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోల్చితే ఎక్స్ఛేంజ్ రేటు 85.75 వద్దకు క్షీణించింది. దీంతో ఈ ఏడాది రూపాయికి తొలి నష్టం ఎదురైనైట్టైంది. ఇంట్రా-డేలోనైతే 85.79కి పడింది. ఇక బుధవారం స్థిరంగా ఎక్కడిదక్కడే ఉన్న విషయం తెలిసిందే. కాగా, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్, దేశీయ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు ట్రేడర్లు చెప్తున్నారు. కాగా, ఈ 2025లో ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు తక్కువేనన్న సంకేతాలు, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాబోతుండటంతో పరుగులు పెడుతున్న డాలర్ ఇండెక్స్, అమెరికా పదేండ్ల బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడం వంటివి భారతీయ కరెన్సీని మరింత ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. రూపాయి పత నం దేశ ఆర్థిక వ్యవస్థకూ ఇబ్బందే. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు, జీడీపీ పతనం వంటి దుష్పరిణామాలకు దారితీస్తుంది.



# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

7 హైదరాబాద్ శనివారం 04 । జనవరి । 2025


## సీఎంపై కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు.. ఎవరంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' సీనియర్ నేత, ముఖ్యమంత్రి అతిషి పై పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. కల్కాజీ నియోజకవర్గం నుంచి తమ అభ్యర్థిగా ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబా పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా శుక్రవారంనాడు ప్రకటించింది. కల్జాజీ నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థిగా అతిషి పోటీలో ఉన్నారు.
ఢిల్లీ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎన్నికల్లో 51-కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అల్కా లంబా అభ్యర్థిత్వాన్ని సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఆమోదించినట్టు ఏఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. కల్కాజీ నియోజకవర్గంలో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య సంప్రదాయకంగా హోరాహోరీ పోరు ఉంటుంది. కాగా, అల్కా లంబా 2015లో 'ఆప్' టిక్కెట్టుపై చాందినీ చౌక్ నుంచి గెలిచారు. 2019లో పార్టీ నాయకత్వంతో విభేదించి కాంగ్రెస్‌లో చేరారు.
ఫిబ్రవరిలో ఎన్నికలుఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 2025 ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్నారు. గత ఎన్నికలు 2020 ఫిబ్రవరిలో జరిగాయి. ఎన్నికల తర్వాత అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి మూడోసారి సీఎం పగ్గాలు చేపట్టారు. ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి 2025 ఫిబ్రవరి 15వ తేదీతో ముగియనుంది.

## ప్రశాంత్ కిషోర్‌పై నెటిజన్ల ప్రశంసలు



**పాట్నా-నవభూమి:** పరీక్ష ప్రశ్న పత్రం లీకేజ్ ఆరోపణల నేపథ్యంలో బిహార్ సివిల్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ నిర్వహించిన పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ గురువారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. అలాగే ఈ దీక్షపై నెటిజన్లు సైతం తమదైన శైలిలో స్పందిస్తున్నారు. బిహార్ కీ కేజ్రీవాల్ అంటూ ప్రశాంత్ కిషోర్‌ను వారు సంబోధిస్తున్నారు. ఇక ఆందోళనకారులు భారీగా దీక్షా శిబిరానికి చేరుకొని ఆమరణ నిరాహార దీక్షకు దిగిన ప్రశాంత్ కిషోర్‌కు మద్దతు తెలిపారు. ఇక బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై ప్రశాంత్ కిషోర్ విమర్శలు సంధించారు. సీఎంగా నితీష్ పని చేయాలనుకోవడం లేదని.. ఆయన అధికారంలో ఉంటే చాలనుకొంటున్నారన్నారు. కోవిడ్ సమయంలో సైతం ఆయన ఇదే రీతిలో వ్యవహరించారని గుర్తు చేశారు. ఆయన ధ్యాస అంతా అధికారంపైనే కానీ.. ఇతర అంశాలపై కాదంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. తన నిరసన కొనసాగుతోందని స్పష్టం చేశారు. గత రెండున్నరేళ్లుగా తాను బిహార్‌లో పని చేస్తున్నానని గుర్తు చేశారు. రాజకీయాల్లో భాగంగా తాను ఇలా చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై అదే తరహాలో ప్రశాంత్ కిషోర్ స్పందించారు.

## బస్సు చార్జీలు పెంచేశారు బాబోయ్..



**బెంగళూరు -నవభూమి:** శక్తి గ్యారెంటీ ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌలభ్యాన్ని కల్పిస్తున్న ప్రభుత్వం ఇతరుల ప్రయాణాలపై భారం మోపింది. రాష్ట్రంలోని నాలుగు ఆర్టీసీ కార్పొరేషన్‌లు ప్రస్తావించిన ఛార్జీల పెంపుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య(%జవీ రాఅఉఝతీఝఝుఖుష్ట్ర%) అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. 23 అంశాలపై చర్చలు జరిపిన కేబినెట్ అన్నింటినీ ఆమోదం తెలిపినట్లు శాసనసభా వ్యవహారాలు, న్యాయశాఖా మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు.
మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వివరించారు. నాలుగు రవాణా కార్పొరేషన్‌లు బస్సు ఛార్జీలు పెంచాలని ప్రతిపాదించారని అందుకు అనుగుణంగా 15శాతంకు ఆమోదం తెలిపామన్నారు. ఆర్టీసీ సంస్థలు చేసే అప్పులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేలా తీర్మానించామన్నారు. ఇకపై ఆర్టీసీ సంస్థలు చేసే రుణాలకు ప్రభుత్వం ష్యూరిటీ ఇవ్వనుందన్నారు. హుబ్బళ్ళి- ధారవాడ జంట నగరాలకు కలిపి ఒక్కటిగానే ఉండే మహానగర పాలికెను రెండుగా విభజిస్తూ తీర్మానించారు. ఒకటవ వార్డు నుంచి 26వ వార్డు దాకా ధారవాడ మహానగర పాలికెగాను 27 నుంచి 82వ వార్డు దాకా హుబ్బళ్ళి మహానగర పాలికెగాను విభజించారు. ఇకపై రెండు వేర్వేరు కార్యాలయాలతో పాటు ఇతరత్రా సౌలభ్యాలను విభజించే ప్రక్రియ త్వరలోనే జరుపనున్నట్లు తెలిపారు. విధానపరిషత్ సభ్యుడు కెహెచ్ తిప్పేస్వామి పదవీకాలం ముగిసిన మేరకు నామినేటెడ్ విధానంతో ఒకరిని ఎంపిక చేసే నిర్ణయాన్ని సీఎం సిద్దరామయ్యకే అప్పగిస్తూ మంత్రులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే ఎవరిని ఎంపిక చేయాలనేది త్వరలోనే సీఎం నిర్ణయం తీసుకోనున్నారు. పారిశ్రామిక వాడల అభివృద్ధి కోసం భూముల సేకరణతో పాటు ఇతరత్రా సౌలభ్యాల సమకూర్చేందుకు ప్రస్తుతం ఉండే రూ.500 కోట్ల రుణ పరిమితిని ఏకంగా పదింతలు పెంచామని ఇకపై ఐదువేల కోట్ల దాకా వెసలుబాటుకు ఆమోదించామన్నారు. రాష్ట్రంలో గోశాలలు అభివృద్ధితో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న గోశాలలు మరిన్ని సౌలభ్యాలు కల్పించేందుకు రూ.10.50 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

## రికార్డు అమ్మకాలు.. ఒక్కరోజే రూ.9 కోట్ల మద్యం తాగేశారు



**బెంగళూరు -నవభూమి:** కొత్త సంవత్సరానికి ఉభయ జిల్లాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పోటాపోటీగా వేడుకలు చేసుకున్నారు. విజయనగరం, బళ్లారి(%ఎఅఓఝఋఖ్రుతీఝఎ, దీవశ్రీశ్రీఖతీఎ%) జిల్లాల్లో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదు కావడం గమనార్హం. 2024 డిసెంబరు 31 ఒక్కరోజే బళ్లారి, విజయనగర జిల్లాల్లో రూ. 9 కోట్ల మద్యం అమ్ముడు పోయింది. విస్కీ, బ్రాందీలతో పాటు బీర్ల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి.
విజయనగర జిల్లాలో వివిద బ్రాండుల విస్కీ, బ్రాందీల బాస్కులు 10,706 బాక్కులు అమ్ముడు పోయాయి. 5,169 బీరు బాక్సులు అమ్మారు. విజయనగర జిల్లాలో మొత్తం 154 వివిద లైసెన్సు బార్లు, వైన్‌షాపులు ఉన్నాయి. అలాగే బళ్లారి జిల్లాలో ఒక్క డిసెంబరు 31 రోజునే 10.481 వివిద లిక్కర్ బాక్సులు, అలాగే 1,27,898 బీరు కేసులు అమ్ముడు పోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడు అమ్మకాలు జోరుగా సాగినట్లు ఐఎంఎల్ అధికారులు ప్రకటించారు. చాలా దుకాణాల్లో సేల్ ఆర్డర్ కన్నా ఎక్కువగా అమ్ముడు పోవడంతో ఇతర షాపుల్లోనుండి ఇండెంట్ పెట్టి మద్యం తెచ్చుకుని అమ్ముకున్నారు. అర్ధరాత్రి వరకు దుకాణాలు, బార్లు కిటకిటలాయి.

# సాధారణ కూలి..నేడు లాటరీ కింగ్

### ఐదేళ్లల్లో రాజకీయ పార్టీలకు రూ.1300 కోట్ల విరాళాలు-వెయ్యి కోట్ల రూపాయలు




**ముంబై-నవభూమి:** అతడు ఒకప్పుడు సాధారణ కూలీ. కానీ ఇప్పుడు మాత్రం వేల కోట్లు సంపాదించాడు. దానికి కారణం లాటరీలు. లాటరీ బిజినెస్‌లో అవకతవకలు చేసిన ఆ వ్యక్తి ఏకంగా లాటరీ కింగ్‌గా ఎదిగాడు. ఇక లాటరీ బిజినెస్‌లో ఏటా రూ.15 వేల కోట్ల టర్నోవర్ జరిపినట్లు అధికారులు గుర్తించారు. అయితే అతడి బిజినెస్‌లో అవకతవకలు గుర్తించడంతో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు సంచలన విషయాలు కనుగొన్నారు. ఆ లాటరీ కింగ్‌కు చెందిన రూ.1000 కోట్ల ఆస్తులను అటాచ్ చేశారు.
లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్.. వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్-ఈడీ అధికారుల దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని నెలల క్రితం ఎలక్షన్ బాండ్ల సమాచారం బయటికి వచ్చి సమయంలో లాటరీ కింగ్ శాంటియాగో మార్టినే పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. వివిధ పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపంలో ఈ లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్.. ఏకంగా 5 ఏళ్లలోనే రూ.1300 కోట్లు వివిధ రాజకీయ పార్టీలకు అందించాడు. ఇదంతా లాటరీ బిజినెస్‌తో సంపాదించిందే కావడం గమనార్హం. అయితే లాటరీ బిజినెస్‌లో మోసాలకు పాల్పడి వేల కోట్ల సంపదను కూడబెట్టినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. అంతేకాకుండా ఒక్క ఏడాదిలోనే రూ.15 వేల కోట్లు సంపాదించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో వెల్లడైంది. ఈడీ దాడులతో శాంటియాగో మార్టిన్ ఆస్తులు, మోసాలు మొత్తం వెలుగులోకి వచ్చాయి. ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను స్థాపించిన శాంటియాగో మార్టిన్.. లాటరీల పేరుతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో 2014లో దీనిపై సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ తర్వాత 2018లో శాంటియాగో మార్టిన్ సహా ఆయన బంధువులు, ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్‌లో పనిచేసిన ఉద్యోగులపై ఈడీ అధికారులు మనీలాండరింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఇటీవల అతడి రూ.1000 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈ క్రమంలోనే మరింత లోతైన దర్యాప్తు చేపట్టగా సంచలన విషయాలు బయటికి వచ్చాయి. లాటరీ బిజినెస్‌లో వచ్చిన అక్రమ సొమ్ముతో ఆస్తులు కొనేందుకు శాంటియాగో మార్టిన్ ఏకంగా 350కి పైగా బోగస్ కంపెనీలను ప్రారంభించినట్లు తేలింది. అంతేకాకుండా ఎన్నో కార్లు కొనుగోలు చేశాడు. లాటరీ టికెట్లు కొనే వారికి కచ్చితంగా లాటరీ తగిలే టికెట్లను విక్రయించి.. వారి నుంచి ఆస్తులను కొనుగోలు చేసేవాడని దర్యాప్తులో ఈడీ అధికారులు గుర్తించారు. అంతేకాకుండా.. తన బంధువులు, ఫ్రెండ్స్‌ను లాటరీ డిస్ట్రిబ్యూటర్లుగా నియమించాడు. వీళ్లు ప్రైజ్ విన్నింగ్ లాటరీ టికెట్లను తమ వద్దే ఉంచుకుని మిగతా టికెట్లను మాత్రమే అమ్మేవారు. ఈడీ అధికారుల తనిఖీల్లో అలాంటి వందలాది టికెట్ల కట్టలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల్లో కొన్నింటిని శాంటియాగో మార్టిన్ అమ్మేసినట్లు అధికారులు గుర్తించారు. లాటరీ టికెట్లు విక్రయించి.. ఫ్యూచర్ గేమింగ్ సంస్థ ఏడాదికి రూ.15వేల కోట్ల ఆదాయాన్ని పొందినా.. ప్రభుత్వానికి మాత్రం చాలా తక్కువ మొత్తంలో లాభాలను చూపించిందని ఈడీ వర్గాలు తెలిపాయి. ఇక ఈ ఫ్యాచర్ గేమింగ్ కంపెనీకి సిక్కిం ప్రభుత్వ లాటరీ స్కీమ్ నుంచే భారీగా లాభాలు వచ్చాయని.. ఆ తర్వాత స్థానంలో పశ్చిమ బెంగాల్ ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. భారత్‌కు పొరుగున ఉన్న మయన్మార్‌లో సాధారణ కూలీ అయిన శాంటియాగో మార్టిన్.. 1988లో భారత్‌కు వచ్చాడు. తమిళనాడులో లాటరీ వ్యాపారం ప్రారంభించి కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు విస్తరించాడు. ఆ తర్వాత ఈశాన్య భారతదేశానికి మారిన శాంటియాగో మార్టిన్.. అక్కడ ప్రభుత్వ లాటరీ స్కీమ్‌లతో బిజినెస్ మొదలుపెట్టాడు. కొన్నేళ్లకు భూటాన్, నేపాల్‌లోనూ తన బిజినెస్‌లను విస్తరించాడు. ఆ తర్వాత స్థిరాస్తి, నిర్మాణ, టెక్స్‌టైల్, ఆతిథ్య రంగాల్లోకి అడుగుపెట్టి.. ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభించాడు. ఈ సంస్థకు వరల్డ్ లాటరీ అసోసియేషన్‌లో సభ్యత్వం కూడా ఉండటం గమనార్హం. ఈ కంపెనీ ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినో వంటి వాటిని కూడా నిర్వహిస్తుంది. ఇక ఈ సంస్థ నుంచి వచ్చిన డబ్బుతో 2019-2024 మధ్య రూ.1300 కోట్ల ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి.. వివిధ పార్టీలకు విరాళంగా ఇచ్చినట్లు ఇటీవల వెల్లడైంది. డీఎంకే, టీఎంసీ వంటి పార్టీలకు రూ.వందల కోట్ల విరాళాలను శాంటియాగో మార్టిన్ అందినట్లు తెలిసింది.

## ప్రాణాలు తీసిన పబ్జీ.. పట్టాలపై గేమ్ ఆడుతున్న ముగ్గురు బాలురను ఢీకొట్టిన రైలు



**న్యూఢిల్లీ-నవభూమి:** పబ్జీ గేమ్ ముగ్గురు పిల్లల ప్రాణాలు తీసింది. రైలు పట్టాలపై కూర్చొని.. చెవిలో హెడ్‌ఫోన్స్ పెట్టుకుని.. పక్కన ఏం జరుగుతుందో తెలియకుండా లోకాన్ని మరిచిపోయిన ఆ ముగ్గురు బాలురు.. క్షణాల్లోనే లోకాన్ని విడిచివెళ్లిపోయారు. పట్టాలపై పబ్జీ గేమ్ ఆడుతుండగా.. వేగంగా వచ్చిన రైలు వారిని ఢీకొట్టడంతో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకుని.. ఆ ముగ్గురు బాలుర ఆచూకీ గుర్తించి.. వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. పబ్జీ గేమ్. ఇది సరదాగా ఆడే ఆట అయినప్పటికీ.. ఈ పబ్జీ గేమ్‌కు బానిసైన వారి పరిస్థితి ఎలా ఉండేదో మనం ఇప్పటికే చాలా సంఘటనల్లో చూశాం. పగలు, రాత్రి తేడా లేకుండా పబ్జీ గేమ్ ఆడుతూ.. అందులోనుంచి బయటికి రాలేక అదే ఉచ్చులో చిక్కుకున్న వారిని మనం చాలా మందిని చూశాం. అయితే తేజాగా ఇదే పబ్జీ గేమ్ ముగ్గురు బాలుర ప్రాణాలు తీసింది. చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని.. రైలు పట్టాలపై కూర్చొని పబ్జీ ఆడుతున్న ముగ్గురు బాలురను అటు వైపు పట్టాల పైనుంచి వచ్చిన రైలు ఢీకొనడంతో వారు స్పాట్‌లోనే మృతిచెందిన ఘటన బీహార్‌లో సంచలనంగా మారింది. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, రైల్వే సిబ్బంది.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. పాట్నాలోని పశ్చిమ చంపారన్ జిల్లాకు చెందిన ముగ్గురు బాలురు.. నార్కటియాగంజ్-ముజఫర్‌పూర్ రైల్వే మార్గంలో పట్టాలపై కూర్చున్నారు. అయితే వారు పబ్జీ ఆడుతుండగా అదే మార్గంలో వచ్చిన రైలు.. వారిని ఢీకొట్టుకుంటూ వెళ్లింది. దీంతో వారు ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వారు ముగ్గురు చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని ఉండడం వల్ల.. పట్టాలపై వస్తున్న రైలును వారు గమనించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ రైలు ప్రమాదంలో చనిపోయిన వారిని ఫర్కాన్ ఆలం, సమీర్ ఆలం, హబీబుల్లా అన్సారీగా గుర్తించినట్లు తెలిపారు. ఇక ఆ ముగ్గురు బాలుర మృతికి సంబంధించిన విషయాన్ని వారి కుటుంబాలకు సమాచారం అందించారు. వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం చేసేందుకు తరలించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు.. ఇలా సురక్షితం కాని ప్రదేశాల్లో హెడ్‌సెట్ పెట్టుకుని.. పక్కన ఏం జరుగుతుందో పట్టించుకోకుండా ఉండడం వల్ల వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలుగుతోందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు అలర్ట్‌గా ఉండాలని తల్లిదండ్రులు, అధికారులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని పోలీసులు సూచించారు.

## తిరుచెందూరు ఆలయం వద్ద వెనక్కి మళ్ళిన సముద్రం



**చెన్నై-నవభూమి:** తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయం వద్ద సముద్రం రెండోరోజూ వెనక్కి మళ్ళింది. ఈ ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వచ్చేస్తుంటారు. అలా వచ్చే భక్తులంతా ఆలయం సమీపంలో ఉన్న సముద్రతీరంలో స్నానం చేసి, నాళికినరు వద్ద పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని స్వామివారి దర్శనానికి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులు అక్కడి సముద్రం వెనక్కిమళ్లుతోంది. బుధవారం ఉదయం సముద్రతీరం 50 అడుగుల మేర వెనక్కి మళ్ళింది. అమావాస్య సందర్భంగా పెరిగే ఆటుపోటుల ప్రభావం వల్ల సముద్రం వెనక్కి మళ్ళినట్లు అధికారులు చెప్పారు. ఈ పరిస్థితులలో గురువారం ఉదయం కూడా మళ్ళీ సముద్రం వెనక్కి వెళ్లింది. ఫలితంగా ఆలయ మండపం నుండి సముద్రతీరం వరకు మెట్లపై నడిచి వేళ్లేందుకు భయపడ్డారు. సుమారు 60 అడుగుల దూరం దాకా సముద్రం వెనక్కి మళ్ళింది. దీనితో సముద్రం స్నానం చేయాలనుకున్న పర్యాటకులు భక్తులు భీతిల్లారు. అలల తాకిడి కూడా అధికమైంది.

## పొరుగు రాష్ట్రాలతో పోల్చితే ఇక్కడే ఆస్తిపన్ను తక్కువ



**చెన్నై-నవభూమి:** పొరుగు రాష్ట్రాలైన కేరళ, ఆంధ్రప్రదేశ్(తో పాటు ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే ఆస్తి పన్ను మన రాష్ట్రంలోనే తక్కువగా ఉందని చెన్నై నగర మేయర్ ఆర్.ప్రియ(తెలిపారు. గురువారం చెన్నై కార్పొరేషన్ 44వ వార్డులో రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబుతో కలిసి ఆమె ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, చెన్నై నగర పాలక సంస్థలో గత పదేళ్ళలో ఆస్తి పన్నును పెంచలేదని గుర్తు చేశారు. 2022లో అతి తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను పెంచడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన కేరళ, ఆంధ్రప్రదేశ్(తో పోల్చితే మన రాష్ట్రంలోనే ఆస్తిపన్ను తక్కువగా ఉందన్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు నగర రహదారులు బాగా దెబ్బతిన్నాయన్నారు. ఈ రోడ్లపై ప్యాచ్ వర్క్‌లు సాగుతున్నాయని చెప్పారు. మరమ్మతులు చేయలేని రహదారులను మాత్రం కొత్తగా వేస్తున్నామన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో దొంగల ఆటకట్టు



**చెన్నై-నవభూమి:** నాగర్‌కోయిల్ సమీపంలో ఇంటి తాళాలు పగులగొట్టి దోపిడీ చేసే ఘటనను విదేశాల నుంచి సీసీ టీవీలో చూసి ఇంటి యజమాని, దోపిడీ దొంగలను తరిమిన వైనం గ్రామస్తులను ఆశ్చర్యపరిచింది. కన్నియాకుమారి జిల్లా కోట్టార్ ప్రాంతానికి చెందిన సలీమ్, మస్కట్‌లో పనిచేస్తున్నారు. కాగా కోట్టార్‌లోని తన ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి అక్కడి నుంచే పర్యవేక్షిస్తుంటాడు. రైలు ఢీకొని ముగ్గురు..ఈ క్రమంలో, ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన ఇద్దరు వ్యక్తులు, మంగళవారం రాత్రి తలుపులు పగులగొట్టి ఇంట్లో చొరబడి బీరువా బద్దలు కొట్టేందుకు యత్నిస్తున్నారు. ఈ దృశ్యాలను మస్కట్‌లో ఉంటున్న సలీమ్, తన సెల్‌ఫోన్ ద్వారా చూశాడు. ఆయన వెంటనే పక్కింటి వారికి ఫోన్ చేసి, తన ఇంట్లో దొంగలు పడినట్లు తెలిపారు. వారు బయటకు వచ్చి 'దొంగ...దొంగ' అంటూ కేకలు వేశారు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొనేలోపు, దొంగలు ఇంటి వెనుక తలుపు ద్వారా తప్పించుకు పారిపోయారు. ఈ ఘటనపై సలీమ్ కోట్టార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం సలీమ్ స్వగ్రామానికి రానున్న నేపథ్యంలో, ఈ ఘటనలో ఏ వస్తువులైనా దొంగిలించారా? అనే విషయం తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లేవారికి శుభవార్త.. 26 ప్రత్యేక రైళ్లు ప్రకటించిన రైల్వే



**:ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ప్రయాగ్‌రాజ్‌లో పన్నెండేళ్లకు ఒకసారి జరిగే కుంభమేళా చివరిసారి 2013లో జరిగింది. అప్పట్లో 20 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేసినట్టు అంచనా. కానీ, ఈసారి అంతకు మించి వస్తారని భావిస్తున్నారు. భారత్‌లోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా 123 దేశాల నుంచి ఈసారి 40 కోట్ల మంది వస్తారనే అంచనాతో యూపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో పలు ప్రాంతాల నుంచి రైల్వే సైతం ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 14 నుంచి ఫిబ్రవరి 28 వరకు 45 రోజుల పాటు జరగనున్న మహా కుంభమేళాకు యూపీ ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఈ కుంభమేళాలో 45 కోట్ల మందికిపైగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. తాజాగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లేవారి కోసం అదనంగా మరో 26 ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ రైళ్లు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ టౌన్‌బీ తెలంగాణలోని సికింద్రాబాద్, మౌలాలి జంక్షన్, వికారాబాద్ స్టేషన్ల నుంచి నడుస్తాయని తెలిపింది. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 27 వరకు పలు తేదీల్లో ప్రత్యేక రైళ్లు ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరుతాయని పేర్కొంది. జనవరి 14న రాత్రి 11 గంటలకు గుంటూరు-అజమ్‌గఢ్, జనవరి 16న రాత్రి 7.45 గంటలకు అజమ్‌గఢ్-విజయవాడ, ఫిబ్రవరి 5న రాత్రి 10 గంటలకు మచిలీపట్నం-అజమ్‌గఢ్, ఫిబ్రవరి 7న రాత్రి 7.45 గంటలకు అజమ్‌గఢ్-మచిలీపట్నం, ఫిబ్రవరి 15న సాయంత్రం 5.50 గంటలకు మౌలాలీ-గయ, ఫిబ్రవరి 17న రాత్రి 11.55 గంటలకు మౌలాలి-బనారస్, ఫిబ్రవరి 20న రాత్రి 8.10 గంటలకు కాకినాడ టౌన్-అజమ్‌గఢ్, ఫిబ్రవరి 22న రాత్రి 7.45 గంటలకు అజమ్‌గఢ్-విజయవాడ, ఫిబ్రవరి 19న రాత్రి 7.15 గంటలకు బనారస్-మౌలాలీ, ఫిబ్రవరి 18న మధ్యాహ్నం 3.45 గంటలకు వికారాబాద్-గయ, ఫిబ్రవరి 20న రాత్రి 7.45 గంటలకు గయ-వికారాబాద్, ఫిబ్రవరి 5న రాత్రి 7.20 గంటలకు విజయవాడ-గయ, ఫిబ్రవరి 7న రాత్రి 7.45 గంటలకు గయ-విజయవాడ, ఫిబ్రవరి 8న మధ్యాహ్నం 2.30 గంటలకు కాకినాడ టౌన్-గయ, ఫిబ్రవరి 10న మధ్యాహ్నం 2.15 గంటలకు గయ-విజయవాడ, ఫిబ్రవరి 22 సాయంత్రం 4.45 గంటలకు కాచిగూడ-పట్నా, ఫిబ్రవరి 24న సాయంత్రం 5 గంటలకు పట్నా-కాచిగూడ, ఫిబ్రవరి 7న సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్-పట్నా, ఫిబ్రవరి 9న మధ్యాహ్నం 3.30 గంటలకు పట్నా-సికింద్రాబాద్ నుంచి ఈ రైళ్లు బయలుదేరుతాయని తెలిపింది.

## అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా బీజేపీ చీఫ్




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పైనే ఉన్నాయి. ఎన్నికల తేదీలను ఈసీ ఇంకా ప్రకటించనప్పటికీ మరోసారి అధికారంలో కొనసాగేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ పీఠం ఈసారి కైవసం చేసుకోవాలనే పట్టుదలతో బీజేపీ ఉన్నాయి. కాగా, ఢిల్లీ బీజేపీ విభాగం అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ఆ పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం.
'ఆమ్ ఆద్మీ పార్టీ' మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఇప్పటికే విడుదల చేయగా, బీజేపీ ఇంతవరకూ అభ్యర్థుల జాబితాను ప్రకటించ లేదు. 2015 నుంచి ఢిల్లీలో ఆప్ అధికారంలో ఉంది. అయితే 2014 నుంచి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. బీజేపీ 7 లోక్‌సభ సీట్లను ఎగురేసుకుపోయింది. లెటర్ వార్..ఈ ఏడాది ఫిబ్రవరి లోగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఇందుకు సన్నాహకంపై బీజేపీ, ఆప్ పోటీపోటీ పోస్టర్ల వార్‌కు దిగాయి. విమర్శలు, ప్రతివిమర్శలు గుప్పించుకున్నాయి. తాజాగా 'లెటర్ వార్' కూడా జరుగుతోంది. ఢిల్లీ బీజేపీ చీఫ్ సచ్‌దేవ జనవరి 1న కేజ్రీవాల్‌కు లేఖ రాశారు. అబద్ధాలు, వంచన వంటి చెడు అలవాట్లను వదులుకోవాలని కేజ్రీవాల్‌కు ఆ లేఖలో ఆయన సూచించారు. చిన్నప్పటి నుంచి ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సరం వచ్చిందంటే చెడు ఆలవాట్లు వదులుకుని, కొత్తగా మంచి తీర్మానాలు చేస్తుంటారని, ఈరోజు నుంచి మీరు అబద్ధాలు, మోసాలు వంటి చెడు అలవాట్లు వదులుకోవాలని ఢిల్లీ వాసులంతా కోరుకుంటున్నారని ఆ లేఖలో సచ్‌దేవ్ పేర్కొన్నారు. క్కర్‌ను ప్రమోట్ చేసినందుకు ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

## కరోనా సమయంలోనే ఒకే ఇంట్లో కీర్తి-ఆంటోనీ!



కీర్తి సురేష్- ఆంటోనీ తట్టిల్ ఇటీవల వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. హిందూ-క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వేడుక జరిగింది. కీర్తి సురేష్ హిందువు కాగా, ఆంటోనీ క్రైస్తవ మతస్తుడు కావడంతోనే రెండు సంప్రదా యాలా ప్రకారం వివాహం జరిగింది. అయితే వీళ్లిద్దరిది ప్రేమ వివాహం. ఆంటోనీ చిన్న నాటి స్నేహితుడు. అతడితోనే జీవితాన్ని పంచుకుంటే? బాగుంటుందని భావించి కీర్తి వివాహ బంధంలోకి అడుగు పెట్టింది. అయితే రెండు పద్దతుల్లో పెళ్లి అనేసరికి చిన్నపాటి విమర్శలొస్తాయి. ఈ నేపథ్యంలోనే కీర్తి సురేష్ సైతం క్రైస్తవ మతాచారం ప్రకారం పెళ్లికి తన తండ్రి ఒప్పుకుంటాడో? లేదోనని సందేహం వ్యక్తం చేసింది. కానీ తండ్రి ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా క్రైస్తవ పద్దతిలోనూ పెళ్లికి అంగీకరించినట్లు తెలిపింది. తన తండ్రి నుంచి ఆ రకమైన రియాక్షన్ చూసి షాక్ అయ్యానని, ఏమాత్రం ఊహించలేకపోయాను అని అంది. అలాగే ఆంటోనీని ఇంటర్మీడియట్లో కలిసినట్లు తనకంటే ఆంటోనీ ఏడేళ్లు పెద్ద వాడు అని తెలిపింది. ఖతర్ లో కొన్నాళ్ల పాటు వర్క్ చేసారు. ఆ సమయంలో ఆరేళ్ల పాటు లాంగ్ డిస్టెన్స్ రిలేషన్ షిప్ లో ఉన్నామంది. కరోనా సమయానికి అది లివ్ ఇన్ రిలేషన్ షిప్ గా మారిందని తెలిపింది. కోవిడ్ టైమ్ లో ఒకే ఇంట్లో కలిసి ఉన్నట్లు పేర్కొంది. ఇక నటిగా కీర్తి సురేష జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇటలీవలే బాలీవుడ్ లో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. కానీ ఆ సినిమా ఆశించిన ఫలితాన్నివ్వలేదు. పెళ్లైన తర్వాత రిలీజ్ అయిన మొట్ట మొదటి చిత్రం.

నవచిత్ర





## ఒకే వేదికపైకి బాబాయ్-అబ్బాయ్..

పాసుల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణ లు! రాజమండ్రిలో జనవరి 4వ తేదీ సాయత్రం 'గేమ్ ఛేంజర్' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను గ్రాండ్ గా చేయడానికి టీమ్ ఏర్పాట్లు చేస్తున్నారు. మెగా అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న 'గేమ్ ఛేంజర్' సినిమా మరో వారం రోజుల్లో విడుదల కాబోతోంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన ఈ చిత్రం.. సంక్రాంతి కానుకగా జనవరి 10న థియేటర్లలోకి రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ స్పీడ్ పెంచిన మేకర్స్.. సినిమాని జనాలకు చేరువ చేయడానికి వివిధ ప్రచార కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రేపు ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రిలో మాస్సివ్ మెగా ప్రీ-రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించబోతున్నారు.నన్ను వేధించిన నాన్న చనిపోయాడని తెలిసింది: ఖుష్బూ రాజమండ్రిలో జనవరి 4వ తేదీ సాయత్రం 'గేమ్ ఛేంజర్' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను గ్రాండ్ గా చేయడానికి టీమ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఫంక్షన్ కు ఏపీ డిప్యూటీ సీఎం, రామ్ చరణ్ బాబాయ్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కూటమి ప్రభుత్వం అధికారికంలోకి వచ్చిన తర్వాత, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ పాల్గొనే ఫస్ట్ సినిమా ఈవెంట్ ఇదే. అందులోనూ చాలా రోజుల తర్వాత బాబాయ్ - అబ్బాయ్ ఒకే వేదిక మీద కనిపించే సందర్భం వస్తుండటంతో అభిమానులు ఎంతో ప్రత్యేకంగా భావిస్తున్నారు.'గేమ్ ఛేంజర్' ప్రీ-రిలీజ్ ఈవెంట్ లో సందడి చేసేందుకు తూర్పు గోదావరి జిల్లాకి చెందిన మెగా ఫ్యాన్స్ అంతా సిద్ధం అవుతున్నారు. రాజమండ్రి పవర్ ప్యాక్డ్ ఈవెంట్ పాసులు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇందుకోసం మెగాభిమానులు, జనసైనికులు లోకల్ లీడర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని సమాచారం. అయితే అందరికీ పాసులు అందించలేక స్థానిక నాయకులు తలలు పట్టుకుంటున్నారట. ఇదిలా ఉంటే 'గేమ్ ఛేంజర్' ఈవెంట్ కు పవన్ కల్యాణ్ చీఫ్ గెస్ట్ గా వస్తుండటం, అభిమానులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉండడంతో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని తెలుస్తోంది. ఇటీవల కాలంలో పబ్లిక్ ప్లేస్ లో జరిగిన తొక్కిసలాట ఘటనలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. పాసులు ఉన్న వారిని మాత్రమే ఈవెంట్ కు అనుమతించనున్నారని వార్తలు వస్తున్నాయి. హీరో రామ్ చరణ్ తో పాటుగా ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, పలువురు రాజకీయ నాయకులు ఈ వేడుకలో పాల్గొననున్నారు. కాగా, ఐదేళ్ల తర్వాత రామ్ చరణ్ నుంచి సోలోగా వస్తున్న సినిమా 'గేమ్ ఛేంజర్". చివరగా ఆయన 2019 సంక్రాంతికి 'వినయ విధేయ రామ' మూవీతో వచ్చారు. ఆ తర్వాత ఆచార్య వంటి రెండు మల్టీస్టారర్ సినిమాలు చేశారు. 'కిసీ కా భాయ్ కిసీ కి జాన్' అనే హిందీ మూవీలో ఒక పాటలో స్పెషల్ అప్పీరియన్స్ ఇచ్చారు. ఇప్పుడు గేమ్ చేంజర్ తో బాక్సాఫీస్ బరిలో దిగుతున్నారు.



## మహేష్ 2010లో చేసిన ట్వీట్ ఇప్పుడు వైరల్...

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు 2024 ఆరంభంలో సంక్రాంతి కానుకగా గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా అనుకున్న స్థాయిలో ఆడలేదు. త్రివిక్రమ్‌తో చేసిన మూడో సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. ఏడాది కాలంగా మహేష్‌బాబు షూటింగ్‌కి దూరంగా ఉంటున్నారు. కేవలం ఆయన గత ఏడాది కాలంగా రాజమౌళి సినిమా కోసం గ్రౌండ్ వర్క్‌లో బిజీగా ఉన్నారు. కొత్త లుక్‌తో పాటు, ఫిజిల్ ఫిట్ నెస్ కోసం వర్కౌట్‌లు చేస్తున్నారు. ఎట్టకేలకు రాజమౌళితో మహేష్ బాబు సినిమా పట్టా లెక్కింది. నిన్న సినిమా పూజా కార్యక్ర మాలు జరిగాయి. కానీ అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. మహేష్ బాబు, రాజమౌళి కాంబోలో మూవీ పట్టాలెక్కింది. రెగ్యులర్ షూటింగ్ సైతం ఈ నెలలోనే ఉంటుందని తెలుస్తోంది. హైదరాబాద్ శివారు ప్రాంతం లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో సినిమా మొదటి షెడ్యూల్‌కి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక వైపు రాజమౌళి సినిమాకు సంబంధించిన షూటింగ్ హడావుడి, పూజా కార్యక్రమాలకు సంబంధించిన





విషయం గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతున్న సమయంలో కొందరు మహేష్ బాబు ఫ్యాన్స్ దాదాపు 14 ఏళ్ల క్రితం మహేష్ బాబు ట్వీట్ చేసిన ఒక ట్వీట్‌ను వైరల్ చేస్తున్నారు. ఆ ట్వీట్‌లో మహేష్ బాబు తాను రాజమౌళి దర్శకత్వంలో సినిమాను చేయబోతున్నట్లుగా పేర్కొన్నాడు. ఆ సమయంలో మహేష్ బాబు ట్వీట్ ను జనాలు పెద్దగా పట్టించుకోలేదేమో కానీ ఇప్పుడు మాత్రం ఆ ట్వీట్‌ను తెగ షేర్ చేస్తున్నారు. ఖలేజా సినిమా సమయంలో మహేష్ బాబు నుంచి రాజమౌళి సినిమా ప్రకటన వచ్చింది. మహేష్ బాబుతో కాకుండా ఆ సమయంలో రాజమౌళి 'ఈగ' వంటి ప్రయోగాత్మక సినిమాను చేయడం జరిగింది. ఈగ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానంగా బాహుబలి సినిమాను పట్టాలెక్కించాడు. బాహుబలి సినిమా రెండు పార్ట్‌లు పూర్తి అయ్యి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు నాలుగు సంవత్సరాలు పట్టింది. ఆర్ఆర్ఆర్ సినిమా కోసం మూడు ఏళ్ల సమయం తీసుకున్నాడు.ఆ సినిమా సంక్రాంతికి రిలీజ్ రాజమౌళి ఎట్టకేలకు మహేష్ బాబుతో సినిమాను రూపొందిస్తున్నాడు. హాలీవుడ్ రేంజ్ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సినిమాను రూపొందించబోతున్నట్లుగా తెలుస్తోంది. రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లు మాత్రమే కాకుండా ఆస్కార్ స్టేజ్‌పై మరోసారి తెలుగు సినిమాను ఉంచాలని దర్శకుడు రాజమౌళి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే ఆఫ్రికా సహా పలు దేశాల్లో సినిమాను భారీ ఎత్తున రూపొందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే సినిమా 2027 ఆరంభంలో వచ్చే అవకాశాలు ఉన్నాయి. మహేష్ బాబు ఫ్యాన్స్ అదృష్టం బాగుంటే 2026 చివరి వరకు వచ్చినా ఆశ్చర్యం లేదని కొందరు అంటున్నారు.

## అఖిల్ కోసం అతడా? ఇతడా?



అక్కినేని వారసుడు అఖిల్ ఎట్టకేలకు 2025 లో కొత్త ప్రాజెక్ట్ ని పట్టాలెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. 'వినరో భాగ్యము విష్ణు కథ'తో సక్సెస్ అందుకున్న యువ దర్శకుడు మురళీ కృష్ణకు అఖిల్ చాన్స్ ఇచ్చి చేస్తోన్న చిత్రమిది. ప్రస్తు తం ఈప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. 'లెనిన్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. శ్రీలీలను హీరోయిన్ గా ఎంపిక చేసారు. అఖిల్-శ్రీలీల జోడీ ఆన్ స్క్రీన్ పై మరింత అందంగా ఉంటుందని మంచి బజ్ క్రియేట్ అవుతుంది. శ్రీలీల ఎంట్రీ అన్నది ప్రాజెక్ట్ కి పాజిటివ్ సైన్ గా కనిపిస్తుంది. 'లెనిన్' అని టైటిల్ ని బట్టి చూస్తే భారీ యాక్షన్ థ్రిల్లర్ గా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో సినిమాలో విలన్ పాత్రపై ఆసక్తి నెలకొంది. దీంతో ఇద్దరు నటుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. '1992 స్కామ్' తో సంచలనం అయిన ప్రతీక్ గాంధీ అయితే అఖిల్ కి ధీటుగా ఉంటాడని కొంత మంది భావిస్తుంటే? కోలీవుడ్ నటుడు విక్రాంత్ ని తీసుకుంటే బాగుంటుందని మరికొంత మంది అభిప్రా యపడుతున్నట్లు లీకులందుతున్నాయి. ఈ విషయంలో మేకర్స్ మధ్యన తర్జన భర్జన నడుస్తోంది. అయితే ప్రీతక్, విక్రాంత్ ఇద్దరు కూడా అఖిల్ కు సమ ఉజ్జీలే. ఏ ఒక్కరూ తీసేయాల్సిన ఆర్టిస్టులు కాదు. మరి అఖిల్ ని ఢీ కొట్టే ఛాన్స్ ఇద్దరిలో ఎవరిని వరిస్తుందో చూడాలి. అయితే ప్రతీక్ గాంధీ బాలీవుడ్ లో బిజీగా ఉన్నాడు. దీంతో అతడు అఖిల్ సినిమాకు అడిగిన విధంగా డేట్లు కేటాయించడం కష్టమనే మాట వినిపిస్తుంది. కోలీవుడ్ నటుడు విక్రాంత్ తో అయితే ఆసమస్య లేదు. ప్రస్తుతం తమిళ్ లో పెద్దగా సినిమాలేవి చేయలేదు. అధికారికంగా 'ది కిల్లర్ మ్యాన్' అనే సినిమా చేస్తున్నాడు. ఇది తప్ప అధికారికంగా మరో ప్రాజెక్ట్ లేదు. ప్రతీక్ గాంధీ మాత్రం సినిమాలతో పాటు , వెబ్ సిరీస్ ల్లో నటిస్తూ బిజీగా ఉన్నాడు. అతడు గనుక తీసుకుంటే భారీగా పారితోషికం కూడా చెల్లించాల్సి ఉంటుంది. తాను ఇచ్చిన డేట్లు ప్రకారం షూటింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా కొన్ని కండీషన్లు ప్రతీక్ గాంధీ నుంచి తప్పవు. మరి మేకర్స్ మనసులో ఏముందో తెలియాలి.

## 12 ఏళ్ల వెయిటింగ్‌కి ఫుల్‌స్టాప్.. ఆ సినిమా సంక్రాంతికి రిలీజ్



సినిమా ఇండస్ట్రీలో చాలా సినిమాలు ప్రారంభం అవుతాయి. అయితే ప్రారంభం అయిన సినిమాల్లో కేవలం 70 నుంచి 80 శాతం సినిమాలు మాత్రమే థియేటర్ వరకు వస్తాయి. మిగిలిన 20 నుంచి 30 శాతం సినిమాలు షూటింగ్ ప్రారంభం అయిన వెంటనే ఆగి పోతాయి, కొన్ని సినిమాలు షూటింగ్ మధ్యలో ఉండగా నిలిచి పోతాయి, కొన్ని సినిమాలు షూటింగ్ ముగింపు దశలో ఉండగా ఆగి పోతాయి. కొన్ని మాత్రం షూటింగ్ మొత్తం పూర్తి అయినా విడుదలకు ఏవో కారణాల వల్ల నోచుకోక పోవచ్చు. సినిమా షూటింగ్ మొత్తం పూర్తి చేసుకుని విడుదలకు నోచుకోని సినిమాలు చాలా అరుదుగా ఉంటాయి. అలాంటి సినిమాల జాబితాలోకి వచ్చే సినిమా విశాల్ నటించిన 'మదగజరాజా'.మదగజరాజా సినిమా దాదాపు 12 ఏళ్ల క్రితం ప్రారంభం అయ్యింది. షూటింగ్ సైతం పూర్తి అయ్యింది. కాని కొన్ని కారణాల వల్ల విడుదలకు నోచుకోలేదు. అప్పట్లో విశాల్‌కి జోడీగా అంజలి, వరలక్ష్మి శరత్ కుమార్‌లు నటించారు. ఆ సినిమా షూటింగ్ పూర్తి చేసి విడుదల చేస్తున్నాం అంటూ నిర్మాతలు ప్రకటించడం, ప్రమోషన్ కార్యక్రమాలు సైతం మొదలు అయ్యాయి. కాని సినిమా విడుదలకు కొన్ని రోజుల ముందు వాయిదా పడింది. అప్పటి నుంచి సినిమాను వాయిదా వేస్తూ వచ్చారు. కొన్ని సంవత్సరాలుగా ఆ సినిమా గురించిన ఊసే లేదు. అసలు సినిమా వస్తుందని ఏ ఒక్కరూ అనుకోలేదు. ఆ సినిమా గురించి అంతా మరచి పోతున్న ఈ సమయంలో అనూహ్యంగా సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నామని ప్రకటించారు. విశాల్ ఈమధ్య కాలంలో తమిళనాట మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఆయన నటించిన సినిమాలు మినిమం గ్యారెంటీ అన్నట్టుగా అక్కడ వసూళ్లు సొంతం చేసుకుంటున్నాయి. ఇలాంటి సమయంలో మదగజరాజా సినిమాను విడుదల చేయడం ద్వారా కచ్చితంగా పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకోవడం మాత్రమే కాకుండా సినిమాకు మంచి వసూళ్లు సొంతం చేసుకోవచ్చు అనే నమ్మకంతో నిర్మాతలు సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో హర్రర్ సినిమాలకు పెట్టింది పేరుగా నిలుస్తున్న దర్శకుడు సుందర్ సి దర్శకత్వం వహించగా హీరోగా వరుస సినిమాలు చేస్తున్న విజయ్ ఆంటోనీ అప్పట్లో సంగీతాన్ని అందించాడు. సినిమాకు అప్పట్లోనే పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది.

## న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌ని వెనక్కి నెట్టి.. చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్న టీమిండియా..!




**మెల్‌బోర్న్- నవభూమి:** ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా చెత్త ప్రదర్శన కొనసాగుతున్నది. శుక్రవారం మొదలైన సిడ్నీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో మరోసారి విఫలమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 185 పరుగులకు కుప్పకూలింది. టీమిండియా 72.2 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యింది. 40 పరుగులతో రిషబ్ పంత్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మను టీమ్ మేనేజ్‌మెంట్ పక్కన పెట్టింది. అయినా, టీమిండియా బ్యాటింగ్‌లో పెద్ద తేడా మాత్రం కనిపించలేదు.

మ్యాచ్ స్టేటస్..బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో చివరిదైన ఐదో టెస్ట్ తొలిరోజు ఆట ముగిసింది. భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోర్‌కే ఆలౌట్ చేసిన ఆస్ట్రేలియా.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగింది. ఆతిథ్య జట్టు స్టంప్స్‌కు ఒక వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. తొలిరోజు ఆట చివరి బంతినికి ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (2రన్స్) అవుట్ అయ్యాడు. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో కేఎల్ రాహుల్‌కు క్యాచి ఇచ్చి అవుట్ అయ్యాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 176 పరుగులు వెనుకంజలో ఉన్నది. ప్రస్తుతం సామ్ కాన్‌స్టాస్ నాటౌట్‌గా ఉన్నాడు.అత్యధిక సార్లు ఆలౌట్ అయిన రెండోజట్టు భారత్..టీమిండియా ఓ చెత్త రికార్డు సృష్టించింది. 2024 నుంచి అత్యధిక సార్లు టెస్టుల్లో 80 ఓవర్లలోపు ఆలౌట్ అయిన రెండో జట్టుగా భారత్ నిలిచింది. ఇప్పటి వరకు టీమిండియా 14 సార్లు టెస్టుల్లో 80 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయలేకపోయింది. ఈ జాబితాలో ఇంగ్లండ్ అగ్రస్థానంలో ఉన్నది. ఇంతకు ఈ రికార్డు న్యూజిలాండ్, బంగ్లాదేశ్ పేరిట ఉండేది. ఆయా జట్లు 13సార్లు.. 80 ఓవర్లు ఆడకుండానే ఆలౌట్ అయ్యాయి. ప్రస్తుతం టీమిండియా.. ఆయా దేశాలను అధిగమించాయి.

2000 నుంచి మూడోసారి..సిడ్నీ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 200 పరుగులు చేయడంలో విఫలమైంది.

## మళ్లీ విఫలమైన టీమిండియా.. సిడ్నీ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 185 ఆలౌట్



**సిడ్నీ-నవభూమి:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న సిడ్నీ టెస్టులో.. ఇండియా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. చివర్లో కెప్టెన్ బుమ్రా కొన్ని మెరుపులు మెరిపించాడు. అతను 22 రన్స్ చేసి ఔటయ్యాడు. బుమ్రా ఇన్నింగ్స్‌లో మూడు బౌండరీలు, ఓ సిక్సర్ ఉన్నాయి. బోలాండ్, కమ్మిన్స్ బౌలింగ్‌లో బుమ్రా కొన్ని డేరింగ్ షాట్స్ ఆడాడు. అయితే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఇండియా మరోసారి తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో విఫలమైంది. కనీసం 200 రన్స్ కూడా చేయలేకపోయింది.

ఆస్ట్రేలియా స్పీడ్ బౌలర్లు దుమ్ము రేపారు. సిడ్నీ మైదానంలో స్పీడ్ బౌలర్లకే 9 వికెట్లు దక్కాయి. బోలాండ్ 4, స్టార్క్ 3, కమ్మిన్స్ రెండు వికెట్లు తీసుకున్నారు. అంతకముందు టాస్ గెలిచిన ఇండియా మొదట బ్యాటింగ్ ఎంచుకున్నది. ఇండియన్ టాప్ ఆర్డర్ మరోసారి పేలవ ప్రదర్శన ఇచ్చింది. జైస్వాల్ 10, రాహుల్ 4, గిల్ 20, కోహ్లీ 17, పంత్ 40 రన్స్ చేసి ఔటయ్యారు.

నవక్రీడ

## రిషబ్ పంత్ భారీ సిక్సర్.. నిచ్చెనెక్కి బంతిని తీశారు..



**సిడ్నీ-నవభూమి:** సిడ్నీ టెస్టులో రిషబ్ పంత్ ఓ భారీ సిక్సర్ కొట్టాడు. అతను కొట్టిన పవర్ షాట్‌కు.. బంతి ఏకంగా సైడ్‌స్క్రీన్‌పై చిక్కుకుపోయింది. బ్యూ వెబ్‌స్టర్ వేసిన 46వ ఓవర్‌లో .. పంత్ తన పవర్ స్ట్రోక్‌తో అలరించాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో పంత్ పలుమార్లు బౌలర్ల ఆగ్రహానికి గురయ్యాడు. అనేక బంతులు అతని శరీరానికి బలంగా తగిలాయి. కొన్ని దెబ్బలకు అతను ఫిజియో నుంచి చికిత్స కూడా తీసుకున్నాడు. అయితే వెన్నుచూపని పంత్.. కొత్త బౌలర్ వెబ్‌స్టర్ బౌలింగ్ లో లాంగ్ ఆన్ మీదుగా భారీ షాట్ కొట్టాడు. బంతి సైట్ స్క్రీన్‌పై చిక్కుకోవడాన్ని దాన్ని తీసేందుకు గ్రౌండ్ స్టాఫ్ రంగంలోకి దిగింది. నిచ్చెన వేసుకుని మరీ ఆ బంతిని తీశారు. ఆ షాట్ వీడియోను ఎంజాయ్ చేయండి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**